# LIFE OF THIKKANA SOMAYAJI

**(Author of Telugu Bharatam)**


BY

CHILUKURI VEERABHADRA RAO,

*Author of History of Andhras, Smiles Self Help in Telugu, Jeernakarnata Rajyacharitram, Life of Timmarusu etc.,*



PUBLISHED BY

**SARADA PUBLISHING COMPANY,**

*185, Mount Road, Madras.*

**1917.**



*Copyright Registered.*]



[PRICE AS. 12.

ఆంధ్రభాషాభివర్ధనీసంఘము : 21.

# తిక్కనసోమయాజి

గ్రంథకర్త

చిలుకూరి వీరభద్రరావు పంతులుగారు,

ఆంధ్రులచరిత్రము, స్వయంసహాయము, జీర్ణకర్ణాటక రాజ్యచరిత్రము,
తిమ్మరుసుమంత్రి మొదలగు గ్రంథములకు కర్తలు.

ప్రకాశకులు

శారదా పబ్లిషింగు కంపెనీ,

185, మౌంటురోడ్డు, మద్రాసు.

1917

కాపీరైటు రిజిస్టర్డు.]

[వెల రు. 0-12-0

# పరిశీలించిన గ్రంథములు.

౧ ఆంధ్రులచరిత్రము (౨-వ భాగము)

౨ ఆంధ్రకవులచరిత్రము (ప్రథమభాగము)

౩ ఆంధ్రకవిజీవితములు

౪ దశకుమారచరిత్రము (కేతనకవి)

౫ నిర్వచనోత్తరరామాయణము

౬ శ్రీమదాంధ్ర మహాభారతము

౭ నెల్లూరుశాసన సంపుటములు

౮ సోమదేవరాజీయము

౯ ప్రతాపచరిత్రములేక సిద్ధేశ్వరచరిత్రము ప్రాచ్యలిఖిత పుస్తక భాండారము (చెన్నపురి)

౧౦ కాటమరాజుకథ

౧౧ భాస్కరోదంతము (విమర్శగ్రంథము.)

౧౨ దక్షిణహిందూదేశపు శాసనములు. సంపుటము ౩.

౧౩ ఆంధ్రపత్రిక సంవత్సరాదిసంచిక (1911)'తిక్కనసోమయాజి చరిత్ర'మను శీర్షికతో జె. కృష్ణరావు, బి. ఏ., బి.ఎల్., గారు వ్రాసినవ్యాసము.

౧౪ ఇండియన్ ఆంటిక్వేరీ, సంపుటము ౨౧.

౧౫ ఎపిగ్రాఫియా ఇండికా. సంపుటము ౭.

ఇంకను దొరతనమువారిచే ప్రకటింపఁబడు ప్రతిసంవత్సర వృత్తాంతములు మొదలగునవి.

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| మొదటి యధ్యాయము. | | | పేజి. |
| ౧ తిక్కనవంశము-మంత్రి భాస్కరుఁడు | | | |
| ౨ కొమ్మనదండనాధుఁడు | | | |
| రెండవ యధ్యాయము | ... | ... | ౯ |
| ౧ తెలుఁగు చోడరాజులు | | | |
| మూఁడవ యధ్యాయము | ... | ... | ౨౧ |
| ౧ తిక్కనజన్మాదికము | | | |
| ౨ తిక్కనబాల్యదశ-వేదవిద్యాభ్యసనము | | | |
| ౩ తిక్కనరూపము | | | |
| నాలుగవ యధ్యాయము | ... | ... | ౩౩ |
| ౧ మనుమసిద్ధిరాజు-తిక్కనమంత్రి | | | |
| ౨ మనుమసిద్ధినాటి కాలస్థితి | | | |
| ౩ మనుమసిద్ధి శత్రురాజులను జయించుట | | | |
| ౪ బ్రాహ్మణులకును వెలమలకును వివాదము | | | |
| అయిదవ యధ్యాయము | ... | ... | ౪౮ |
| ౧ అక్కనబయ్యనల దండయాత్ర | | | |
| ౨ విమర్శనము | | | |
| ఆఱవ యధ్యాయము | ... | ... | ౬౧ |
| ౧ కాటమరాజు మనుమసిద్ధిరాజుల యుద్ధము | | | |
| ౨ ఖడ్గతిక్కన విక్రమపౌరుషాదులు | | | |
| ఏడవ యధ్యాయము | ... | ... | ౭౨ |
| ౧ నిర్వచనోత్తరరామాయణము | | | |
| ఎనిమిదవ యధ్యాయము | ... | ... | ౮౩ |
| ౧ కవిపండితగోష్ఠి | | | |
| తొమ్మిదవ యధ్యాయము | ... | ... | ౯౦ |
| ౧ ఆంధ్రమహాభారతరచనము. | | | |

# పీఠిక

అప్రతిమానమ్మైన ప్రతిభా విశేషమును జూపి శ్రీమదాంధ్ర మహాభారతమును విరచించి సర్వాంధ్రలోకపూజ్యుఁడైన తిక్కనసోమయాజి పవిత్రజీవితము ప్రత్యేకసంపుటముగా నుండుట అత్యంతోపయుక్తమను భావముతోఁ దెలిసినంత వఱకుఁ గవినిగూర్చిన విషయములను జేర్చి నేనీ చిన్నగ్రంథమును రచించినాఁడను. తెలిసినంతవఱకుఁ దిక్కనజీవితమును సులభముగా మహాజనులెల్లరును దెలిసికొనుటకొఱకే నేనీగ్రంథమును రచించినాఁడనుగాని తిక్కనసోమయాజి భారతాంధ్రీకరణమును గూర్చి కాని, కవిత్వమును గూర్చి కాని విపులముగా విమర్శించి గుణదోషములను బ్రకటింపవలెనను దలంపుతో గ్రంథరచనము గావించి యుండలేదు. ఈగ్రంథమును వ్రాయుటకొఱకు నేను బరిశీలించిన గ్రంథములపట్టికను మఱియొక తావునఁ దెలిపియున్నాఁడను. తద్గ్రంథకర్తలకును, తద్విలేఖకులకును కృతజ్ఞతావందనముల నిందుమూలముగాఁ దెలుపుచున్నాఁడను. ఈకవి బ్రహ్మనుగూర్చి నూత్నవిశేషములు పొడగట్టినప్పుడు గ్రంథము విస్తరింపఁబడు ననుటకు సందియములేదు. ఇందలిదోషములను మన్నించి గుణములనే గ్రహింపవలయునని పాఠకమహాశయులను బ్రార్థించుచున్నాఁడను. చరిత్రమునకు భిన్నముగానుండిన 'నన్నయభట్టు, తిక్కనసోమయాజులఁ' గూర్చినకల్పనాకథలనన్నిటిని గ్రంథవిస్తరభీతిచే నిందు విడిచిపెట్టినాఁడను. స్థలాంతరమున నుండుటచే నిందచ్చుతప్పు లచ్చటచ్చటఁ బడుట సంభవించినది గావునఁ జదువరులు వానిని మన్నించి సవరించి చదువుకొనవలయునని విన్నవించుకొనుచున్నాఁడను.

రాజమహేంద్రవరము,
8-10-17.

చిలుకూరి వీరభద్రరావు.

# భూమిక

ఆంధ్రభాషాభివర్ధనీ సంఘమువారిపక్షమున మేము ప్రకటించుటకిది మూడవగ్రంథము. వెనుకటి గ్రంథములను ప్రకటించుకొనినప్పుడు వెల అధికముగ నున్నదని విన్నవించుకొనియున్నాము. ఇప్పుడు అంతకంటెను వెలలధికమగుటయేగాక వలయు కాగితమునకు గూడ క్షామము పట్టినది. ఎట్టి కష్టములకులోనైనను గ్రంథ ప్రకటనమును మాననిష్టములేక ప్రకటించుచున్నాము.

ఇప్పుడచ్చులో ఇదివరకు ఆంధ్రమున ప్రకటింపబడని ఉద్గ్రంథములు రెండున్నవి. వానిలో ఒకటి, ఇండియాదేశ ఐశ్వర్యమును గూర్చిన గ్రంథము. రెండవది రెండువేలసంవత్సరముల హిందూదేశ నౌకాచరిత్రము. ఈరెండింటిలో నొక గ్రంథమును డిశంబరు నెలలో చందాదార్లకు పంపుకొనెదము. ఇట్టిసంఘములు చేయు భాషాభివృద్ధి అభిమానుల యాదరముపైన నాధారపడియుండును. గనుక మంచిచెడ్డల నారసి చదువరులు మా యుద్యమమునకు తోడ్పడ ప్రార్థించుచున్నాము.

శారదా పబ్లిషింగు కంపెనీ.

# తిక్కన సోమయాజి

## మొదటి యధ్యాయము

“సీ. సుకవీంద్రబృందరక్షకుఁ డెవ్వఁ డనిన వీఁ
డనుమాటకుఁ దోడ యైన వాఁడు,
చిత్తనిశ్చితశివుఁ డెవ్వఁ డనిన వీఁ
డనుశబ్దమున కర్థ మైనవాఁడు,
దశదిశావిక్రాంతయశుఁ డెవ్వఁ డనిన వీఁ
డని చెప్పుటకుఁ బాత్ర మైనవాఁడు,
సకలవిద్యాకళాచణుఁ డెవ్వఁ డనిన వీఁ
డని చూపుటకు గుఱి యైనవాఁడు,

గీ. మనుమసిద్ధిమహీశ సమస్తరాజ్య
భారధౌరేయుఁ డభిరూప భావభవుఁడు
కొట్టరువు కొమ్మనామాత్యు కూర్మిసుతుఁడు
దీనజనతానిధానంబు తిక్కశౌరి.”

(కేతన)

“మ. తన కావించినసృష్టి తక్కొరులచేతం గాదు నా నేముఖం
బునఁ దాఁ బల్కినఁ బల్కు లాగమము లై పొల్పొందు నా వాణి న
త్తనుపీఠం బొకరుండు నాఁజను మహావ్యాప్తిం గవిబ్రహ్మ నా
వినుతింతుం గవితిక్కయజ్వ నఖిలోర్వీదేవతాభ్యర్చితున్.”

(ఎఱ్ఱాప్రెగ్గడ)

## తిక్కన వంశము. మంత్రి భాస్కరుఁడు.

బ్రహ్మర్షి యగు గౌతమునిపావనగోత్రంబున మారెన మంత్రి జనించెను. మారెనపూర్వులు కొట్టరువుగ్రామంబునఁ బెద్దకాలము నివసించినవా రగుటంజేసి వారికి గొట్టరువువా రని యింటిపేరు గలిగినది. కొట్టరువు మారెనమంత్రికిఁ గేతనయు నాతనికి భాస్కరమంత్రియు జనించిరి. ఆకాలమునం దాఱువేల నాటిలోఁ (గుంటూరుమండలము) ప్రఖ్యాతి కెక్కిననియోగి బ్రాహ్మణ కుటుంబములలో మంత్రిభాస్కరుని కుటుంబ మొక్కటి. కొట్టరువు వంశమున భాస్కరమంత్రి యుదయించి పండ్రెండవశతాబ్దాంతమునఁ బూర్వచాళుక్యచోడ చక్రవర్తులకుఁ బ్రతినిధులై వేఁగిదేశ మని వ్యవహరింపఁబడు నాంధ్ర భూభాగమును బరిపాలించుచున్న చాళుక్యరాజుల యధికారముక్రిందను గుంటూరిసీమను బరిపాలించు విఖ్యాతిఁ గాంచెను. ఆకాలమునఁ బూర్వచాళుక్యచోడచక్రవర్తికి నామమాత్రప్రతినిధియై పృథ్వీశ్వరమహారాజు ధనదుపురము (చందవోలు) రాజధానిగా విక్రమసింహపురము మొదలుకొని సింహాచలము పర్యంతము నాంధ్రదేశమును బరిపాలించుచుండెను. పృథ్వీశ్వరుఁడు చాళుక్యచోడచక్రవర్తికి లోఁబడినవాఁ డని చెప్పుకొనఁ బడుటయేగాని క్రీ. శ. ౧౨౯౯. వఱకును స్వతంత్రుఁడై పరిపాలనము చేసెను. అతనిక్రిందియధికారులలో నొక్కఁడై గుంటూరిసీమను బరిపాలించినవాఁడు మంత్రి భాస్కరుఁడు.

తిక్కనసోమయాజి గూడ తననిర్వచనోత్తరరామాయణములో

“ సార కవితాభిరాము గుంటూరు విభుని
మంత్రి భాస్కరు మత్పితామహునిఁ దలఁచి ”

అని మంత్రిభాస్కరుని గుంటూరివిభుని గాఁ జెప్పి యుండెను. మంత్రిభాస్కరుఁ డొకసామాన్యకరణమే గాని ప్రాభవము గలవాఁడు గాఁ డనియు, అతఁడొకగొప్పకవియును గాఁ డనియు, తనవంశగౌరవమును దెలుపుకొనుట కై తిక్కన యట్లు చెప్పుకొనె ననుభావమును దేటపఱచుచు భాస్కరోదంత మను విమర్శగ్రంథమునఁ బరిహాసపూర్వకవ్యాఖ్యానము చేయఁ బడియెను. * నా తదితరవిమర్శనములను న్యాయైకదృష్టి డను నిష్పక్షపాతబుద్ధి డను బరిశీలించి చూచి నప్పుడుమాత్రము మన మాయభిప్రాయముతో నేకీభవింపఁ జాలము. అమలాచారుఁ డనియును, సాహిత్యవిద్యాపారీణుఁ డనియును, శాపానుగ్రహశక్తియుక్తుఁ డనియును, ధర్మమార్గపథికుఁ డనియును,

---

* ఈ విమర్శగ్రంథము శ్రీయుత కాశీభట్ల బ్రహ్మయ్యగారిచే వ్రాయఁ బడినది.

“ ఏకాలమునందు మంత్రిభాస్కరుఁ డుండె నని ప్రతిపక్షులు తలంచుచున్నారో యాకాలమున గుంటూరును బరిపాలించుచున్న ప్రభుఁ డొకఁడు గలఁ డని శాసనములవలనఁ దెలియ వచ్చుచున్నది. ఆకాలమున గుంటూరురాజ్యమునకుఁ బాలకుఁడు శ్రీమన్ మహామండలీక గుంటూరి మురయరాజు. అతనిమంత్రి బొల్లన. సేనాని రాయనిపెగ్గడయు నై నట్లుగా బెజవాడ మల్లేశ్వరస్వామివారి యాలయస్తంభమునఁ గలశాసనము

అర్థార్థిలోకావన వ్యాపారవ్రతుఁ డనియును, గౌరీపతి శ్రీపాద ప్రవణాంతరంగుఁ డనియును, విబుధశ్రేయస్కరుఁ డనియును అభినవదండినా వినుతి గాంచిన కేతనమహాకవి తనదశకుమార చరిత్రము నందు మంత్రిభాస్కరుని నభివర్ణించి యుండుటం జేసి మనమాతని నసామాన్యపురుషుఁ డనియే గ్రహింపవలసి యుండును. ఈమంత్రి భాస్కరుఁడు రామాయణమును మొదట రచింపఁగా నది యేకారణముచేతనో ఆరణ్యకాండము తక్క తక్కినకాండము లన్నియు శిథిలము లై పోవుట చేత హుళక్కిభాస్కరాదికవులు వానిం బూరించి రనియు, ఆరామాయణమే భాస్కరరామాయణ మనుపేరఁ బరగుచున్న దనియు నాంధ్రులచే విశ్వసింపఁ బడుచున్నది. కాని యిది

---

వలనఁ దెలియవచ్చుచున్నది. ఈశాసనమును బట్టి చూడఁగా గుంటూరు పాలకుఁడు గాని, మంత్రికాని, సేనానికాని మంత్రి భాస్కరుఁడు కాఁడని తోఁచుచున్నది.'' అనికాశీభట్ల బ్రహ్మయ్యగారు తమభాస్కరోదంత మను విమర్శన గ్రంథము నందు వ్రాసి యున్నారు. ఈశాసనము క్రీ. శ. ౧౨౧౬వ సంవత్సరమున వ్రాయఁ బడినది. ఈశాసనము వ్రాయఁబడినకాలమునఁ దిక్కభూపాలుఁడు జయంగొండచోళమండలము లోని పేరూరు నాడును బరిపాలించు చున్నవాఁడు. మంత్రిభాస్కరుని మూఁడవకుమారుఁ డగుసిద్ధనామాత్యుఁ డాతనికాప్తమంత్రిగ నుండె నని తెలిసికొని యున్నారము. కాఁబట్టి మంత్రిభాస్కరుఁ డింతకుఁ బూర్వము గొన్ని వత్సరముల క్రిందట నుండి యుండెను. అప్పు డీతఁడు గుంటూరునకుఁ బాలకుఁడు గా నుండె నని నమ్ముట కేవిధ మైన యభ్యంతర ముండును. (ఆం॥ చ॥ పే. ౬౭-౬౮)

యెంతవఱకు విశ్వాసపాత్రమో చెప్పఁజాలము. భాస్కర రామాయణముఁ గూర్చిన యథార్థకథన మింకను మఱుఁగున నేయున్నది. అయ్యది భావిపరిశోధనముల మూలమునఁ దెలిసికొనవలసి యున్నది.*

## కొమ్మనదండనాథుడు

మంత్రిభాస్కరునకు మహాసాధ్వి యగుకొమ్మమాంబ గర్భమున నల్వురు పుత్త్రు లుద్భవించి యఖండ యశోధనులై వర్ధిల్లిరి. వీరిలోఁ గడపటివాఁడైన కొమ్మనామాత్యుఁడు మంత్రి భాస్కరుని పిమ్మట గుంటూరిసీమను బరిపాలించెను. తనమహాభారతములోని విరాటపర్వమునందు తిక్కనకవి తనతండ్రిని,

"సీ. మజ్జనకుండు సన్మాన్యగౌతమగోత్ర
మహితుండు భాస్కరమంత్రి తనయుఁ,
డన్న మా బాపతి యనఘులు కేతన
మల్లన సిద్ధ నామాత్యవరుల,
కూరిమి తమ్ముండు గుంటూరివిభుఁడు కొ
మ్మన దండనాథుఁడు మధురకీర్తి,
విస్తరస్ఫారుఁ డాపస్తంబసూత్రప
విత్రశీలుఁడు సాంగ వేదవేది."

అను పద్యమునం దభివర్ణించి యుండుటచేత కొమ్మన దండనాథుఁ డనికూడఁ దేటపడుచున్నది. దండనాథుఁ డన సేనాధిపతి. గుంటూరివిభుఁ డనియు, దండనాయకుఁ డనియు వర్ణిం

* ఈ భాస్కర రామాయణమునుగూర్చి ఆంధ్రులచరిత్రములోఁ బదుమూఁడవ ప్రకరణములో 'సాహిణిమారుఁడు భాస్కరరామాయణము' అనుశీర్షిక క్రిందను విశేషముగా జర్చింపఁబడి యున్నది.

పఁబడిన కొమ్మనామాత్యుని సామాన్యకరణముగా వాకొనుట మిక్కిలి శోచనీయము. మఱియును కేతనమహాకవి కొమ్మనామాత్యుని శౌచమున గంగాత్మజన్ముఁ డనియును, శౌర్యమున గాండీవధన్వుఁ డనియును, సూర్యవంశక భూపాల సుచిరరాజ్యవనవసంతుఁ డనియును వర్ణించి యుండుటగూడ నతఁడు దండనాయకుఁడుగ నుండె నని ధ్వనింపఁ జేసి తిక్కన సోమయాజి వర్ణనమును బలపఱచు చున్నదిగాని సామాన్య కరణముగా నుండె నని సూచింపు చుండలేదు. కొమ్మనా మాత్యుఁడు పృథ్వీశ్వర మహారాజుకాలములో గుంటూరున దండనాయకుఁడుగా నుండి యామహారాజు పండ్రెండవ శతాబ్ద్యంతమున విక్రమసింహపు రాధీశ్వరుఁ డైనమనుమసిద్ధిరాజు కుమారుఁ డైన తిక్కరాజుతో యుద్ధము చేసి వానిచేఁ జంపఁబడి నందునఁ దరువాత దాను సూర్యవంశ్యు లైన తెలుఁగు చోడరాజుల కొల్వులోఁ బ్రవేశించి ప్రఖ్యాతుఁడై యుండును. అట్లు గానియెడల కేతనకవి కొమ్మనామాత్యుని 'సూర్యవంశక భూపాలసుచిర రాజ్యవనవసంతుఁ' డని యూరక వర్ణింపఁడు. అతని మూఁడవఁ యన్న యగు సిద్ధనామాత్యుఁడు తిక్కరాజునకు మంత్రియు సేనాపతియు నై యుండుటచేత కొమ్మనా మాత్యుఁడు గాని వాని మరణానంతరము కుమారుఁడు తిక్కనగాని గుంటూరు మండలమును విడిచి నెల్లూరునకుఁ బోయి యుందురు. కొమ్మనామాత్యుని మూఁడవయన్న యగుసిద్ధనామాత్యుఁడు తిక్క

రాజున కాప్తమంత్రియు సేనాపతియు నై యుండె నని దశకుమార చరిత్రములోని,

"ఉ. స్థాపితసూర్యవంశ వసుధాపతినాఁ బరతత్త్వధూతపా
ణీపతినా నుదాత్తనృపనీతి బృహస్పతినా నృహస్థగా
రీపతినా గృపారససరిత్పతినాఁ బొగడొందె సిద్ధిసే
నాపతి ప్రోడ తిక్కజననాథ శిఖామణి కాప్తమంత్రియై"

అనుపద్యములో విస్పష్టముగా వివరింపఁబడి యున్నది. సిద్ధనామాత్యుఁడు తిక్కరాజునకుఁ మంత్రిగా నుండె నని తెలిపెడి శాసన మొకటి నెల్లూరుమండలమునఁ గలదు.* సిద్ధనామాత్యుఁడు తిక్కరాజునకు మంత్రియు సేనాపతియు నై యుండ వానితమ్ముఁ డైన కొమ్మనామాత్యుఁ డెక్కడనో గుంటూరున నూరును బేరును లేకుండఁ గరిణీకముఁ జేసికొనుచుఁ బారు చుండెననుట విశ్వాసపాత్రము గాదని వేఱుగ నొక్కి వక్కాణింప నక్కఱ లేదు. మంత్రిభాస్కరుని వంశము పదుమూఁడవ శతాబ్దిలో ప్రఖ్యాత మైనదనుట సత్యమునకు విరుద్ధముగాదు. మంత్రిభాస్కరునితండ్రి కేతన కమ్మనాటిని బరిపాలించిన త్రిభువన మల్లదేవచోడునకు మంత్రిగ నుండె నని తెలియుచున్నది. మంత్రి భాస్కరుని పుత్త్రులైన కేతన మల్లన మంత్రులు కమ్మనాటి చోడులకొల్వులోఁ బ్రఖ్యాతులై యుండిరి. మంత్రిభాస్కరుని మూఁడవకుమారుఁ డైన సిద్ధన తిక్కరాజున కాప్తమంత్రిగను సేనాపతిగ నుండెను. భాస్కరుని నాలుగవ కుమారుఁడు

*See Nellore Inscriptions published by Messers Butterworth and Venugopal Chetti.

కొమ్మన గుంటూరునకు దండనాథుఁడుగ నుండెను. కొమ్మనామాత్యునిపుత్త్రుఁడు కవితిక్కన మనుమసిద్ధిరాజునకు మంత్రిగనుండెను. సిద్ధనామాత్యుని కుమారుఁడు ఖడ్గతిక్కన సిద్ధిరాజునకు మంత్రిగను సేనాపతిగ నుండెను. ఇట్లు తండ్రులును కొడుకులును మనుమలును మంత్రిత్వాది పదవులను వహించి యుండఁగా మంత్రిభాస్కరుఁడు సామాన్యగృహస్థుఁడని నన్నించుటకై ప్రయత్నించుట మిక్కిలి శోచనీయము. ఆకాలమునఁ బ్రఖ్యాతమైన మంత్రిభాస్కరునివంశము తామర తంపరవలె వర్ధిల్లుచుండెను. వాని నల్వురు పుత్త్రులకును సంతానము గలదు. మంత్రిభాస్కరుని మనుమలలోఁ జరిత్రమునఁ బ్రసిద్ధి గాంచినవారు సిద్ధనామాత్యుని పుత్త్రుఁడగు తిక్కనయును కొమ్మనామాత్యుని పుత్త్రుఁడగు తిక్కనయును నిరువురును మాత్రమె. కొమ్మనామాత్యుఁడు లౌకికాధికార ధూర్వహుండగుటయె గాక వైదికాచార నిష్ఠాపరుఁడై యుండె నని కూడ పవిత్రశీలుఁ డనియును, సాంగవేదవేది యనియును తిక్కన వర్ణించిన దానినిబట్టి విస్పష్టమగు చున్నది. ప్రాచీనకాలమున ద్రోణాచార్యాది ద్విజవర్యులు బ్రాహ్మణధర్మమును క్షత్రియ ధర్మమును రెంటినిగూడ సమర్థించుకొని నట్లుగా మంత్రి భాస్కరుఁడును వానికుమారులును మనుమలును గూడ సమర్థించుకొనుచు వచ్చిరి.

# రెండవ యధ్యాయము

## తెలుఁగు చోడరాజులు

కొట్టరువు భాస్కరమన్త్రి తనయులలో మూఁడవవాఁడగు సిద్ధన తిక్కభూపాలునకు మన్త్రిగను సేనాపతిగ నుండె ననియును, కొంతకాలము గడచిన పిమ్మట మన్త్రిభాస్కరుని నాలుగవ కుమారుఁడగు కొమ్మన దండనాథుఁడు గుంటూరు సీమ నుండి నెల్లూరునకు వచ్చి కాపురముండె ననియును మనము తెలిసికొని యున్నారము. తిక్కరాజు విక్రమసింహపుర మను బిరుదునామముచేఁ బ్రసిద్ధిగాంచిన నెల్లూరు ముఖ్యపట్టణముగాఁ జేసికొని తనరాజ్యమును గాంచీపురమువఱకును వ్యాపింపఁ జేసి నెల్లూరు, కడప, చిత్తూరు, చెంగల్పట్టు మండలములలోఁ జేరిన విశేషభూభాగమును బరిపాలించి ప్రఖ్యాతి కెక్కిన వాఁడు. ఇతఁడు తెలుఁగు చోడుల తెగలోని వాఁడు. తెలుఁగు దేశమునందలి చోడరాజులను తెలుఁగుచోడరాజు లనియును, తమిళ దేశమునందలి చోడరాజులను తమిళచోడరాజు లనియును, కన్నడదేశమునందలి చోడరాజులను కన్నడచోడరాజులనియును, ఇటీవలి చరిత్రకారులువ్యవహారనామములను గల్పించి మూఁడు తెగలవారినిగా విభజించి యున్నారు. గాని మొదట వీరెల్లరు నొక్క తెగవారుగానే యుండిరని చెప్పవచ్చును.

ఈసందర్భమునఁ దెలుఁగు చోడరాజుల చరిత్రమును జదువరు లెఱింగి యుండుట యత్యావశ్యకము గావునఁ బాఠకుల యుపయోగార్థము సంగ్రహముగా నిటఁ దెలుపుచున్నాఁడను.

తెలుఁగు చోడరాజులు సూర్యవంశపురాజు లైనట్లుగా నాంధ్రికవుల కావ్యముల యం దభివర్ణింపఁబడి యున్నారు. విష్ణునాభికమలమున బ్రహ్మయు, వానికిఁ మరీచియు, వానికిఁ గశ్యపుఁడును, వానికి సూర్యుఁడును, బుట్టిరఁట.* అట్టి సూర్యుని వంశమునఁ గరికాలచోడుఁడు జనించి చోడరాజకుటుంబముల కెల్లను మూలపురుషుఁ డై యొప్పెను. ఇతనితండ్రి జటచోడుఁ డనియును, ఇతఁ డయోధ్యను బాలించె ననియును, ఇతఁడు కావేరినది కానకట్టకట్టించి గట్టుపోయించె ననియు, తెలుఁగు చోడుల శాసనములలో నభివర్ణింపఁ బడియుండెను. ఇతఁడు త్రిలోచనపల్లవుని జయించె ననియును, కావేరినది కానకట్టకట్టించెననియు, తిక్కన సోమయాజి గూడ వర్ణించి యున్నాఁడు. §

---

* " ఉ. అంబుజనాభునాభి నుదయంబయి వేధ మరీచిఁ గాంచె లో
కంబుల కెల్లఁ బూజ్యుఁ డగు కశ్యపుఁ డాతనికిన్ జనించె, వి
శ్వంబు వెలుంగఁ జేయఁగ దివాకరుఁ డమ్మునిఁ సద్భవించె వా
నింబొగడం జతుశ్శ్రుతులు నేరక యున్నవి నావశక్యమే."
(తిక్కననిర్వచనోత్తర రామాయణము)

§ " శా. చేసేతం బృథివీశు లందుకొనఁ గాశిసింధుతోయంబులన్
జేసెన్ పజ్జన ముంగుటంబున హరించెం బల్లవోర్వీశును
ల్లాసం బొందఁగ, ఫాలలోచనము లీలం గట్టెఁ గావేరి, హే
లాసాధ్యాఖిల దిఙ్ముఖుండు కరికాల క్ష్మావిభుం డల్పుఁడే!"
(నిర్వచనోత్తర రామాయణము)

ఈకరికాలునకు మహిమానుఁడును, వానికిఁ గరికాలుఁడును, తొండమానుఁడును, దాసవర్మయు నను మూవురు కుమారులు గల రనియును శాసనములు దెలుపుచున్నవి. కరికాలునివంశమునఁ బిజ్జన జనించెను. ఇతనివంశము నుండి రెండు శాఖ లుద్భవించినవి. దాసవర్మ నుండి యొకశాఖ పుట్టెను. ౧ కరికాలుని వంశమునఁ బుట్టిన దాసవర్మ మొదట పాకనాటి విషయమును జయించి పొత్తపి పట్టణమును రాజధానిగఁ జేసికొని పరిపాలించె నఁట. ౨ ఈపొత్తపి రాజధానిగాఁ గలపొత్తపినాఁటిని బరిపాలించిన చోడులను గూర్చి వివరముగాఁ దెలుపుట కిప్పుడు సాధ్యము గాదు. పొత్తపిచోడుఁ డనునది పెక్కండ్రురాజులకు బిరుదువాచకముగా నుండెను. ఈపొత్తపినాఁటిని బరిపాలించిన దాసవర్మ సంతతి వారు కమ్మనాటి లోనికొట్ట్యదోనను రాజధానిగఁ జేసికొని పరిపాలించిరి. 3 వీరిచరిత్ర మిచటఁ దెలుపుట యనవసరవిషయము గావున విరమించు

---

౧. Annual Report on Epigraphy for 1899 Nos. 183 & 205.
ఆంధ్రుల చరిత్రము, రెండవభాగము, రెండవప్రకరణము చూడుఁడు.

౨ పొత్తపి యనునది కడపమండలములో పుల్లంపేట తాలూకాలోని టంగటూరునకు సమీపమునం దున్న పోతిపి యనుగ్రామమే గాని మఱి యన్యము గాదు.

3 ఈ కొట్ట్యదోనపట్టణ మిప్పుడు గుంటూరు మండలము లోని నరసారావుపేటకు సామీప్యము నందు కోణిదెన యనునామము తోఁ బరగుచున్నది.

చున్నాఁడను. దాసవర్మకు మథురాపట్టణమును జయించుట చేత మధురాంతకుఁ డనుబిరుదము లభించె నఁట. ఈ మధు రాంతకుని పేరును తిక్కన తననిర్వచనోత్తరరామాయణమున నుదాహరించియుండ లేదు. విక్రమసింహపురి చోడులలోఁ బెక్కం్రడు మధురాంతక పొత్తపిచోడుఁ డనుబిరుదు నామమును దమపేరులకుఁ జేర్చుకొని శాసనములలో వ్రాయించుకొనుచు వచ్చిరి. తిక్కనసోమయాజి మధురాంతక పొత్తపిచోడునిఁ బ్రశంసింపకపోయినను బిజ్జనమాత్రము నిర్వచనోత్తరరామా యణమున నభివర్ణించి యున్నాఁడు. * "ఈ బిజ్జలరాజు ౧౧౫౦ మొదలు ౧౧౬౭ సంవత్సరము వఱకు రాజ్యము చేసిన (చాళుక్య) త్రైలోక్యమల్లుని సేనాధిపతిగా నుండి, ౧౧౬౭ వ సంవత్సరమున కళ్యాణపురాధీశ్వరత్వమును తానే యపహరించి, లింగాయతమతమును స్థాపించిన బసవేశ్వరుని తోఁ బుట్టు వగుపద్మావతి యొక్కచక్కఁదనమునకు మక్కువ గొని యామెను వివాహమాడి తనమంత్రినిగాఁ జేసికొన్న యాబసవేశ్వరునిచేతనే చంపఁబడెను." అని, నెల్లూరి మనుమ సిద్ధి రాజుయొక్కపూర్వకుఁ డైన బిజ్జనయే చాళుక్యబిజ్జలుఁ డని యభిప్రాయపడి శ్రీవీరేశలింగము పంతులుగారు తమ

---

* చ. అతనికులంబు నందు నవతారి యుగాంతకృతాంతమూర్తి య
ప్రతిహపదాన్యతావిభవభాసి విలాసరతీశుఁ డప్రత
ర్కిత వివిధావధాన పరికీర్తిత నిర్మల వర్తనుండు సం
శ్రితనిధి పుట్టె బిజ్జన యశేషధరిత్రియు నుల్లసిల్లగన్.

యాంధ్రకవుల చరిత్రయం దట్లు వ్రాసి **యున్నారు.*** ఈబిజ్జన సూర్యవంశ్యుఁడు. కళ్యాణపురాధీశ్వరుఁ డైనబిజ్జలుఁడు చంద్ర వంశ్యుఁడు. కావున వీరిరువురకు నేవిధ మైనసంబంధమును లేదు. తిక్కన యీబిజ్జనను

"చ. పరుషపరాక్రముం డగుచుఁ బల్లవపీట నుదగ్రు లైన ప
న్నిరువురఁ నాతనిం గలయ నెన్ని యనర్గళవత్సరంబు మై
మురరిపుసన్నిభుండు పసముప్వ్యర గండడగంగఁ బెట్టెఁ దా
ఓరుదు వెలుంగ బిజ్జఁ డరిభీకరభూరిభుజాబలంబునన్.''

అని యభివర్ణించి **యున్నాఁడు.**

ఈబిజ్జన ఊజ్యపురియందు, శిఖరమున గరుడవిగ్రహము గలిగి యుండు నట్టి విజయస్తంభము నొక**దాని** నిర్మించె న**ని** యొక శాసనమున లిఖింపఁ **బడియెను.**§ ఈబిజ్జనవంశమునం**దే** మనుమసిద్ధిరాజు జనించి విశ్రుతిగాంచెను. ఇతఁడు చాళుక్య చోడచక్రవర్తి యైన మూఁడవకులోత్తుంగ చోడునకుఁ గప్పము

---

* కందుకూరి వీరేశలింగ కవికృత గ్రంథములు, సంపుటము. ౧౦ భాగము ౧, పేజి ౪౭. (౧౯౧౧-వ సంవత్సర ముద్రితగ్రంథము.)

§ కోయంబుత్తూరు మండలములో కొల్లేగాలము అను స్థలమునకు ౧౮ మైళ్ళదూరమున నున్న ఉజ్జపురమే ఊజ్యపుర మని డాక్టరు లూడర్సు గారు నిర్ధారణ చేసి యున్నారు. అయినను నెల్లూరిమండలములో సుళ్లూరుపేట డివిజనులో ఉచ్చూరు అనెడిగ్రామ మొకటి కలదు. ఇచ్చటి యక్షరశాసనములలో ఈగ్రామము ఉచ్చియూ రనివాడఁ బడి యున్నట్లుగా శాసనపరిశోధకులు వ్రాయుచున్నారు.

చెల్లించెడు సామంతుఁడై పండ్రెండవ శతాబ్ద్యంతమునను, పదు
మూఁడవ శతాబ్ద ప్రారంభమునను గావలి మొదలుకొని కాం
చీపురము వఱకుఁ గల దేశమునంతయుఁ బరిపాలించి నట్లు శాస
నములం బట్టి దెలియుచున్నది. ఇతఁడు శాసనములలో నల్లసిద్ధి
రాజని వ్యవహరింపఁ బడియెను. ఇతనికి మిక్కిలి పరాక్రమ
వంతుఁడైన తమ్ముసిద్ధిరాజను తమ్ముఁ డొకఁడు గలఁడు. వీని
శాసనములు నెల్లూరు, చిత్తూరు, చెంగల్పట్టు మండలములలోఁ
బెక్కులు గానంబడుచున్నవి. మనుమసిద్ధిరాజు మొదట విక్రమ
సింహపురము నందుగాక వల్లూరుపట్టణము రాజధానిగఁ జేసి
కొని మార్జవాడి (మహారాజపడి) రాజ్యమును బరిపాలనము
సేయుచుఁ గాంచీపురముపై దండెత్తిపోయి యారాజులవలనఁ
గప్పము గైకొనుచుండె నని దెలియుచున్నది. క్రీ.శ ౧౧౯౬-వ
సంవత్సరమునకుఁ దరువాత త్రిభువనవీరదేవుఁడైన మూఁడవ
కులోత్తుంగుఁ డసమానమైన గజబలంబుతోడ గాంచీపురముపై
దండెత్తివచ్చి వీరకృత్యము లనేకములను గావించి విరోధు
లయినరాజుల నెల్లరను జయించి కాంచీపురమును జొచ్చి
క్రోధాగ్ని చల్లాఱిన వెనుకఁ గాంచీపురము మొదలుగ నుత్తర
భాగము నంతటను గప్పము విధించి సామంతనృపతుల నుండి
గైకొనుచుండెను* ఈ మనుమసిద్ధిరాజునకుఁ దిక్కరాజు
జనించెను. శ్రీకాళహస్తిదేవుఁడు తిరుక్కాళత్తి దేవుఁ డని

---

* South Indian Inscriptions vol. iii. p. 218

ద్రావిడదేశమున వ్యవహరింపఁ బడుచుండెను. తిరుకాళత్తి శబ్దమె తెలుఁగులో తిక్కన యని వ్యవహరింపఁ బడుచున్నది. కావున, తిక్కన యనునది శ్రీకాళహస్తి దేవుని నామమె గాని మఱి యన్యము గాదు. పరాక్రమవంతుఁడైన తిక్కభూపతి తెలుఁగుచోడులలో సుప్రసిద్ధుఁడు. ఇతఁడసహాయశూరుఁడై బాల్యముననే యుద్ధములను జేసి విజయములను బొందుచు వచ్చె ననుటకు దృష్టాంతములు గలవు. ఇతఁడు శైశవము నందే వెలనాటి ప్రభువైన పృథ్వీశ్వర మహారాజుతో యుద్ధము చేసి రణరంగమున వానిమస్తకమును ద్రుంచి దానితోఁ గందుక క్రీడ గావించి నాఁడని తిక్కన తన నిర్వచనోత్తర రామాయణమున,

“ఉ. కేశవసన్నిభుండు పరిగీతయశోనిధి చోళతిక్కధా
త్రీశుఁడు కేవలుండె, నృపు లెవ్వరి కా చరితంబు గల్గునే,
శైశవలీల నాఁడు పటుశౌర్యధురంధరబాహుఁడైన పృ
థ్వీశనరేంద్రుమస్తకము నేడ్తెఱఁ గందుక కేళి సల్పఁడే”

అను పద్యములో నభివర్ణించి యున్నాఁడు. ఈపృథ్వీశ నరేంద్రుఁడు మనుమగొంకరాజునకు జయాంబికయందు దుద్భవించి రాజరాజ చాళుక్యచోడ చక్రవర్తికిఁ బ్రతినిధి యయ్యు సర్వస్వతంత్రుఁడై వేఁగిదేశమును బరిపాలించుచుండెను. కాఁబట్టి పృథ్వీశ్వరరాజు పంద్రెండవ శతాబ్ద్యంతమున నుండె ననుటకు సందేహము లేదు. ‘తనతండ్రి మనుమసిద్ధిరాజునకుఁ బిమ్మట తిక్కరాజు విక్రమసింహపురమునఁ బట్టాభిషిక్తుఁడై

మూఁడవ కులోత్తుంగ చోడునకు లోఁబడి యున్నవాఁడుగ నటించినను స్వతంత్రుఁడై పరిపాలనము చేసెను. తిక్కరాజు మూఁడవ కులోత్తుంగచోళుని గడపటి కాలమున మాత్ర ముండి యతని మరణానంతరము స్వతంత్రుఁడయినట్లు గన్పట్టు చున్నది.

ఇతఁడు స్వతంత్రుఁడైన వెనుక చోడసింహాసనమునకై చాళుక్యచోడులలో మూఁడవరాజరాజునకును మూఁడవరా జేంద్ర చోడునకును తగవులు గలిగి పరరాజుల సహాయమును గోరి యిరుపక్షములవారును బోరాడుటచేత గాంచీపురము పల్మాఱు సంక్షోభమున కాకర మగుచు వచ్చెను. కర్ణాట దేశ మును బరిపాలించు వీరసోమేశ్వరుఁడు (హొయిసలరాజు) రాజేంద్రచోడునిపక్షమును, మన యీతిక్కభూపాలుఁడు రాజ రాజుపక్షమును బూని యుద్ధములు చేయుచువచ్చిరి. కర్ణాటసింహ సోమేశ్వరుని తోఁబుట్టువు కుమారుఁడును, (మేనల్లుఁడు) పాండ్య మండలాధిపతియు నగు రెండవ మారవర్మ సుందరపాండ్యుఁ డును, మహాబలి పురాధీశ్వరుండును, పల్లవరాజు నగు కొప్పెరుం జింగదేవుఁడును (మహారాజసింహుఁడు) అనగా ద్రావిడులుఁ గర్ణాటులు నొక్కవంకను, తెలుఁగుచోడు లొక్కవంకను జేరి ఘోరయుద్ధములు జేసిరి. ఈయుద్ధములలో మొదట తిక్కరాజు నకే విజయము గలిగెను. తిక్కభూపాలుఁడు కదనరంగమున శత్రువుల నోడించి రాజరాజచోడుని సింహాసనము నందు నిలిపి

చోడస్థాపనాచార్యబిరుదమును బొంది యవక్రలీలను గాంచీపురమును గూడఁ బరిపాలించెను. ఈవిషయమునే తిక్కనసోమయాజి తననిర్వచనోత్తర రామాయణమున,

"మ. కమలాప్తప్రతిమానమూర్తి యగు నాకర్ణాటసోమేశు దు
ర్గమదోర్గర్వము రూపుమాపి నిజదర్పంబుం బ్రతిష్ఠించి లీ
లమెయిం జోళుని భూమిపై నిలిపి చోళస్థాపనాచార్య నా
మము దక్కం గొని తిక్కభూవిభుఁడు సామర్థ్యంబు చెల్లింపఁడే"

అనుపద్యములో స్పష్టముగా వివరించి యున్నాఁడు.

కేతనకవికూడ తనదశకుమారచరిత్రమున నవతారికలో

"సీ. బలిమిచేఁ బృథ్వీశువసుధేశు తలఁ ద్రుంచెఁ
గటకసామంతుల గర్వ మడచెఁ
గాళవపిభు నహంకారంబు మాన్పించెఁ
బాండ్యునిచేతఁ గప్పంబుఁ గొనియె
ద్రవిడమండలికు లందఱఁ దక్క గెలిచి చో
డని నిజరాజ్య పీఠమున నిలిపె
నెలుకుమన్నీల నివ్వెఱ పుట్టఁగా నేలె
వైరివీరుల నాపలూరు నోర్చె
యోధ హరిరాయ పెండ రుభయకటక
వీరుఁ డభినవభోజుఁ డాకారమదనుఁ
డవనిభారధౌరేయమహోత్కృవిజిత
దిక్కరీంద్రుఁడు ఘనచోళతిక్కనృపతి."

అనుపద్యమునఁ దిక్కరాజు పృథీశ్వరరాజు తలఁ ద్రుంచె నని చెప్పి యున్నాఁడు. కాంచీపురములోని అరుళాళప్పెరుమాళ్ళ యాలయములో క్రీ. శ. ౧౨౩౩-౩౪-గవ సంవత్సర
౧

మున నీతిక్కనృపతి పేరిట నొకదానశాసనము గానం బడుచున్నది. కావున నంతకుఁ బూర్వమె యీయుద్ధము జరిగి యుండునని యూహింపఁ దగును. ఈకారణముననే తిక్కరాజనేకులతో యుద్ధములు చేసి విజయములను బొంది ప్రఖ్యాతి కెక్కెను. దీనిని గూఁడ తిక్కనసోమయాజి తననిర్వచనోత్తర రామాయణమున,

"సీ. లకుమయ గురుముఁ గారికి నెత్తి వచ్చిన
గొనఁడె యాహవమున ఘోటకముల
దర్పదుర్జయు లగు నాయాదనృపతుల
ననిలోనఁ బఱపఁడే యాగ్రహమున,
శంభురాజాది ప్రశస్తారి మండలి
కముఁ జెర్చి యేలఁడే కంచి పురము,
జేది మండలము గాసిగఁ జేసి కాశవ
పతి నియ్యకొలుపఁడే పలచమునకు
గీ. రాయ గండగోపాలు నరాతిభయద
రాయ పెండారబిరుదాభిరాము నుభయ
రాయగండాంకు ఖండియరాయుఁ దిక్క
ధరణివిభుఁ బోలరాజుల కరిది గాదె"

అనుపద్యములో శంభురాజాది శత్రువులను జయించి కాంచీపురమును బాలించె నని తెలియఁ జేసి యున్నాఁడు. తిక్కరాజు పూర్వులు శైవమతావలంబకు లయినను తిక్కరాజు మాత్రము వైష్ణవభక్తుఁడై తనరాజ్యములోననేక విష్ణ్వాలయములను స్థాపించి వైష్ణవమతమునకుఁ బోషకుం

డై నటులు గనం బడుచున్నది. ''ఎవ్వఁడు శ్రీవరదరాజస్వామి చరణసరోరుహములను బూజింపుచున్నాఁడో అతఁడే నాకుఁ దల్లియుఁదండ్రియు,గురుఁడును, ధనమును,పుత్త్రుఁడును మిత్రుఁడు నగుచున్నాఁ'' డని చెప్పి అరుళాళప్పెరుమాళ్ళ దేవాలయములో నొకశాసనమున వ్రాయించుట యే యిందుకు దృష్టాంతము. ఇతఁడు వైష్ణవమ తావలంబకుఁ డయినను పరమతసహనము గలిగి యుండి నట్లే గానం బడుచున్నాఁడు. తిక్కన సోమయాజి మూఁడవ పెద్దతండ్రి యగుసిద్ధనామాత్యుఁడు తిక్కరాజునకు మంత్రిగనుండి యతనిమరణానంతరముఁ గూడఁ గొంతకాలము వఱకు జీవించి యుండి నట్లు గనంబడుచున్నది. తిక్కరాజునకు గరికాలభూవిభుఁ డనినామాంతరముగలదనియు, ఇతఁడు విద్వాంసుఁడై, కవిసార్వభౌమ బిరుదమును వహించి యుండె ననియుఁ గూడ నిర్వచనోత్తర రామాయణములో

''సీ. భృత్యానురాగంబు పెంపుఁ జెప్పఁగ నేల
పరివారసన్నాహ బిరుదు గలుగ,
వందిప్రియత్వంబు వర్ణింపఁ గా నేల
పాఠకపుత్త్రాఖ్య పరగుచుండ
సకలవిద్యాపరిశ్రమముఁ దెల్పఁగ నేల
కవిసార్వభౌమాంక మవనిఁ జెల్ల,
సుభగతామహిమఁ బ్రస్తుతి సేయఁగా నేల
మన్మథనామంబు మహిమ నెగడ,
గీ. నుభయబల వీరుఁ డను పేరు త్రిభువనములఁ
బ్రచురముగ ఘోరబహుసంగరముల విజయ

లక్ష్మిఁ జేకొను బాహుబలంబుసొంపు
పొగడ నేటికిఁ గలికాలభూవిభునకు. ''

అనుపద్యములోఁ దెలుపఁ బడియున్నది. తిక్కనకవి తిక్క రాజును సకల విద్యాపరిశ్రమముగలవాఁ డనియు, కవిసార్వభౌమబిరుదముచే నొప్పినవాఁడనియు, వర్ణించియున్నాఁడె కాని యాతఁడు రచించినగ్రంథము లెవ్వియో పేర్కొన్నవాఁడు గాఁడు.

సిద్ధనామాత్యునితమ్ముఁ డైన కొమ్మనామాత్యుఁడు తిక్కనసోమయాజి బాలుఁడై యుండగనే స్వర్గస్థుఁ డయ్యె ననితలంపవలసి యున్నది. తిక్కన తనమూఁడవ పెద్దతండ్రి యగు సిద్ధనామాత్యుని కడనే యుండి వేదశాస్త్రాదివిద్యల నభ్యసించి పెద్దవాఁడై మహాపదవి నధిష్ఠించినట్లు తోఁచుచున్నది. తిక్కరాజునకు రాయగండగోపాలుఁ డనుబిరుదనామము గలదు. ఈతిక్కరాజు క్రీ. శ. ౧౨౫౦ వఱకును బరిపాలనముచేసెను. ఇతని వెనుకఁ గుమారుఁడు మనుమసిద్ధి రాజ్యమును బొందెను.

# మూడవ యధ్యాయము.

## తిక్కన జన్మాదికము.

తిక్కనజన్మస్థానముగాని, జన్మసంవత్సరముగాని మనకుఁ దెలియరాదు. తిక్కన కొమ్మనామాత్యునకు సదాచారసంపన్నయు, సుగుణశీలయు, మహాపతివ్రతయు నైన అన్నమాంబగర్భమున నొకశుభముహూర్తమున జనించెను. ఇట్టి సుపుత్త్రుఁడు తమకు జనించినందులకుఁ బరమానందమును బొందుచు, దల్లిదండ్రులు జాతకర్మప్రముఖ సంస్కారంబులు యథావిధిగా నెఱవేర్చి తిక్కన యని శ్రీకాళహస్తిదేవుని తెనుఁగుపేరు పెట్టిరి. తిక్కనసోమయాజితండ్రియును, దాతయును గుంటూరివిభులుగా నున్నట్లు నిర్వచనోత్తరరామాయణావతారికయును, ఆంధ్రమహాభారతములోనివిరాటపర్వావతారికయును దెలుపుచున్నందునఁ దిక్కన జన్మస్థానము గుంటూరై యుండు నని యూహించుట కెక్కువ హక్కుగలదు గాని గుంటూరే జన్మస్థాన మని నిర్దేశించుటకు బలవత్తర మగురుజువంతకంటె నధికము గానరాదు. ఆకాలమునఁ దల్లిదండ్రులు దమకొమాళ్ళకుఁ దిక్కన యనినామకరణముఁ జేయుట కాళహస్తిసమీపమండలవాసులలోఁ గానంబడునుగాని గుంటూరు

మండలవాసులలో నంతగాఁ గానంబడదు. ఆహేతువుచేత తిక్కన జన్మస్థానము కాళహస్తికి సామీప్యమున నుండు నెల్లూరే యనుట కెక్కువహక్కు గలదు గాని నెల్లూరే జన్మస్థాన మని నిర్దేశించుటకు బలవత్తరమగు రుజు వంతకంటె నధికము గానరాదు. అయినను తిక్కన జన్మస్థాన మిదియని సహేతుకముగా నిర్ధారించుటకుఁ జాలినంతలిఖితమూలము లభ్య మగునంతవఱకును జన్మస్థాన మిదమిత్థ మని నిశ్చయింపఁ జాలను. కాని తిక్కనసోమయాజి నిజస్థానము నెల్లూరని ఘంటాపథముగఁ జాటవచ్చును. తిక్కనజన్మస్థాన మెద్దియైనను తిక్కన వాసస్థలము నెల్లూరు కాదను వాదము గూడఁ గలదు. ఆవాదమునుగూడ విమర్శింతము. ఇట్టివాదము 'కవిజీవితము' లనుగ్రంథమునందుఁ గానంబడు చున్నది. అం దిట్లున్నది.

" నెల్లూరుప్రభుఁ డగుమనుమసిద్ధిరాజు పేరిట సోమయాజి తననిర్వచనోత్తరరామాయణము కృతియిచ్చుటం జేసియు, భారతము హరిహరనాథుని పేరిటఁ గృతియిచ్చుటచేతను నీతఁడు నెల్లూరు వాసస్థుఁ డనువాడుక గల్గినది. ఇందు మొదటిగాథను బట్టి అక్కడ నివాసము స్థిరపఱుప వీలు లేదు. పూర్వము కవీశ్వరులు దేశదేశములు తిరిగి, ఎక్కడరసికులగు ప్రభువు లుందురో అక్కడఁ గొన్నిదినంబు లుండి యాప్రభుని కొకకృతి యిచ్చి బహుమతుల నంది మరల స్వస్థలమునకుఁ బోవుచుండు నాచారము గలదు. అటులనే సోమయాజియుఁ జేసి యున్నాఁడని ఆతని రెండవగ్రంథ మగుభారతములో మనుమసిద్ధి యాస్థానములోని వాడ నని యుచ్చరింపఁ బడకపోవుటచేత నిస్సంశయముగాఁ జెప్ప నొప్పియున్నది. ఇఁక రెండవ శంకకు సమాధాన మెట్లన్న, భారతములో స్మరింపఁబడిన హరిహరనాథుఁ

డు అర్చావతారరూపుఁడై నెల్లూరున వేంచేసియున్న హరిహరనాథుఁడు కాక కేవలమును నద్వైతుల కుపాస్యుం డగు హరిహరులకు నధినాథుఁ డగునద్వయ నిర్గుణబ్రహ్మ మని భారతములోని యాశ్వాసాద్యంతపద్యముల నద్వైతశాస్త్రసంప్రదాయమునఁ జూచిన స్పష్టము కాఁగలదు. కావున పైరెండు యుక్తులును సోమయాజి నెల్లూరుపురవాసి యని చెప్పుటకుం జాలవు. భారతరచనాపూర్వకాలములో సోమయాజి కాశీయాత్రఁ జేయుచుఁ గాశినుండి యీగ్రంథరచనకు వచ్చి యున్నాఁడని చెప్పెడు సంప్రదాయజ్ఞవాక్య ముభయపక్షములలో నిర్బాధకమే అయి యున్నది."

కవి జీవిత గ్రంథకారుని పై వాక్యములను మనమంతగాఁ బాటింప వలసినపని లేదు. నెల్లూరుమండలచరిత్రమును గూర్చి కాని కేతన కవికృతమై తిక్కనకంకితము గావింపఁబడిన దశకుమారచరిత్రమును గూర్చి గాని తెలియనికాలమున నా గ్రంథకర్త యట్లువ్రాసి యుండెను. ఎక్కడ రసికులగు ప్రభువులుందురో అక్కడఁ గొన్నిదినంబు లుండి యాప్రభుని కొక కృతి యిచ్చి బహుమతుల నంది మరల స్వస్థలమునకుఁ బోవు నట్టియాచారముగల కవులసంఘము లోనివంటి వాఁడుగాక తిక్కనకవి ప్రభుకోటిలోఁ జేరిన వాఁడై యున్న వాఁడు. తిక్కన కవి మాత్రుఁడే గాఁడు. మంత్రియు సేనాపతియుఁ గూఁడ నై యున్న వాఁ డని దశకుమార చరిత్రావతారిక వలన స్పష్టమగుచున్నది. ఇంతియగాక కర్మిష్ఠుఁడై బహువిధయాగము లనేకము లొనరించుటయు, అగ్రహారములు మొదలగువాని నొసంగి కవిపండితకోటిని సన్మానించుటయు మొదలుగాఁ గలవానిని

పరిశీలించినప్పుడు తిక్కన నెల్లూరుపురవాసి కాఁడని యెవ్వనికి సందేహము జనింపఁ గలదు? మహాభారతాంధ్రీకరణమునకై తిక్కన సోమయాజి కాశినుండి వచ్చినాఁ డని చెప్పెడు కథ పుక్కిటి పురాణముగాని విశ్వాసపాత్రము కాదు. మనుమసిద్ధిరాజు పేరుగాని, నెల్లూరు పురనామముగాని యాంధ్రీకృత భారతమునఁ గానరాకపోయినను తిక్కన నెల్లూరు పురవాసి కాఁడని చెప్పుట సాహస మనిపించుకొనును. తిక్కన వానిను దాహరింప కుండుటకు వేరుకారణములు గలవు. అయ్యవి క్రమముగా బోధపడఁగలవు. వేయునేల? అభినవదండినా వినుతి గాంచిన కేతనమహాకవి తనదశకుమార చరిత్రములో "కొట్టరువు తిక్కనామాత్యునకు నిజస్థానంబగు విక్రమసింహపురం బభివర్ణించెద" నని

"సీ. కరిఘటానిలయంబు తురగజన్మస్థలి
సుభటనివాసంబు సుకృతకర్మ,
కర్మఠద్విజగణాకరము రాజన్యవం
శావాస మర్యవర్యాశ్రమంబు
కర్షకాగారంబు కవిబుధసదనంబు
సుందరీ శృంగార మందిరంబు
ధనధాన్యసంగ్రహస్థానంబు ధర్మద
యాచార విద్యావిహారభూమి

తైలఘృతలవణాది సద్ద్రవ్యపాల
మమలబహువిధ రత్నరత్నాకరంబు
మధురజలపూర కాసారమండలంబు
నాగవిక్రమ సింహాఖ్యనగర మొప్పు."

అను పద్యమును జెప్పి నెల్లూరును వర్ణించినదానిఁ జూపుట కంటెఁ దిక్కన నెల్లూరుపురవాసి యనుటకు వేఱొండు రుజువు మఱి యేమికావలయును?

## తిక్కనబాల్యదశ-వేదవిద్యాభ్యసనము.

ఈమానవ ప్రపంచమునందు ధర్మోపదేష్టలై విఖ్యాతిఁ గాంచిన మహాపురుషులలో స్వప్రజ్ఞలను జూపి యడ్డంకుల నెల్లఁగడచి యున్నతపీఠముల నధిష్ఠించిన వారిలోన నేకులు బీదల యిండ్ల నేజనించిరి. మనతిక్కనామాత్యునివలెఁ బుట్టుకతోడనే ప్రాభవము గలిగి పుట్టిన యదృష్టశాలి లోకములో నూటికిఁ గోటికి నెక్కడనేని నొక్కఁడు గలఁడేమో? ప్రాభవము గలిగిన ప్రభువంశమున జనించి ప్రతిభాశాలియై యాంధ్రప్రపంచ మజ్ఞానాంధకారమునఁ బడి కన్నుఁగానక తడవుకొనుచు తపించుచున్న కాలమున జ్ఞానతేజస్సును బఱపి సముద్ధరించి యానందాబ్ధి నోలలాడింతు నని ప్రతిజ్ఞాదీక్షను వహించి సార్థక జన్ముఁడైనధన్యుని బాల్యదశ యిట్టిదని తెలుపు లిఖితమూలమేదియును నేఁడు ప్రత్యక్షముగా నెదుట గానరాకున్నను బరిశ్రమఁ జేసిన ధీవిశారదులకుఁ దెలియకపోదు. అక్షరాభ్యాస సంస్కారానంతరమునఁ దిక్కనఁ వేదాదిసమస్త విద్యాభ్యాస విభాసి యగుచు ననుదిన ప్రవర్ధనంబుఁ జెందెనని కేతనకవీంద్రుఁడు వ్రాక్రుచ్చియున్నాఁడు. లౌకికాధికార ధూర్వహులైన శ్రీమంతులయింటఁ బుట్టియుఁ దిక్కనవైదిక విద్యాభిలాషియై

విద్యాభ్యాసమునకు దొరకొనుటకు హేతు వేమి యైయుండు నని కొందఱిచ్చెరువు నొందవచ్చును. తిక్కనపూర్వులు తరతరముల నుండియు వైదికవిద్యలను వైదికానుష్ఠానములను విడిచిపెట్టక భక్తితో ననుష్ఠించుచు నచ్చిరి. అందువలనఁ దిక్కన తండ్రి యగుకొమ్మనామాత్యుఁడు పవిత్రశీలుఁడై సాంగోపాంగముగ వేదముల నభ్యసించెను. అయిన నతఁడు దండనాథుఁడుగ నుండుట కియ్యది యడ్డుపడలేదు. ఆకాలమునఁ దిక్కనయు, 'అవశ్యంపితురాచార'మ్మని తనతండ్రిమార్గమునే యథాశక్తి శ్రద్ధాభక్తులతో ననుసరించి ధన్యుఁడయ్యెనుగాని మఱియొండు గాదు. "ఉదాత్తవేదవిద్యా ప్రతిపాలకుఁడు, సకలవిద్యా కళాచణుఁడు, వేదత్రితయమూర్త్యాత్మకుఁడు, వేదాదిప్రకట వివిధ విద్యాభ్యాసాపాదిత మహత్త్వుఁడు, ఉదాత్తశ్రౌతస్మార్త కర్మతత్పరమతి, సకలాగమార్థతత్త్వవిచారోదారుఁడు, యాగవిద్యాభిరాముఁడు, వేదోదితకర్మవ్రతుఁడు, నానావేదవేదాంగ తత్త్వజ్ఞుఁడు, తతవయసువచస్సమగ్రతాచతురాస్యుఁడు, అనితరగమ్యవాఙ్మయ మార్గనవర్తన కర్ణధారుఁడు' అను విశేషణములతోఁ గేతనకవి తిక్కన నభివర్ణించి యుండుట చేతను, మఱియు నింక నిట్టివే యనేక కారణముల చేతను సాంగోపాంగముగ వేదముల నభ్యసించి తిక్కన సమకాలమువారిచే వాక్పతినిభుఁడనికొనియాడఁబడుచుండె నని మనము నిస్సంశయముగా విశ్వసింప వచ్చును. దీనిం బట్టి తిక్కన పినాకినీ

నదీతటమున గురుకులంబున శ్రద్ధాభక్తులతో గురువులకు శుశ్రూషలు గావింపుచుఁ గ్రమశిక్షణము గలిగి వేదాధ్యయనముగావించె నని మనకుఁ దేటపడక మానదు. ఆగర్భ శ్రీమంతుఁడై పుట్టియు నిజకులాచారధర్మ రక్షణాభినిరతి గలిగి బీద బ్రాహ్మణబాలురతోఁ గలిసి విద్యాభ్యాసముఁ జేయుట గౌరవలోపముగా నెంచుకొనక తానెంత యైశ్వర్యవంతుఁ డైనను విద్యాసముపార్జనము లేకయున్నఁ దన జీవితము లోకములో వన్నెకెక్క పరమార్థమును బొందఁజాల దనితలంచి తన పూర్వులవలెనే తానును వేదాదిసమస్తవిద్యాభ్యాసనము చేయవలయు నని తిక్కన సంకల్పించుకొని గురుకులంబుఁ జేరి తొలుత వేదాధ్యయనముఁగావించి నట్లు స్పష్టముగాఁ గనంబడుచున్నది. స్వధర్మము నతిక్రమింపక నడచుకొనెడు వర్తనము బాల్యమునందే తల్లిదండ్రుల నుండి తిక్కన గ్రహించెను. మహత్తరమైన మనోరథసృష్టి బాల్యమునందే యంకురించి నందునఁ దత్పోషణార్థము తిక్కన దీక్ష వహించి కృషి సలిపెను. పితృమాతృభక్తి విశేషముగాఁ గలవాఁ డౌటచేతఁ బెద్దలయెడ వినయవిధేయత లనుజూపుట సంభవ మయ్యెను. నిరంతరమును గురుసాన్నిధ్యమున నుండి వేదాధ్యయనము సలుపుటచేత వినయ విధేయతలు మాత్రమెగాక యోపికయు, శాంతమును, ప్రస్ఫుట మైనవాక్కును సంపాదించుకొనఁ గలిగెను. వైదికవిద్యాభిలాషి యై పినాకినీనదీతటమున గురుకులంబున

గురుసాన్నిధ్యమున వేదాధ్యయనము సేయువాఁడు శుచివ్రతుఁడై యుండక మానఁడు. ఎప్పుడు విద్యార్థి శుచివ్రతుఁడై విద్యాభ్యాసము చేయునో అప్పుడే వాని తేజస్సు బహిర్వ్యాప్తిని జెందుచున్నది. ఉపనయనానంతర మీతఁడు కనీసము పదునాఱు సంవత్సరము లైనను బ్రహ్మచర్యవ్రతముఁ బూనియుండినఁ గాని సాంగోపాంగముగ వేదముల నభ్యసించుట సాధ్యము గాదు. తిక్కన నేర్చిన విద్యలను బట్టిచూడ నిర్మలమైనమనోవృత్తిగలిగి గురుకులంబున శౌచవ్రతుఁడై నిర్మలవాయువులను బీల్చుచు, నిర్మలోదకంబుల స్నానమును జేయుచు, నిర్మలజలంబులం ద్రావుచు, పరిపక్వ పదార్థములనే భుజింపుచు బ్రహ్మచర్య నిష్ఠాగరిష్ఠుఁడై, పవిత్రశీలుఁడై బహుసంవత్సరములు పరిశ్రమ చేసియు నతఁ డారోగ్యవంతుఁడును దృఢగాత్రుఁడు నై యున్నట్లే తోఁచును. ఆరోగ్యవంతుఁడై తిక్కన వైదికవిద్యలనే గాక లౌకికవిద్యలనుగూడ నభ్యసించెను. 'నీతిచాణక్యుఁ డనియును, సామాద్యుపాయవిదుఁ డనియును, నీతినిపుణమతి జితపురుహూతామాత్యుఁ డనియును, అమరసచివదూయోపహారుఁ డనియును, కేతన ప్రశంసించియుండుటచేతఁ దిక్కన దండనీతి మొదలగువాని నభ్యసించి నీతిశాస్త్రపారంగుఁ డయ్యె నని తెలియుచున్నది. ''తిక్కచమూప, తిక్కదండాధీశా'' అని పేర్కొనియుండుటచేతఁగూడ నితఁడు మనుమసిద్ధిరాజుకడ మంత్రిమాత్రుఁడు మాత్రమె గాక సైన్యాధిపతిగ గూడ నుండినటులు వేద్య మగుచున్నది. ఇతఁ

డిట్లు ముప్ప దేండ్లువచ్చువఱకు వేదంబులు, వాదంబులు, వీణాది వాద్యంబులు, ఆగమములు, ఆలేఖ్యకర్మంబులు, మంత్రతంత్రంబులు, మందులు, మాయలు, సింధురగంధర్వ శిక్షణములు ధర్మార్థ కామశాస్త్రములు జ్యోతిషము, కవితయు, కావ్యనాటకములు, కథలు, పురాణములు, ఆయుధనైపుణము, అంజనము మొదలుగాఁగల సమస్తవిద్యల సమస్తకళల నభ్యసించి మహామహోపాధ్యాయుఁడై ప్రవర్తింపుచుండెను.

## తిక్కన రూపము

తిక్కనచరిత్రమును జదివెడువారును, వినెడువారును, తిక్కనరూప మెట్లుండు నా యని తలపోయనివా రుండరు. తిక్కనరూపమును జిత్రించుటకుఁ దగినసాధనము లంతగాఁ గానరావు. తిక్కన కంకితముగావింపఁబడిన దశకుమార చరిత్రములో కేతనకవి కొన్ని వర్ణనములను జేసి యున్నాఁడు. కాని వానిని గొంద ఱవిశ్వాసను లతిశయోక్తులక్రిందను ద్రోసి పుచ్చినను గొంతవఱకు తిక్కనచిత్రపటమును లిఖియించుటకుఁ దోడు సూపక మానవు. తిక్కనమహనీయుని చిత్రపటమును జిత్రించుటకుఁ దొలుతఁ బ్రయత్నించిన యొకవిద్యాధికుఁడైన బుద్ధిశాలి వాక్యములనే నీదిగువ నుదాహరించుచున్నాఁడను.*

* ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక, (విరోధికృన్నామ సంవత్సరము 1911) ౧౮౯ పేజి, మ-రా-రా-శ్రీ జె. కృష్ణరావు, బి.ఏ., బి.ఎల్. గారిచే వ్రాయఁబడిన 'తిక్కన సోమయాజి చరిత్రము' అను శీర్షికఁగల వ్యాసమునుండి గ్రహింపఁబడినది.)

“తిక్కన కృతి నందిన దశకుమారచరిత్రము నందుఁగూడ నీయంశమును గూర్చి విపులంబుగ నేమియు వ్రాయఁబడ లేదు. సాధ్యమైనంత దనుక దానినే సహాయముగాఁ గొని కొంత విచారింప నుద్యమించుచున్నాఁడను. అయిన దశకుమారచరిత్రము కృతి యిచ్చిన కావ్యంబుగాన నందుఁ గృతిపతిని వాడుకరీతిఁ జారిత్రోక్తుల నగ్గించి యుండునని కొందఱాక్షేపింతురు గాఁబోలు. అందులకు సమాధానము చెప్పెద వినుఁడు. కేతన యందఱివలె గేవలధనాశచే నంకిత మొనర్చినవాఁడు గాఁడు.

అట్టి యాశయుండినపక్షమున ధనప్రసిద్ధికే యొనర్చి యనేకధన మార్జించి యుండును. తిక్కన యనన్య విద్యాపాండిత్యాదులయందుఁ దనకున్న యభిమానాతిశయంబుఁ బట్టియు నట్టిమహనీయుండు ప్రశంసించినం గాని తన చెప్పు కవిత్వము సార్థకత నొందదనుతలంపునను నతఁడు కృతి యిచ్చెంగాని వేఱుగాదు. “కవిత చెప్పి యుభయకవిమిత్రు మెప్పింప, నరిది బ్రహ్మకైన నతఁడు మెచ్చఁ బరఁగ దశకుమారచరిత్రంబు చెప్పినఁ బ్రోడ నన్ను వేఱె పొగడ నేల” అనుపద్యం బీయర్థము సూచించుచున్నయది. అదియునుంగాక తిక్కన యట్టిజ్ఞానసంపన్నుఁడు లేనిపోని స్తోత్రపాఠంబు లుపాలంభరూపంబులై జుగుప్సాజనకంబు లగుంగాని సంతోషదాయకంబులు గానేరవు. ఇఁక మనయుపక్రమిత విషయమునకుం బోదము. దశకుమారచరిత్రమునందు కేతన “కనకగిరితటీసంకాశ వక్షస్స్థలీభాగునకు” అని నుడివి యున్నాఁడు. పద్యప్రారంభమే యిట్లుండుటచే మనము యతిప్రాసములకై తెచ్చిపెట్టుకొన్నది యనఁ గూడదు. “శ్రీ రమణీరమణీయమహోరస్స్థలి విజితకాంచనోర్వీధరవిస్తారిత బలుండు” అని యీయంశమునే కేతన మఱియొకచో వ్రాసి యున్నాఁడు. ఏతద్వాక్యద్వయంబు పరస్పరబలీయములై నెగడుచున్నవి. వీనిచేఁ దిక్కన పీనంబును విస్తారంబు నగు వక్షంబు గలవాఁ డనుట వ్యక్తము. కృతిపతి యందలి యీవిశేషంబు సూచించు నిమిత్తంబుననే కేతన తనప్రథమ నాందీ పద్యము నందు:-

"ఉ. శ్రీరమణీ గృహాంగణము చెన్ను వహింప నలంకరింపఁగాఁ
దోరణముం బ్రదీపమును దోహలి యై యొడఁగూర్చె నాదగం
జేరి యురంబు నందుఁ దులసీవనమాలయుఁ గౌస్తుభంబు నొ
ప్పారగ నుల్లసిల్లు హరి యన్నమ తిక్కని ధన్యు జేయుతన్"

అని హరి యురంబు వర్ణించి యున్నాఁడు. మఱియొకచో "కల్పక పరాభవకరణ ధురీణదీర్ఘబాహుం డెలమిన్" అని చెప్పఁ బడియుండుటచేఁ దిక్కన యాజానుబాహుం డని స్ఫురించు చున్నది. వెండియు నొక చోట "జలజసుభగనేత్రుం" అని పద్యప్రారంభమున నుండుటచే మనోజ్ఞము లైనవిశాల నయనంబులు గలవాఁ డనుట ద్యోతక మగుచున్నది. తిక్కన ప్రతీకంబులఁ గూర్చి యింతకన్న మఱేమియుఁ గేతన చెప్పఁడయ్యె. "వియన్మణితేజుఁడు, అతిదినకరతేజుండు, మార్తాండసమానతేజుఁడు, నిజప్రభాదూషితవాసరేశుఁడు, పవిత్రమూర్తి" అనునట్టి విశేషణంబు లచ్చటచ్చటఁ బ్రయోగింపఁబడి యున్నవి. వీనిచేఁ బ్రకాశించు నరుణరుచి గలవాఁ డని తేలుచున్నది. దీర్ఘబాహుఁ డని తొల్లి వాకొనియుండుటచే దాని కనురూపంబుగ నున్నతకాయుం డనుట తెల్లము. మఱియుఁ దిక్కన యతని పితృపితామహులవలె సైన్యాధిపతి. ఈవిషయము 'తిక్కదండాధీశా, తిక్కచమూపా' అని కేతన వాడియుండుసంబుద్ధులచేఁ దేటపడును. వాహినీ పతిత్వమున కున్నతకాయులే యర్హు లనుట ప్రసిద్ధము. కాఁబట్టి తిక్కన కేవలకుబ్జుండుగాక మనుజసామాన్యమైన శరీరపరిమాణంబు గలిగి యుండె ననుట స్పష్టమగు చున్నది. ఇప్పుడు మనకుఁ దిక్కన విశాలవక్షుఁ డనియు, దీర్ఘబాహుఁ డనియు, విశాలనేత్రుఁ డనియు, నతితేజస్వి యనియు నేర్పడెను. అతఁ డతిసుందరమూర్తి యని కేతన ప్రత్యాశ్వాసాద్యంత పద్యమునందును నుడివి యున్నాఁడు.

"తనదుర్వారతరప్రతాపమునఁ జిత్రస్నేహముల్ గట్టి సే
యము నితం డెట్టివిదగ్ధుఁడో తలఁపుఁ డోహో యంచు లోకంబు గో

సనపుచ్ఛంగరమొప్ప దర్పకుఁడు రాజ్యత్సుందరాకారు శో
భనసంపన్నుఁ గృతీశ్వరుం బ్రచుర సౌభాగ్యాన్వితుం జేయుతన్.”

అని కవులలో నంతగా వాడుకలేని మన్మధుని వర్ణించు నొక యాశీరర్థక పద్యమునే వ్రాసి యున్నాఁడు.

ఇట్లు బుద్ధివైశారద్యులైనకృష్ణరావుగారు తిక్కన సుందరాకృతినిజిత్రించి యాంధ్రప్రపంచమునకు వంద్యు లగుచున్నారు.

---

# నాలుగవ యధ్యాయము

---

## మనుమసిద్ధిరాజు - తిక్కనమంత్రి.

వీరసోమేశ్వరుఁడు మొదలుగాఁ గర్ణాటులను, మారవర్మసుందర పాండ్యుఁడు మొదలుగాఁ బాండ్యులను, మహారాజసింహుఁడు మొదలుగా ద్రావిడులను యుద్ధములో జయించి కాంచీపురమున రాజరాజచోడుని సింహాసనమునఁ గూరుచుండఁబెట్టి పట్టాభిషిక్తుని గావించి చోళస్థాపనాచార్యబిరుదము గాంచిన తిక్కరాజు క్రీ. శ. ౧౨౭౦ వఱకుఁ బరిపాలనముఁ జేసెనని యిదివఱకె తెలిసికొని యున్నారము. అతని వెనుక నతనికుమారుఁడు మనుమసిద్ధి భూపాలుఁడు విక్రమసింహపురంబునఁ బట్టాభిషిక్తుఁడై పరిపాలనము చేసెను. ఏసంవత్సరమున నీతఁడు సింహాసన మధిష్ఠించి పరిపాలనము చేయఁ బ్రారంభించెనో మనకు నిశ్చయముగాఁ దెలియరాదుగాని యీతఁడు ౧౨౭౦ దవ సంవత్సరము తరువాతనుండి పరిపాలనము చేసినట్లు మన మూహింప వచ్చును. ఇతఁడును దండ్రివలెఁ బరాక్రమవంతుఁడెగాని యంత యదృష్టశాలి కాఁడు. ఇతనిపూర్వపుణ్యవశమున మహనీయుఁడగు కవితిక్కన మంత్రిగ నుండుటచేఁ బ్రఖ్యాతికి వచ్చెను. ఇట్టిరాజు లెందఱో యూరును బేరును లేక

నశించి పోయిరి. కవితిక్కనమూలమున మనుమసిద్ధి యెట్టివాఁడో మనకుఁ దెలిసికొనుట సంభవించినది. తిక్కరాజు కాలముననె మనుమసిద్ధి భూపాలునకును కవితిక్కనకును మైత్రిసంభవించినది. తనపెదతండ్రి సిద్ధనామాత్యుఁడు తిక్కరాజునకు మంత్రిగ సేనాపతిగ నుండుటం జేసి కవితిక్కన మనుమసిద్ధిరాజుతో మైత్రి నెఱపుటలో వింత యేమియును లేదు.

సిద్ధనామాత్యునికిఁ గల నలువుర పుత్త్రులలోను జ్యేష్ఠుఁడగు తిక్కనామాత్యుఁడు మనుమసిద్ధి భూపాలునకు మంత్రిగను సేనాపతిగ నుండెను. ఈ తిక్కనామాత్యునితమ్ములు మువ్వురును కొమ్మనామాత్యులును మనుమసిద్ధిభూపాలుని కొల్వుననే యుండిరి. కొట్టరువువారి కుటుంబము చాల గొప్పది. ఈ తిక్కనామాత్యునినే యిటీవలివారు ఖడ్గతిక్కనయని వ్యవహరించుచున్నారు. వీనితోఁ బాటు కవితిక్కనగూడ మనుమసిద్ధి భూపాలునికడ మంత్రిగను సేనాపతిగఁ గూడ నుండెను. మనుమక్ష్మాపాలమంత్రి మాణిక్యుఁడనియు, మనుమసిద్ధిమహీశసమస్తరాజ్యభార ధౌరేయుఁడనియు, గవితిక్కనను వర్ణించి ఖడ్గతిక్కనను గేతనయట్లు చెప్పకుండుటచేత ఖడ్గతిక్కనకంటెను గవితిక్కన మనుమసిద్ధికి నధికకరుణాపాత్రుండయ్యె నని చెప్పవలసి యుండును. మనుమసిద్ధి విద్యాగంధములేని మూర్ఖుఁడు గాఁడు. ఇతరు లాడించి నట్లాడుటకు వారిచేతిలోని యంత్రపుబొమ్మ గాఁడు. కేతనకవి సుకృతాత్ముఁడైనమనుమసిద్ధిని

కీర్తి పాత్రుం డని తెలుపుచు నీక్రింది పద్యముచే నిట్లభివర్ణించెను.

“ సీ. వీరారివర్గవిదారణక్రీడ న
ద్యతనజగత్ప్రాణసుతుఁ డనంగఁ
బరధనదారాపహరణానభిజ్ఞత
నూతనగంగాతనూజుఁ డనఁగ
నర్థార్థిజనవాంఛితార్థ సంపూర్ణవి
తీర్ణినైన భినవకర్ణుఁడనఁగఁ
గామినీచిత్తాపకర్ష కారణశుభా
కారసంపద వింత కంతుఁడనఁగ

గీ॥ ధీరతాగుణమున మేరుమహీధ
మన గభీరవృత్తి నబ్ధి యనఁగ
వెలసె వైరిరాజ వేశ్యాభుజంగాంక
భూషితుండు సిద్ధిభూవిభుండు.”

ఇట్టి మనుమసిద్ధి భూపాలునికడఁ గవితిక్కనయు, ఖడ్గతిక్కనయు, మంత్రులుగా నుండి విఖ్యాతిఁ గాంచిరి. కొట్టరువు తిక్కనామాత్యకవి మనుమసిద్ధియొద్ద వహించినమంత్రిపదవి నిజకులక్రమాగతంబైనదని కేతన నుడివి

“ గీ. అందలంబు గొడుగు లడపంబు మేల్కట్టు
చామరములు జమిలిశంఖములును
గంబగట్లు భూమి కానిక గాఁగ బెం
పెసఁగు రాచపదవు లెల్లఁ బడసె.”

అని చెప్పుటవలన నతఁడు సమస్త సంపత్సమేతుఁ డై రాజ్యసుఖంబు లనుభవించుచుండె ననుట యతిశయోక్తి గాదు.

ఇతని పెదతండ్రికుమారుఁ డగు ఖడ్గతిక్కనయు నితనివలెనే, సమస్త సంపత్సమేతుఁ డై తమ్ములతోడను, గొమాళ్ళతోడను రాజ్యసుఖంబు లనుభవించుచుండెననుట సత్యవిరుద్ధముకాదు. కేతనకవి తిక్కనకవివంశ వర్ణనముఁ జేయు నపుడు సిద్ధనామాత్యనందనుఁ డగు ఖడ్గతిక్కన నిట్లభివర్ణించి యున్నాఁడు.

“ సీ. వేడిన నర్థార్థి వృథపుచ్చ నేరని
దానంబు తనకు బాంధవుఁడు గాఁగ
నెదిరిన జముఁడైన బ్రదికిపోవఁగ నీని
శౌర్యంబు తన కిష్టసఖుఁడు గాఁగ
శరణుచొచ్చిన శత్రువరుఁడైన రక్షించు
కరుణయె తనకు సంగడము గాఁగ
బలికినఁ బాండవప్రభుఁడైన మెచ్చని
సత్యంబు తనకు రక్షకుఁడు గాఁగ

జగతి నుతి కెక్క రాయవేశ్యాభుజంగ
రాజ్యరత్నాకరస్ఫూర్తి రాజమూర్తి
గంధవారణబిరుద విఖ్యాతకీర్తి
దినపతేజుండు సిద్ధయ తిక్కశౌరి.”

మఱియును సిద్ధయ తిక్కనామాత్యుని గృహము ప్రతిదిన మెట్లుండునో యావివరమును మఱియొక కవి

“సీ. వీరవివాదంబు వేదనినాదంబు
పాయక యేప్రొద్దు మ్రోయుచుండు
భూసురప్రకరంబు సేసలు చల్లంగ
బాయ కెన్నియొ కుటుంబములు బ్రదుకు

బ్రాహ్మణావళికి ధారలు పోసినజలంబు
సతతంబు ముంగిట జాలువాఱు
రిపుల కోసఁగిన పత్రికల పుత్త్రికలను
వాయక కరణముల్ వ్రాయు చుంద్రు
గీ. మానఘనుఁ డైనతిక్కనమంత్రి యింట
మదనసముఁ డైనతిక్కనమంత్రి యింట
మహితయశుఁ డైనతిక్కనమంత్రి యింట
మంత్రిమణి యైనతిక్కనమంత్రి యింట."

అని మనోహరముగా నభివర్ణించి యున్నాఁడు. ఇట్టి మహానీయు లగుమంత్రివర్యుల సాహాయ్యముతో మనుమసిద్ధిభూపాలుఁడు కొంతకాలము విక్రమసింహపురము రాజధానిగాఁ జేసికొని రాజ్య పరిపాలనము చేసి విశుద్ధయశమును గాంచెను. ఇతఁడు మొట్టమొదట పేరునకు మాత్రము రాజరాజచోడునకు సామంతుఁడుగా నుండినను మూఁడవరాజేంద్రుఁచోడుని కాలమున స్వతంత్రుఁడై కడపట కాకతీయాంధ్రచక్రవర్తి యగు గణపతిదేవునకు లోఁబడిన సామంతుఁడై రాజ్యపరిపాలనము చేసెను. చాళుక్యచోడ చక్రవర్తు లయిన రాజరాజచోడుఁడును, రాజేంద్ర చోడుఁడును బిరుదమాత్ర చక్రవర్తులే గాని నిజముగాఁ జక్రవర్తిపదము నధిష్ఠించి పరరాజులనుండి కప్పములు గైకొనుచుఁ దమయధికారమును వారలపైఁ జూపు శక్తిగలవారై యున్నట్టు గానుపింపరు.

## మనుమసిద్ధినాటి కాలస్థితి

పదుమూఁడవ శతాబ్దిప్రారంభము నుండి యాంధ్రదేశమునఁ జాళుక్యచోడ చక్రవర్తులయధికారము నశించిపోయి కాకతీ యాంధ్రచక్రవర్తుల యధికారము నానాముఖముల వ్యాప్తిఁజెందుచుండె నని చెప్పవచ్చును. చాళుక్యచోడ చక్రవర్తి యగు మూఁడవరాజరాజచోడునకును, మూఁడవ రాజేంద్రచోడునకును సింహాసనమును గూర్చి పోరాటములు జరుగుచుండెను. ఈ పోరాటములలో ద్రావిడాంధ్రకర్ణాటకు లేదేని యొకపక్షమునఁ జేరి రెండవపక్షముతోఁ బోరాడుచుండిరి. మనుమసిద్ధితండ్రి యగుతిక్కరాజు కర్ణాటకులను ద్రావిడులను జయించి రాజరాజచోడుని రాజ్యమున నిలిపి కొంతకాలముఁ బరిపాలనము చేసెను గాని వాని మరణానంతరము రాజేంద్రచోడుఁడు విజృంభించి పాండ్యులను కర్ణాటులను జయించి రాజరాజును జంపి కాంచీపురసింహాసన మాక్రమించుకొని పరిపాలనము సేయుచుండెను. క్రీ. శ. ౧౨౯౯-వ సంవత్సరమున నేకశిలానగరమునఁ బట్టాభిషిక్తుఁడైన గణపతిదేవచక్రవర్తి ౧౨౧౦-వ సంవత్సరమునాటికే వెలనాడు, పొత్తపినాఁడు, రేనాడు, ములికినాడు,గండికోట మార్జవాడిసీమలను జయించి ద్రావిడకర్ణాట రాజులతోఁ బోరాడుచుండెను. ఆకాలమున దక్షిణహిందూస్థానమునఁ దమ సామ్రాజ్యములను స్థాపింపఁ బూని దేవగిరి యాదవులును, ఓరుగంటి కాకతీయులును, హాలెవీటి హొయిసనులును, మధురాపుర పాండ్యులును,

కాంచీపుర చాళుక్యచోడులును హోరాహోరిగఁ బోరాడు చుండిరి. చాళుక్యచోడ సామ్రాజ్యము నశింపఁగాఁదత్సింహాసనమునకై చోడులలోఁ జోడులకు నంతఃకలహములు పుట్టి తమలోఁ దాముపోరాడుచు నన్యుల సహాయమును వేడుచు నేతన్మాలమునఁ గ్రమక్రమముగా స్వాతంత్ర్యములను గోలుపోవుచు ననేక కష్టములంబడుచుండిరి. పూర్వము పశ్చిమచాళుక్యులుపరిపాలించిన కుంతలదేశము యొక్క ప్రాగ్భాగమును గాకతీయాంధ్రులును ఉత్తరభాగమును దేవగిరియాదవులును, దక్షిణపశ్చిమభాగములను హొయిసలకర్ణాటులునాక్రమించుకొనిరి. కావున మనుమసిద్ధిభూపాలుని కాలమున రాజకీయవాతావరణములో దెలుఁగుచోడులసుఖస్థితి యందున్నవారని చెప్పవలసియుండును. మనుమసిద్ధిభూపాలుఁడు గొంతకాలము చాళుక్య చోడ చక్రవర్తి యగు మూఁడవరాజేంద్రచోడునకు సామంతుఁడుగ నున్నట్లు గానంబడుచున్నాఁడు. అయినను యుద్ధములు వచ్చినప్పుడు తోడ్పడుట తక్క తదితరవిషయములలో స్వతంత్రపరిపాలనమునే చేయుచుండెను. ఎట్టులయినను మనుమసిద్ధిరా జిరువదిసంవత్సరములు రాజ్యపరిపాలనము చేసినట్లు గనంబడుచున్నది.

## మనుమసిద్ధి శత్రురాజులను జయించుట

తిక్కన తననిర్వచనోత్తర రామాయణమున మనుమసిద్ధి భూపాలుని విజయములను బేర్కొని యుండెను. అందు మొదటి పద్య మిట్లున్నది.

"మ. ద్రవిడోర్వీపతి గర్వముం దునిమి శౌర్యం బొప్పఁ గర్ణాటద
ర్పవిఘాతంబు నొనర్చి వైరిమనుజేంద్రశ్రేణికిం గొంగనా
నవనిం బేర్కొని యున్నయట్టి విజయక్ష్మాధీశ్వరుం గాసిగా
నవిచెం గోళసమన్మసిద్ధి యనిఁ బ్రాయేటం బ్రగాఢోద్ధతిన్."

ఈపై పద్యమున విజయక్ష్మాధీశ్వరుని జయించె నని చెప్పఁ బడియున్నది. ఇందలి విజయక్ష్మాధీశ్వరుఁ డెవ్వఁడో తెలిసికొన సాధ్యము గాక యున్నది. విజయక్ష్మాధీశ్వరుఁడు మనుమసిద్ధి దాయాదుఁ డేమోయని సంశయము గలుగుచున్నది. విజయగండగోపాలుఁడు ౧౨౫౦-వ సంవత్సరము మొదలుకొని ౧౨౯౨ వఱకుఁ గాంచీపురమండలమును బరిపాలించినట్లు గనంబడుచున్నది. ఇతని శాసనములు కాంచీపురమండలము నందేగాక నెల్లూరు, గూడూరు, సుళ్లూరుపేట తాలూకాలలోఁ గానుపించుచున్నవి. ఇతనికి త్రిభువనచక్రవర్తి యను బిరుదము గలదు. ఇతఁడు చాలకాలము బ్రదికియున్నవాఁడు గావున వయస్సున మనుమసిద్ధి కంటెఁ జిన్నవాఁడై యుండును. ఇతఁడు మూఁడవ రాజేంద్రచోడునకుఁ బిమ్మట స్వతంత్రుఁడై కాంచీపురమండల మేలె నని తోఁచుచున్నది. ఇతఁడు మొదట రాజేంద్రచోడుని పక్షమునఁ గాని లేక జటవర్మసుందర పాండ్యుని పక్షమునఁ గాని చేరి మనుమసిద్ధిరాజుతో యుద్ధము చేసి యోడిపోయి యుండవచ్చును. ఇందునుగూర్చి యాంధ్రుల చరిత్రమం దిట్లు వ్రాయఁ బడియెను.

"తిక్కరాజు మరణానంతరము పాండ్యరాజులు తమతొంటి పూనికను విడనాడక కాంచీపురము మొదలుకొని యుత్తర భూమిని జయింపఁ గోరి పలుమాఱు దాడి వెడలి వచ్చి నెల్లూరునకు దిగువ నున్న దేశమును గల్లోలపెట్టుచుండిరి. వారిలో జటవర్మ సుందరపాండ్య మహారాజు ప్రముఖుఁడుగా నుండెను. క్రీ. శ. ౧౨౪౯-వ సంవత్సరమునఁ గాకతీయగణపతిదేవ చక్రవర్తి యాంధ్రదేశము నుండి పాండ్యరాజులను బాఱఁద్రోలి కాంచీపురమున నొకదేవాలయములో నొకదానశాసనమును[1] వ్రాయించెను. అయినను జటవర్మ సుందరపాండ్య మహారాజు మఱుసటి సంవత్సరమునం దనఁగా ౧౨౫౧-వ సంవత్సరమునఁ గాంచీపురమార్గమున నాంధ్రదేశముపై దండెత్తివచ్చి తెలుఁగుచోడరాజులను జయించి మనుమసిద్ధిరాజును నెల్లూరునుండి పాఱఁద్రోలి సిద్ధిరాజునకు శత్రువు లైన వీరులను పట్టాభిషిక్తులను గావించి నెల్లూరిలోని పల్లికొండ పెరుమాళ్ళదేవునకు నండనాటిలోని మావడికుండ గ్రామమును దానము చేసె నని తెలుపెడిశాసన మొకటి రంగనాయకస్వామి దేవాలయములో నొక స్తంభముపై వ్రాయించెను.[2] ఆ సంవత్సరముననే విజయగండ గోపాలదేవుఁడు కాకతీయుల సాహాయ్యమును బడసికాని పడయకకాని జటవర్మసుందర పాండ్యదేవుని వానిసైన్యములను నెల్లూరిమండలమునుండి పాఱఁద్రోలి యుండవలయును. ఈవిజయగండగోపాలునినే తరువాత మనుమసిద్ధి యెదిరించి పోరాడి విజయమును గాంచి యుండవచ్చును. విజయత్కొమ్మధీశ్వరుఁడు జయించిన ద్రవిడోర్వీపతి జటవర్మ సుందరపాండ్యుఁడుగాక కాంచీపురాధిపతియైన పాండవవీర రాజేంద్ర చోడచక్రవర్తియే యైన యెడల ౧౨౫౧-వ సంవత్సరమునకుఁ బూర్వముననే మనుమసిద్ధి వానిని జయించి యుండవలయును. పైనఁజెప్పినదే వాస్తవమైనయెడల ౧౨౫౦-వ

1 Indi Ant. Vol. XX I. p. 202; Ep—Ind. Vol. VII. No. 588, Kielhorn's list of Inscriptions of Southern India.

2 Nellore Inscriptions, Vol. II. No. 61.

సంవత్సరము తరువాతనే నిర్వచనోత్తర రామాయణము రచింపఁ బడి యుండవలయును. ఈ త్రిభువన చక్రవర్తి విజయగండ గోపాలుఁడు మను మసిద్ధికి సమకాలికుఁడు.''

మఱియు మనుమజనపాలుఁడు గంగయసాహిణి నోడించి తన యాశ్రితవత్సలవృత్తి తేటపడు నట్లుగా బల్విడి నాచికొన్న రాజ్యాంగము లన్నియు నిచ్చి పదముఁ గైకొనఁ బంచె నని నిర్వచనోత్తరరామాయణమున క్రిందిపద్యములో వర్ణింపఁ బడి యున్నది.

''ఉ. రంగ మదాగ్రకీర్తి యగు రక్కసగంగనిఁ బెంజలంబుమై
భంగ మొనర్చి మన్మజనపాలుఁడు బల్విడి నాఁచికొన్న రా
జ్యాంగము లెల్ల నిచ్చి తన యాశ్రితవత్సలవృత్తి యేర్పడ
గంగయసాహిణిం బదముఁ గైకొనఁ బంచెఁ బరాక్రమోన్నతిన్.''

ఈగంగయసాహిణి కాకతీయాంధ్రచక్రవర్తి యగుగణపతి దేవుని సైన్యమున కధ్యక్షుఁడును, రాజప్రతినిధి యై నిజాము రాష్ట్రములో నిప్పుడు చేరి యున్న పల్లగొండసీమలోని పానగల్లు మొదలుకొని మార్జవాడి (కడపమండలములోని వల్లూరురాజధాని) వఱకుఁ గల దేశము నంతయుఁ బరిపాలించు చుండిన యొక యున్నత రాజకీయాధికారిగాని సామాన్యుఁడు గాఁడు. ఇతనికి బ్రహ్మరాక్షసుఁ డనుబిరుదుగలదు గనుకనే రక్కసగంగని పేర్కొనఁ బడియున్నాఁడు. ఈగంగయసాహిణి కాయస్థకులస్థుఁ డని పుష్పగిరిలోని యొక శాసనమువలనఁ దెలి

యుచున్నది.* ఈగంగయసాహిణిం గూర్చి యాంధ్రుల చరిత్రమునం దిట్లు వ్రాయఁబడియున్నది.

"ఇట్టి మహాపరాక్రమవంతుఁడైన గంగయసాహిణి లోకమండలాధిపతిగనున్న మనుమసిద్ధి యెట్లు జయించి యితని రాజ్యాంగములెల్ల నాఁచికొనియెనో, ఎట్లాతఁ డాశ్రితుఁడై యితనిం బ్రార్థించెనో, ఎట్లీతఁ డాశ్రితవత్సలవృత్తి యేర్పడునట్లుగా నాఁచికొన్న రాజ్యాంగములెల్ల నిచ్చి పదముఁ గైకొనఁజేయించెనో, ఎంతమాత్రమును బోధపడకున్నది." అని యీ చరిత్రముయొక్క రెండవప్రకరణములో మనుమసిద్ధిరాజులగూర్చిన ఘట్టమున వ్రాసియున్నాఁడు. ఇటీవల స్థానికచరిత్రములం బరిశీలింపఁగా గంగయసాహిణియొక్క పూర్వవృత్తాంతము కొంతవఱకు దెలియవచ్చినది. గంగయసాహిణి మొట్టమొదట గణపతిదేవ చక్రవర్తి కొల్వులో లేఁడనియు, మనుమసిద్ధిరాజు తండ్రియైన తిరుకాళచోడ మహారాజునకు (తిక్కరాజు) అగ్రసేనాధిపతిగ నుండెననియు సిద్ధవటము సీమలోని యోగూరు స్థానికచరిత్రమునఁ జెప్పఁబడినది. ఇతఁడు మొదట తిక్కభూపాలునకు సేనాధిపతిగ నుండె యతని యనంతరమున కలుకడపురవరాధీశ్వరుండైన శ్రీమన్మహామండలేశ్వర త్రిలోకమల్ల భుజబల వీరనారాయణ రాయదేవ మహారాయుల సైన్యాధీశుఁడై మోదుకూరు సందుంసి ములికినాటిని బరిపాలనము సేయుచున్నప్పుడు తిక్కరాజు కొడుకైన మనుమసిద్ధిరాజుతో యుద్ధము చేసి యుండవచ్చును. ఆ యుద్ధమునం దోడిపోయి మనుమసిద్ధిని నాశ్రయించి యందువలన నతనికి తన యాశ్రితవత్సలవృత్తి యేర్పడునట్లుగా యథాస్థానమునకుం బంపెనని స్పష్టమగుచున్నది. కాకతిగణపతిదేవ

* "యోగండ పెండేరక నామధేయః
కాయస్థ వంశోద్భవ కర్ణధారః
శ్రీగంగ సేనాపతిరస్య కాన్తా
కాన్తిర్హిమాంశోరివకాంబలాయః"

చక్రవర్తి గండికోట, ములికినాడు, రేనాడు, పెనదాడి, సకిలినాడు, ఏరువనాడు, పొత్తపినాడు మొదలగుసీమల నెల్ల జయించి గంగయసాహిణిఁ దనకు సైన్యాధ్యక్షునిగ నియమించి యాతఁడు తనకుఁ బ్రతినిధిగ నుండి యాసీమలఁ బరిపాలించునటు లనుజ్ఞ నొసంగెను. కాఁబట్టి యప్పటి నుండియు గంగయసాహిణి సర్వాధికారి యై సైన్యాధ్యక్షుఁడై బాహాత్తరనియోగాధిపతి యై ప్రతినిధిపరిపాలకుఁడై మిగుల వాసి గాంచెను. మాండలికరాజుల నెల్లరను గణపతిదేవ చక్రవర్తికి లోఁబడఁజేసి యెల్లరను శాసించి యదుపులోనుంచి కప్పములు గైకొనుచుఁ బ్రఖ్యాతుఁడైనందున గంగయసాహిణికి మాండలిక బ్రహ్మరాక్షసుఁడనియు, రక్కసగంగనియుఁ బేరులు గలిగెను. .........గంగయసాహిణి చేసిన దానధర్మములను గూర్చి శాసనము లనేకములు కడప, కందనోలు మండలములలోఁ గానవచ్చుచున్నవి. ఇతఁడు దేవతా బ్రాహ్మణభక్తి గలవాఁడగుటచేత ననేక శివాలయములకును, బ్రాహ్మణులకు ననేక భూదానములను గావించి ప్రఖ్యాతుఁ డయ్యెను.''

మఱియు మనుమసిద్ధిరాజు మహారాష్ట్రసామంతుఁడైనసారంగుని జయించె నని నిర్వచనోత్తర రామాయణమున నీక్రిందిపద్యములోఁ జెప్పఁబడి యున్నది.

''శా. శృంగారంబు నలంగ దేమియును బ్రస్వేదాంబుధారాశ్రేణి లే
దంగంబుల్ మెఱుఁగెద వించుకయు మాహారాష్ట్రసామంతు సా
రంగుం దోలి తురంగముం గొనిన సంగ్రామంబునం దృప్తస
ప్తాంగ స్ఫారయశుండు మన్మసిద్ధి పంపై చన్న సైన్యంబునన్.''

ఇందునుగూర్చి యాంధ్రుల చరిత్రము నందు వ్రాయఁబడి యున్న వాక్యములనే యిం దుదాహరించుచున్నాఁడను.

''ఇందుఁ జేర్కొనఁబడినసారంగుఁడు, అతివిషమ హయారూఢ ప్రౌఢరేఖావంతుఁడును, పరబల కృతాంతుఁడును, శరణాగత వజ్రపంజ

రుఁడును, మండలీకరవందోలియు, జీవరక్షచక్ర నారాయణుఁడును, అగు శ్రీమన్మహామండలేశ్వర శ్రీసారంగపాణి దేవరాజేగాని యన్యుఁడు గాఁడని తోఁచుచున్నది. ఇతఁడు కాకతీయగణపతిదేవునకు సామంతుఁడుగ నుండి అద్దంకిసీమకుఁ బరిపాలకుఁడుగ నుండెను. ఇతనితండ్రి మాధవదేవ రాజు. ఇతఁడు మనుమసిద్ధికి సమకాలికుఁడై యుండెను. గోవిందనాయకుఁడీతనికి మంత్రిగనుండెను. ఇతని పూర్వులు మహారాష్ట్రములోని శాణదేశమునుండి వచ్చినటులు దెలియుచున్నది. కాఁబట్టి నిర్వచనోత్తరరామాయణమునఁ జేర్కొనఁబడినసారంగుఁ డితఁడే యనుటకు సందియములేదు.''

అని వ్రాసి యున్నాఁడను గాని మహారాష్ట్రదేశమునుండి మఱియొక సారంగుఁడు పశ్చిమపాకనాడు పై దండెత్తి వచ్చి దోఁచుకొనఁ బ్రయత్నించు నపుడు మనుమసిద్ధి వానిని పాఱఁద్రోలెననియుఁ దెలియుచున్నది. భావి పరిశోధనమునఁ గాని యిదమిత్థ మని నిర్ణయింపఁ జాలము.

## బ్రాహ్మణులకు వెలమలకును వివాదము

పూర్వకాలమున ముక్కంటికాడు వెట్టి యను పల్లవరాజొకఁడు శ్రీశైలమునకుఁ దూర్పున నుండుదేశమున డెబ్బది యగ్రహారములను గల్పించి బ్రాహ్మణులకు దానముచేసి యుండెనఁట. అధరాజేంద్ర చోళమండల మనియెడు పశ్చిమ ప్రాఙ్నాటిలోని పేరంగండూ రను గ్రామము వానిలో నొకటిగా నుండెను. ఈగ్రామము నేఁబది రెండు భాగములుగా విభాగించి ముక్కంటికాడువెట్టి బ్రాహ్మణులకు ధారపోసి యుండెను. అప్పటినుండియు నాబ్రాహ్మణులు పుత్త్రపౌత్త్ర పారంపర్యముగా

నిరాతంకముగా ననుభవించు చుండిరి. ఇట్లుండ సకలికోడూరులో నుండు వ్యవసాయదారులు తమ దేశమునందు గొప్పకలహము జనించుటచేత తమదేశమును విడిచి వలసవచ్చి యీ గ్రామములోని చెఱువున కుత్తరభాగమున వసతు లేర్పఱచుకొని నివసించు చుండిరి. మఱియును ఇనంబ్రోలు గ్రామవాసులైన వెలమలు కొందఱు తమగ్రామమున మహామారి జ్వరమంకురించి ప్రజానాశముం గలిగించుచుండుటచేత నాగ్రామమును విడిచిపెట్టి యీబ్రాహ్మణాగ్రహారమునకుం జనుదెంచి తా మాక్రమించుకొనెడు పొలములలో నెంతపంటపండునో యంత మొత్తమును బన్నుగాం జెల్లించు పద్ధతి పై నొడంబడికం జేసికొని గుడిసెలు గట్టుకొని కాపురముండుచు వచ్చిరి. తరువాత నొకప్పుడు మీనరాశి యందు శని ప్రవేశించుటచేత దేశమునం గాటకము సంభవించెను. ఆకారణముచేత బ్రాహ్మణు లాగ్రామమును విడిచి పెట్టి పోయిరి. కాటకము గడచిపోయిన కొంతకాలమునకు బ్రాహ్మణులు మరల స్వగ్రామములోం బ్రవేశించిరి. తమ యొడంబడిక ప్రకారము వెలమలు తమకట్టుబడులను బ్రాహ్మణులకుం జెల్లింప రైరి. ఇంతియగాక యాయగ్రహారము పరిపాలనము చేయు నట్టి ప్రభు వైన మనుమసిద్ధిరాజు పాలయ్యెను. అందు పై నాబ్రాహ్మణులు పరిపాలనము చేయు నట్టి మనుమసిద్ధి రాజుకడకుం బోయి తమ కష్టములను గూర్చి మొఱపెట్టుకొనిరి. అతఁడు సదయ హృద

యుఁడై యినంబ్రోలువాసులైన వెలమలకు వర్తమానమంపి పాకనాటిలోని ప్రజల సాహాయ్యమును బడసి వారివివాదమును గూర్చి విమర్శ జరిపెను. ఆవిమర్శలో నాభూములు బ్రాహ్మణుల వైనటులు దేల్చినందున వీరరాజేంద్ర చోడచక్రవర్తి యొక్క పదుమూఁడవ సంవత్సర పరిపాలనకాలమున అనఁగా శా. శ. ౧౧౭౯ (క్రీ. శ. ౧౨౫౭-౫౮) దవ సంవత్సరమునఁ దనతండ్రి తిరుకాళి దేవమహారాజు పుణ్యముకొఱకు మనుమసిద్ధిరాజు కోడూరు గ్రామమును బ్రాహ్మణులకు దానము చేసెను. ఈవిషయములు కడపమండలములోని నందలూరియందలి శాసనములలో నొకదాని వలనఁ దేటపడుచున్నవి. * దీనిం బట్టి పదుమూఁడవశతాబ్దికిఁ బూర్వము పాకనాటిలో మహామారిజ్వరము (ప్లేగు) గాని, అట్టివంటిదె మఱియొక యంటువ్యాధిగాని వ్యాపించి యుండె ననియు, అట్టి స్వగృహములను విడిచిపెట్టి పొలములలో గుడిసెలు వేసికొని కాపురముండుట క్షేమకరమని ప్రజలు తెలిసికొని యున్నా రనియు బై శాసనములలోని విషయములు స్పష్టముగఁ దెలుపుచున్నవి. ఈశాసనములో నుదాహరింపఁ బడినకోడూరు గ్రామము కడపమండలము లోనిపుల్లంపేట తాలూకాలో నున్నది. పేరంగండూరు గ్రామ మిప్పుడు గానరాదు. పై శాసనములో మనుమసిద్ధిరాజు వీరరాజేంద్రచోడచక్రవర్తికి సామంతుఁడుగ నున్నటులు గనం బడుచున్నను స్వతంత్రుఁడై పరిపాలనము చేయుచుండె నని మన మూహింప వచ్చును.

---

* Annual Report on Epigraphy of *1907* No. 580

# అయిదవ యధ్యాయము

## అక్కన బయ్యనల దండయాత్ర

అక్కనబయ్యన లనుమనుమసిద్ధిరాజు దాయాదులు బలీయులై విక్రమసింహపురము పై దాడి వెడలివచ్చి యుద్ధము చేసి యాయుద్ధములో మనుమసిద్ధిరాజు నోడించి యాతనిఁ బాఱఁద్రోలి రాజ్యము నాక్రమించుకొని యుద్దండలీలఁ బరిపాలనము చేయసాగిరి. దీనికై యెంతయును జింతించుచు మనుమసిద్ధిరాజు మంత్రియు నాస్థానకవియు నగు తిక్కనసోమయాజి మనుమసిద్ధి రాజుపక్షమును బూని కాకతీయుల రాజధాని యైన యేకశిలానగర మనునామాంతరముగల యోరుగంటికిఁ బోయి గణపతిదేవ చక్రవర్తికి భారతాఖ్యానమును వినిపించి యతనివలన బహుమానములను బడసి యతనితో మనుమసిద్ధి దురవస్థను దెలుపఁగా నాతఁడు సదయ హృదయుఁడై సోమయాజుల రాయబారమును శిరసావహించి బహుసైన్యములతో దండెత్తి వచ్చి అక్కన బయ్యనలను నెల్లూరునుండి పాఱఁద్రోలి మనుమసిద్ధిని బునరభిషిక్తుని గావించి వెడలిపోయెనని సిద్ధేశ్వరచరిత్రములోని యీక్రింది చరణములవలన బోధపడఁగలదు.

“ సారెసారెకుఁ గేరి సన్నుతుల్ చేయ
సారపారావార సరస గంభీర
సారుఁడై కీర్తివిస్తారుఁడై యలరు
నారీతి గణపతి నటుచూచు వేడ్కఁ
దిక్కనసోమయాజక్కడ కొకట

* * * *

దిక్కుదిక్కులనుండి చేరి విద్యార్థు
లక్కడక్కడను గావ్యముల శ్లోకార్థ
మొక్కొక్కవిధమున నొగి వినిపింపఁ
జక్కనవినుచును నొక్కయందలము
నెక్కి తిక్కనసోముఁ డక్క డేతెంచె
నారీతిగా సోమయాజుల రాక
వాఁకచని ఫణిహారులు దెల్ప

* * * *

అట్టిమహాత్మ్ముని నాసోమయాజి
నెట్టన నెదురేగి నేర్పుతో రాజు
తెచ్చి యగ్రాసనస్థితునిగాఁ జేసి
మెచ్చి తాంబూలాదు లెచ్చుగా నిచ్చి

* * * *

అగుభారతాఖ్యాన మావీరవరులు
తగఁ జేసినట్టి యుద్ధప్రకారములు
వినియు సంతోషించెఁ గని నట్లు చెప్ప

* * * *

అంతఁ దిక్కనసోమయాజికి మెచ్చి
వింతవస్త్రంబులు వివిధభూషణము
లత్యంతభక్తితో నప్పుడిచ్చుడును

సత్యసంధుఁడును సత్యవర్తనుఁడు
నగుసోమయాజి తా నారాజు కనియెఁ
దగుమాట విను మొక్క ధర్మకార్యంబు
సూర్యవంశంబున సొబ గొందు నట్టి
యార్యపూజితవర్యుఁ డామన్మసిద్ధి
రాజు దా నెల్లూరు రమణతో నేల

* * * *

అక్కనబయ్యన లధిక బలిష్ఠు
లక్కట సిద్ధిరాయని బాఱఁ దోలి
దక్కినరాజ్యంబు తామె యేలుచును
నొక్కకాసైనను జక్కఁగ నీరు
వారల దండించి వారి నెల్లూరు
వారకిప్పింపు మవారణ ప్రీతి
ననిన గణపతిరాజట్లకా కనుచు

* * * *

వెడలి గణపతియు విజయంబునకును
గుడిమెట్టుపుల సేన కొలిచియే తేఁగ
వెలనాడు చేరియు వీడెల్లఁ గాల్చి
వెలనాటిరాజును వెసఁ గెల్చి వాని
యువ్వానంబులు గొని యటవని రాజు
గుప్పున నెల్లూరు కూడ నేతెంచి
యక్కన బయ్యన నచట సాధించి

* * * *

నెల్లూరిప్రజలకు నేర్పు వాటిల్ల
జెల్లించె మన్మసిద్ధిరాజునకు
నెల్లూరిపట్టంబు నేర్పుతోఁ గట్టి

సల్లలితాంధ్రృతి సమదుగ్గములను
నఱువ దెనిమిదియు నగుపట్టణముల
నరుదొంద సాధించి యామన్మసిద్ధి
రాజు కిచ్చియుఁ దన తేజంబు దిశలఁ
బూజ కెక్కఁగ ఘనరాజితయశుఁడు
ఘనతటాకంబుఁ దాఁ గట్టించె నచటఁ
గొనకొని నెల్లూరఁ గొన్నాళ్లు లుండి
మనుమసిద్ధికి రాజ్యమహిమంబు దెల్పె.

(సిద్ధేశ్వరోపత్రము)

గీ. చేయఁ దక్కువ యైనదేవాయతనము
లపుడు పూర్తిగ గట్టించి యలరుచున్న
చోట నొకనాఁడు తిక్కనసోమయాజి
వచ్చె నెల్లూరినుండి భూవరునికడకు.

సీ. వచ్చిన యయ్యార్యవర్యు నెదుర్కొని
వినయసంభ్రమభక్తు లినుమడింప
నతిథిపూజ లొనర్చి యతనిచే భారతా
ర్థము ద్వైతాద్వైత తత్త్వములను
విస్తృతచిదచిద్వివేకలక్షణములఁ
బ్రకటధర్మాధర్మ పద్ధతులను
రాజనీతి ప్రకారంబును భారత
వీరుల మహిమంబు వినుచునుండి
యనుమకొండనివాసు లైనట్టిబౌద్ధ
జనుల రావించి వారిఁ దిక్కనమనీషి
తోడ వాదింపఁ జేసినఁ దొడరి వారిఁ
జులకఁగా సోమయాజుల గెలుచుటయును.

వ. అప్పుడు బౌద్ధదేవాలయంబులు గూలం ద్రోయించి గణపతిదేవ రాజు సోమయాజుల పటువాక్యశక్తి మెచ్చి యతనికి బహుప్రకారంబులఁ బూజించి యెనిమిది గ్రామంబు లొసంగి యతఁడు వచ్చినకార్యం బడిగిన నాభూవరునకుఁ గవివరుం డిట్లనియె.

గీ. ఇనకులోద్భవుఁ డైనట్టి మనుమసిద్ధి
రాజు నెల్లూరు పాలించుచోఁ దెలంగి
యతనిదాయాదు లతని నుక్కణఁగఁ బట్టి
యునిచి రాజ్యంబుఁ దమ రేలు చున్నవారు.

క. కావున మీ రిపు డచటికి
వేవేగం దరలి వచ్చి విడకుండఁగ నా
భూవరుఁ బునరభిషిక్తునిఁ
గావింపఁగ వలయు ననిన గణపతివిభుఁడున్.

గీ. అట్ల కౌకయనుచు నాపని కొడఁబడి
యత్యుదారగుణసమగ్రుఁ డగుచు
దవిలి యప్పు డొక్కనవలక్షధనమును
యజ్ఞకుండలములు నతని కిచ్చె.

క. పనుచు నెడఁ దిక్కమఖి యా
జనవరు సింహాసనమున సచివాగ్రణి యై
తనరెడు శివదేవయ్యన్
గనుఁగొని యారాజుతోడఁ గడఁకం బలికెన్.

గీ. వసుమతీనాథ యీతఁ డీశ్వరుఁడు గాని
మనుజమాత్రుండు గాఁడు పల్మారు నితని
యనుమతంబున నీవు రాజ్యంబు నెమ్మి
నేలు మని చెప్పి యాఘనుఁ డేగుటయును.

సీ. గణపతిదేవుఁ డాఘనుననుమతి గాంచి
యతిసత్వరమునఁ బ్రయాణభేరి
వేయించి చతురంగపృతనాసమేతుఁడై
తరలి ముస్వేలనాటి ధరణిపతుల
గెలిచి వారలచేత లలి నప్పనము,
గొని శారి నందఱ దనవశము జేసి
కొని చని నెల్లూరు గొబ్బునఁ జొచ్చి య
క్కనయు బయ్యనయు నక్క ఖిలులఁ దఱిమి
మనుమసిద్ధిరాజుఁ బున రభిషిక్తుఁ గా
వించి మించి రెండువేలు నైదు
నూఱు గ్రామములు మనోవృత్తి కతనికి
నిచ్చి కడమఁ దాను బుచ్చుకొనియె.

(సో మ దే వ రా జీ య ము)

విమర్శనము.

సిద్ధేశ్వరచరిత్ర మనునది యొక శైవగ్రంథము. దీనికిఁ బ్రతాపచరిత్ర మనునామాంతరము గలదు. కాసె సర్వప్పను నాతఁడు దీనిని ద్విపదకావ్యమునుగా రచియించెను. ఈగ్రంథము పురాతన మైనదయినను లక్షణదోషములు పెక్కులు గాన వచ్చుచున్నవి. ఈకవికాల మెప్పుడో మనకు నిశ్చయముగాఁ దెలియరాదుగాని గణపతిదేవునకు నూఱుసంవత్సరముల తరువాత నున్నవాఁ డని తోఁచుచున్నది. ఈసిద్ధేశ్వరచరిత్రమునుబట్టియే సోమదేవరాజీయము కూచిమంచి జగ్గకవిచే రచియింపఁబడి మందపాటివారి కంకితము గావింపఁ బడినది.

జగ్గకవి పదునెనిమిదవశతాబ్దిలో నుండినవాఁడు. ఈరెండు గ్రంథములే పై నుదాహరించినకథకు మూలాధారము లై యున్నవి. ఈచరిత్రములందు చరిత్రమునకు విరుద్ధము లైన యనేకవిషయములు చూపింపఁబడి యున్నవిగాన కేవలము వానినే నమ్మి పరమసిద్ధాంతములనుగాఁ గైకొనరాదు. ప్రస్తుతము పై నుదాహరించిన చరిత్రాంశములను విమర్శింతము.

ఈచరిత్రములో నుదాహరింపఁబడిన మనుమసిద్ధి దాయాదు లగు అక్కనబయ్యన లనువా రెవ్వరో వారిచరిత్ర మెట్టిదో దెలియరాదు. వీరిశాసనము లెవ్వియును గానరావు. మనుమసిద్ధికిఁ బూర్వమునను తరువాతను మాత్రమేగాక మనుమసిద్ధికాలముననుు విక్రమసింహపురముననుు, తత్సామీప్య గ్రామములందును మహారాజుల పేరిటఁ బెక్కుశాసనములు లిఖింపఁబడి యుండఁగా వీరిపేరిట శాసనములు గానరాకుండుటచేత వీరినామము లెవ్వరికి మాఱుపేరులోఁ దెలియరాకున్నది. ఇంతప్రాముఖ్యమును గాంచిన చరిత్రాంశమును కేతనకవి తాను తిక్కనసోమయాజి కంకితముచేసిన దశకుమారచరిత్రమునం దైన నుదాహరించినవాఁడు గాఁడు. దశకుమారచరిత్రము రచింపఁబడు నప్పటికి నిది జరిగి యుండలేదని తలంచుకొందు మన్న మఱియెప్పుడు జరిగియుండు నను ప్రశ్నము రాఁగలదు. తిక్కన యజ్ఞములు చేసి సోమయాజి యై భారత మాంధ్రీకరించినవెనుక నిట్టిది సంభవించిన దని యూహిం

తమా ? అట్లయినపక్షమున భారత మెప్పుడురచించినవాఁడను ప్రశ్నము జనించును. దశకుమార చరిత్రమును కేతన రచించి తిక్కన కంకితముచేసిన కాలమునకుఁ బూర్వమె తిక్కన యనేకయాగములను జేసి యున్నట్లు 'మహితదక్షిణ లైన బహువిధయాగంబు లొనరించుననుట వర్ణనము దారి' అనియు 'అధ్వరాబ్జదిననాథునకున్' అనియు, 'యాగవిద్యాభిరామా' అనియు మొదలుగాగల వాక్యములను దశకుమారచరిత్రము నందు కేతనకవి తిక్కన గూర్చి ప్రయోగించి వాడియుండుట చేతనే విస్పష్టమగుచున్నది. గణపతిదేవ చక్రవర్తి క్రీ. శ. ౧౨౬౦-వ సంవత్సరమున స్వర్గస్థుఁ డైనట్లు గన్పట్టుచున్నది. ఆసంవత్సరమునకుఁబూర్వమె యీకథ నడచియుండవలయును. కడపమండలములోని నందలూరుశాసనములలో నొకదాని యందు మనుమసిద్ధిరాజు కోడూరు గ్రామమును ౧౨౫౭-వ సంవత్సరమున బ్రాహ్మణులకు దానము చేసి నట్లుగఁ జెప్పఁబడి యున్నది. ఆశాసనములోనే మనుమసిద్ధిరాజు కాకతీయ గణపతిదేవునితో స్నేహము సంపాదింపవలయు నని కోరిక కలిగియున్నట్టుగఁ జెలుపఁ బడినది. కనుక సిద్ధేశ్వరచరిత్రము నందు చెప్పఁ బడినట్లు గణపతిదేవచక్రవర్తి అక్కనబయ్యనలను జయించి మనుమసిద్ధికి రాజ్యమిప్పించి రాజ్యమహిమలు దెలిపినది ౧౨౫౭-వ సంవత్సరమునకుఁ బూర్వము కాదని పై నందలూరు శాసనమువలన నూహింపవచ్చునుగదా !. అనఁగా

౧౨౫౭వ సంవత్సరమునకును, ౧౨౬౧గవ సంవత్సరమునకును నడుమ నీచరిత్రము నడచి యుండవలయును. గణపతిదేవ చక్రవర్తి మనుమసిద్ధిరాజునకు సాహాయ్యముఁ జేయఁ బూని మార్గమధ్యమున వెలనాటిరాజును జయించి యప్పనము గైకొనియె నని సిద్ధేశ్వరచరిత్రమునం దుఁ జెప్పఁబడి యున్నది. కాని గణపతిదేవచక్రవర్తి ౧౨౨౮దవ సంవత్సరమునాటికె వెలనాటిని సంపూర్ణముగా జయించెను. అప్పుడు నెల్లూరును బరిపాలించుచున్నవాఁడు మనుమసిద్ధితండ్రి యగుతిక్కరాజు గాని మనుమసిద్ధిరాజు గాఁడని స్పష్టముగాఁ జెప్పవచ్చును. పైని జెప్పినట్లుగా ౧౨౫౭-౧౨౬౦ సంవత్సరముల నడుమమనుమసిద్ధిరాజు రాజ్యమును గోలుపోయి యుండరాదా యని తలంతుమేని ౧౨౫౮-౧౨౫౯ సంవత్సరములలో రాజ్యాభివృద్ధికై మనుమసిద్ధిరాజుచేతనునాతనిక్రిందియధికారప్రభువు లైనపల్లవరాజులచేతను జేయఁబడినదానములను గూర్చినశాసనములు పెంట్రగాలలోఁ గానంబడుచున్నవి. కావున నాకాలమున మనుమసిద్ధిరాజు పదభ్రష్టుఁ డయ్యె నని తలంపరాదు. అట్లయిన పక్షమున మనుమసిద్ధి యెప్పుడును పదభ్రష్టత్వమును బొందనేలేదా యనుశంక పుట్టవచ్చును. మనుమసిద్ధిరాజు పదభ్రష్టుఁడైనకాలము గూడఁ గలదు. మనుమసిద్ధితండ్రి యగు తిక్కరాజు కాలమునఁ బాండ్యులు కాంచీపురముపై దండెత్తి వచ్చి యారాజ్య మాక్రమింపఁగాఁ దిక్కరాజు పాండ్యులతో

యుద్ధముచేసి వారలను దఱిమి మరల చోళుని సింహాసనమునఁ గూరుచుండఁబెట్టి చోళస్థాప నాచార్యబిరుదము నందె నని యిదివఱకె తెలిపియున్నాఁడను. తిక్కరాజు మరణానంతరము పాండ్యులు తమశోంకి పూనికను విడనాడక కాంచీపురము మొదలుకొని యుత్తరభూమిని జయింపఁగోరి పలుమాఱు దాడి వెడలి వచ్చి నెల్లూరునకు దక్షిణభాగమునను, పశ్చిమపాక నాడును, మార్జవాడిదేశమును గల్లోలపెట్టుచుండిరి. తనసామంతుల ప్రార్థనము మీఁద గణపతిదేవచక్రవర్తి క్రీ.శ.౧౨౪౯ సంవత్సరమున నసంఖ్యాకములైన సైన్యములతోఁ గాంచీపురముపై దండెత్తిపోయి మారవర్మసుందరపాండ్యుని వాని కుమారుఁడైన జటవర్మసుందర పాండ్యుని నోడించి యచటి నుండి పాఱఁద్రోలి తనసచివాగ్రణియు, సైన్యపాలుఁడును, చక్రధారియు, కాశ్యపసగోత్రుఁడు నైన సామంతభోజమంత్రిని గాంచీపురపాలకునిగా నియమించినటు లేకాంబరేశ్వరుని దేవాలయములోని యొకశాసనమువలనఁ దెలియుచున్నది.* కాకతీయగణపతిదేవచక్రవర్తి దక్షిణదిగ్విజయ యాత్రను ముగించి రాజధాని యగునోరుగల్లు చేరిన వెనుక మఱుసటిసంవత్సరమున జటవర్మసుందర పాండ్యమహారాజు మరల దండయాత్ర వెడలి కాంచీపురమును, విక్రమసింహపురమును ముట్టడించి స్వాధీనపఱచుకొని మనుమసిద్ధిరాజును బాఱఁద్రోలి సిద్ధిరాజునకు

* The Indian Antiquary, Ekamrantha Inscription of Ganapathi. Vol. XXI, p. 197, No. 15. Ganapeswaram Inscription of the time of Ganapati.

శత్రుపుత్రులయినవీరులను పట్టాభిషిక్తులను గావించెనని నాలు గవయధ్యాయమునం దెలిపి యున్నాఁడను. వీనిని త్రిభువన చక్రవర్తి బిరుదాంకితుఁ డగువిజయగండగోపాల దేవుఁడు దఱిమి కాంచీపురి మాక్రమించుకొనియె నని వెనుకటియ ధ్యాయమునఁ దెలిపి యున్నాఁడను. అట్టి విజయగండగోపాలు నే విజయఘన్మఘశ్వరుం డని తిక్కన నిర్వచనోత్తరం రామాయణ మునఁ జేకొనియె నని వక్కాణించి యున్నాఁడను. ఈనా యూహ సరియైన పైనయెడల నిర్వచనోత్తరరామాయణము ౧౨౫౦ దవ సంవత్సరముతరువాత రచియింపఁబడి యుండును. అప్పటికి మహాభారతము రచియింపఁబడి యుండ లేదనుటస్పష్ట ము. మనుమసిద్ధిరాజు పరిపాలనముచేసిన దెప్పటివఱకో తెలిసి కొనుట గూడ కష్టసాధ్యముగ నున్నది. మనుమసిద్ధిరాజు కాటమరాజుతో యుద్ధము చేసి మరణించెనను మఱియొకకథ గలదు. మనుమసిద్ధికుమారుఁడు తిక్కరాజు ౧౨౭౮-దవ సంవత్సరమునఁ బట్టాభిషిక్తుఁ డయ్యెను. ౧౧౬౨-న సంవత్సర మునకుఁ దరువాత మనుమసిద్ధిశాసనములు గానరావు. మనుమ సిద్ధికుమారుఁడు ఇమ్మడ తిక్కరాజు రాజ్యమునకు వచ్చుటకుఁ బూర్వము కొంతకాలము నెల్లూరిపట్టణము కాకతీయునై న్యాధి పతులపాలనమున నున్నట్లు కొన్ని శాసనములవలనఁ గానంబడు చున్నది. దాదినాగయసాహిణి యను నాగదేవమహారాజు గణపతిదేవచక్రవర్తికిఁ బ్రతినిధిగా ౧౨౭౨-౭౩-వ సంవత్సర

ములో విక్రమసింహపురమును బరిపాలించు చుండెను. ఇంకొకచిత్రము గలదు. గణపతిదేవుని సైన్యాధీశ్వరులలో నొకఁడును, రాయసహస్రమల్లుఁ డనుబిరుదముగల వాఁడును నగు అంబదేవమహారాజు రాజ్యపదభ్రష్టుఁ డైన మనుమ గండగోపాలుని విక్రమసింహపురంబున సింహాసన మెక్కించితి నని యొక శాసనమునఁ జెప్పుకొని యున్నాఁడు. ఈ మనుమసిద్ధిరాజునే మనుమగొండగోపాలుఁ డని వక్కాణించి యుండవచ్చును. ఏలయన నీ తెలుఁగుచోడరాజులకు గండగోపాలుఁ డను బిరుదము గలదు. తిక్కరాజునకు రాయగండగోపాలుఁ డనుబిరుదము గలదు. మనుమసిద్ధికిని ఈబిరుదము గలదు. ఇతనికి దాయాది యొకఁడు విజయగండగోపాలుఁ డని వ్యవహరింపఁబడుచున్న కారణమున మనుమసిద్ధిని మనుమగండగోపాలుఁ డనిజనులు వ్యవహరించి యుందురు. మఱియొక కాకతీయసైన్యాధిపతి మనుమగండగోపాలుని సంహరించితి నని చెప్పుకొనియెను. ఏనినన్నిటిని బరిశీలించి చూచినపక్షమున నీక్రిందివిధమున సిద్ధేశ్వరచరిత్రములోని విషయములను సమన్వయింపవచ్చును. ౧౨౫౭-వ సంవత్సరమునఁగాని మఱుసంవత్సరముగాని మనుమసిద్ధిదాయాదులు సిద్ధిరాజును నెల్లూరునుండి పాఱఁదోలఁగా నతఁడు కందుకూరుసీమలోని పెంట్రాలకోటలోఁ గొంతకాలము దాగి యుండును. ఆకాలమున మహాప్రసిద్ధిగాంచిన యతని మంత్రి తిక్కనసోమయాజి గణ

పతిదేవునికడకుఁ బోయి యాతనివలన మన్ననలనుగాంచి తన వచ్చినపని తెలుపఁగా నాతఁడు తనసైన్యమును బంపి మనుమసిద్ధిరాయాదులను నెల్లూరునుండి పాఱఁద్రోలి మనుమభూపతిని బునరభిషిక్తుని గావించి యుండును. తిక్కనసోమయాజి భారతాఖ్యానమును విన్పించినాఁడనియును, తిక్కన వాదమున గెలిచి బౌద్ధులను హింసింపఁ జేసినాఁడనియుఁ జెప్పెడికథలు మాత్రము కవిసృష్టి యని స్పష్టముగఁ జెప్పఁదగును. తిక్కన గణపతిదేవుని సమ్ముఖమున నద్వైతవాదమును సలిపి బౌద్ధుల నోడించినను నోడింపవచ్చునుగాని వారి హింసలకుమాత్ర మాతఁ డుత్తరవాదియై యుండఁడు. గణపతిదేవచక్రవర్తి యద్వైతవాది యని యాతనికూఁతురు గణపాంబశాసనమునఁ గూడ వక్కాణింపఁ బడియుండుట గణపతికిని తిక్కనసోమయాజికిని సమావేశము గలిగియుండుటను సూచింపుచున్నది.

# ఆఱవ యధ్యాయము

## కాటమరాజ మనుమసిద్ధిరాజుల యుద్ధము
## ఖడ్గతిక్కన విక్రమ పౌరుషాదులు.

మనుమసిద్ధిరాజు మరణకాలమునాటికిఁ బాకనాడును మాత్రము పరిపాలించుచుండెను. మనుమసిద్ధివలనఁ బొందిన యైశ్వర్యమును మాత్రమేగాక కవితిక్కన గణపతిదేవచక్రవర్తివలన నెనిమిదియూళ్లను విశేషమైన యైశ్వర్యమును బడసియుండెను. అయినను గడవఱకుఁ గవితిక్కనయు, ఖడ్గతిక్కనయు మనుమసిద్ధిరాజు విశ్వాసమునకుఁ బాత్రులై యొప్పియుండిరి. ఖడ్గతిక్కన తనకృతజ్ఞతను మఱువక కడపట మనుమసిద్ధిరాజునకును కాటమరాజునకును జరిగినయుద్ధములో వీరశయనము గాంచెను. ఈవిషయము కాటమరాజుకథవలన మనకు వ్యక్తమగుచున్నది. విద్యావితరణ పౌరుషాదులయందుఁ గవితిక్కన యెంతప్రఖ్యాతుఁడో వీర్యవితరణపౌరుషాదులయందు ఖడ్గతిక్కన యంతప్రఖ్యాతుఁడుగ నుండెను. ఇతని మరణకాలమునఁ దల్లిదండ్రులు వృద్ధులై సజీవులుగ నున్నట్లు గనంబడుచున్నది. ఆడువారిలోఁ గాని మగవారిలోగాని కొట్టరువు వారికుటుంబమునఁ బిఱికితన మనుమాట వినరాదనుటకు

ఖడ్గతిక్కననుగూర్చినకథయె సాదృశ్యముగా నున్నది. ఆకథనే నేనిచట సంగ్రహముగాఁ దెలుపుచున్నాఁడను.

పసులమేపుబీళ్లనిమిత్తమై కాటమరాజునకును మనుమసిద్ధిరాజునకును వివాదము పొసఁగి మహాయుద్ధము జరిగినటులు గాటమరాజుకథవలనఁ దెలియుచున్నది. పుల్లరి యిచ్చుపద్ధతిపై గాటమరాజు తనపసులను మనుమసిద్ధిరాజు మేతబీళ్లలో మేపుకొని యక్కడఁ దనకోడెదూడలలో నేదోనష్టము సంభవించినదన్నకారణమునఁ బుల్లరి నీయక యెగఁ గొట్టెను. దానిపై మనుమసిద్ధిరాజు పసులఁ బోనీయక యాటంకపఱచెను. ఉభయులయుద్ధమున కిదిముఖ్యకారణము. ఈయుద్ధకథనము ద్విపదలో రామరావణయుద్ధముగ వర్ణింపఁ బడినది. మనుమసిద్ధి రావణుఁడుగఁ బోల్పఁ బడియెను. కాటమరాజుతండ్రి పెద్దిరాజు. వానితండ్రి వల్లురాజు. ఇతఁడాత్రేయగోత్రోద్భవు లైన యాదవులసంతతిలోని వాఁడుగఁ జెప్పఁ బడియెను. వల్లురాజు కనిగిరిసీమలోనియాలవలపాడున కధిపతిగనుండెను. కాటమరాజు కనిగిరిలోని యెఱ్ఱగడ్డపాడున కధిపతిగ నుండెను. ఒక సంవత్సరమున దేశమున ననావృష్టి సంభవించెను. యాదవులనంబడుగొల్లవాండ్రెల్లను దమతమపసులమందలను దోలుకొని దక్షిణమునకువచ్చి మనుమసిద్ధిరాజుయొక్క పసులబీళ్లను గొన్నిటిని పుల్లరికిఁ గైకొని పసులను మేపుకొని పుల్లరి చెల్లింపకయె వెడలిపోయిరి. అందుపై మనుమసిద్ధిరాజునకుఁగోపము

వచ్చి తిక్కనాదిమంత్రివర్గముతో నాలోచించి అన్నంభట్టను బ్రాహ్మణుని కాటమరాజుకడకు రాయబారినిగాఁ బంపిరి. కాటమరాజు పైనిజెప్పినకారణమును బురస్కరించుకొని పుల్లరి నీయక తగవులు పెట్టెను. అన్నంభట్టుప్రయత్నము నిష్ప్రయోజన మయ్యెను. అతఁడు తిరిగివచ్చి యాసమాచారమంతయు మనుమసిద్ధిరాజునకు నివేదించెను. మనుమసిద్ధిరాజున కాగ్రహమువచ్చి కాటమరాజును దండించి పుల్లరి గైకొని కార్యమును సాధించుకొని రమ్మని ఖడ్గతిక్కనను నియమించెను. అప్పుడు రాజునాజ్ఞ శిరసావహించి సైన్యములను సమకూర్చెను. తిరునామాలతిప్పరాజు, శ్రీకంఠరాజు, పెదవేగిచొక్కరాజు, పెదవరదరాజుఁ అర్లుకొండ అచ్చిరాజు, ఆదివన్నెమన్నెరాజు, గయికొండగంగరాజు, ఉర్లకొండసోమన్న, ఉదయాద్రి ఉమ్మయ్య, చెన్నపట్టణము చంద్రశేఖరుఁడు, దేవముని వెంగళయ్య, ఘట్టుకోట బసవరాజు, కాళహస్తి పాపతిమ్మరాజు, వెలకంచి వెంగళపతిరాజు, ప్రభగిరిపద్మశేఖరుఁడు, మొదలుగాఁగల యోధవరు లనేకులు మనుమసిద్ధిపక్షమునఁ దోడ్పడ నేతెంచిరి. ఈ యోధులకందఱకు నాయకుఁడై ఖడ్గతిక్కన సిద్ధిరాజు సేనలను నడిపించుకొని కాటమరాజుపై దండెత్తి పోయెను. మనుమసిద్ధి తనపైదండెత్తిరానున్నాఁడని ముందుగాఁ దెలిసికొని కాటమరాజు సయితము సైన్యములను సమకూర్చుకొని సిద్ధముగా నుండెను. పల్నాటిప్రభు వయిన

పద్మనాయఁడును, పల్లికొండ ప్రభువయిన చల్లాపిన్నమనాయఁడును, దొనకొండ అయితమరాజు ఎఱ్ఱయ్య, భట్టాపులరాజు, కరియాపులరాజు, పల్లభన్న, నాచకూళ్ల నాయఁడు, నేతిముద్దయ్యనాయఁడు, పాచయ్యనాయఁడు, ముమ్మయ్యనాయఁడు, పుత్తమరాజు మొదలుగా గొందఱు యోధులును గాటమరాజునకుఁ దోడ్పడ వచ్చిరి. ఈ సేనరంతకును, బిన్నమనాయని మంత్రియు నారాధ్య బ్రాహ్మణుఁడునగు బ్రహ్మరుద్రయ్య నాయకుఁడై యెదురుగాఁ బోయి పాలేటియొడ్డుననున్న పంచలింగాలకొండకడ నెదుర్కొనియెను. అప్పుడుభయపక్షముల వారికిని ఘోరమైన యుద్ధముజరిగినది. తుదకుఁ దిక్కన సైన్యమంతయు హతముకాఁగా నతఁడొక్కఁడును వీరాధవీరుఁడై రణరంగమున నిలువఁబడి యుండుటను జూచి ప్రతిపక్షయోధుఁడైన పిన్నమనాయఁడుచూచి,

"కం. పోరునిలుపు మోయిభూసురోత్తముఁ డ
పరిగాదు మాతోడ సమరంబుఁ జేయ
అగ్రజుల్ మీరు యాదవులము మేము
ఉగ్రము మామీద నుంపంగ రాదు."

అని పలికెనఁట, అందుపైని తిక్కన తనతోనున్న సైన్యమంతయు నాశమయి నందులకుఁ జింతించి మరల సైన్యమును గొని వచ్చి యుద్ధము చేసెదం గాకయని గుఱ్ఱమును ద్రిప్పుకొని పురంబునకు వచ్చెనఁట. పౌరజనంబులు పరాజితుఁడై పాఱి వచ్చిన తిక్కయోధుని గాంచి పకపకనవ్వువారును, కేరడము

లాడువారును నై భయభక్తులువిడిచి వర్తించి మనస్సునకు జింతఁ గలిగించిరి. పౌరజనంబులు మాత్రమె గాదు. ఇంటికిఁ బోయినతోడనే వృద్ధుఁడై మంచమునఁ బడియున్న తండ్రి సిద్ధనామాత్యుఁడు సయితము కోపము దెచ్చుకొని,

"సీ. రణరంగమున మోహారంబులు పొడఁగని
ప్రాణంబు దాఁచిన పందగజము
విజయాధిపునిదాడి వెనుకొని తిరుగక
వెస దప్పివచ్చిన దిగ్గజంబ
పోరఁ జాలక యోడి మారుమాటల మాని
మంచాన కొఱఁగిన మత్తగజము
పెనుపల్లి చెఱువులో బిరుదు లన్నియు గొంపఁ
గ్రుంకంగ వచ్చిన కుంజరంబ
ఆ. నేఁడు మొదలు చేసి నెల్లూరిసీమలోఁ
బ్రగడతనము మాని మగిడి తిఱలఁ
బూరి గఱచి తిక్క! భూతంబుసోకినఁ
బాఱువానిరీతిఁ బంద వైతి."

అని యుపాలంభ మొనర్చెనఁట. అంత తిక్కయోధుఁడు తండ్రి పోటుమాటలకు సైరించి స్నానమునకుఁ బోఁగా వీరపత్నియు, వీరమాతయు నగుభార్యచానమ్మ స్త్రీల కుంచినట్లుగా రహస్యస్థలమున నీళ్లబిందె నుంచి దానికి నులకమంచము చాటుపెట్టి దానిమీఁదఁ బసపుముద్ద యుంచెనఁట. తనభార్య చెయ్దమును జూచి సిగ్గుపడి తిక్కన ఖేదపడుచుండఁగాఁ జానమ్మ భర్తను జూచి,

5

"క. పగఱకు వెన్నిచ్చినచో
నగరే నిను మగతనంపు నాయకు లందున్
ముగురాడువార మైతిమి
వగపేటికి జలక మాడవచ్చినచోటన్."

అని యొకసక్కెము లాడెనఁట. తరువాత స్నానముచేసి భోజనమునకుఁ బోయి భుజించునపుడు వీరమాతయగు ప్రోలమ్మ కుమారునకు అన్నములోఁ బాలుపోయునపుడు పాలు విఱిగిపోవఁగా నామె సయితము పరిహాసముగా,

"క. అసదృశముగ నరివీరులఁ
బసమీఱఁగ గెలువలేని పందక్రియ నీ
వసివైచి విఱిగివచ్చినఁ
బసు ల్విఱిగినవి తిక్క! పాలు ల్విఱిగెన్."

అని పలికెనఁట. ఇఁకఁ జెప్పఁదగిన దేమున్నది. ఏఁబదేండ్లు నిండిన యాయోధవరునకు నాపలుకు లెల్లను ములుకులై నాటె. మానాభిమానములు ముప్పిరిగొనఁ దాను జేసినపనికిఁ బశ్చాత్తప్తుఁడై 'నన్నుఁ బిఱికిపందనుగా వీరు దలంచుచుండిరి. ఈసారి మరలఁ బోయి శాత్రవులను మార్కొని జయము గొందును. అయ్యది సంప్రాప్తము గాదేని ప్రాణం బుండుదనుకఁ బోరాడి వీరస్వర్గంబు నైనఁ జూఱగొందు. మానాభిమానములు గలవాఁ డిట్టిరోఁత బ్రదుకుఁ బ్రదుకం జాలఁడు' అని తలపోసుకొని యెంతెన్నివిధములవారించినను వినక సిద్ధిరాజు నొడంబఱచి కావలసినసైన్యములం గొని సంగరోత్సాహియై

పోయి శాత్రవులను మార్కొని ప్రచండమైనయుద్ధము చేసెను. ఆతని యుద్ధక్రమము నిట్లొకకవి యభివర్ణించి యున్నాఁడు.

"చ. పదటున వాజి రాహుతులపై దుమికింపుచుఁ దిక్కుఁ దార్చినన్
బెదరి పరిభ్రమించి కడుఁబిమ్మటఁ వీరులు భీతచిత్తులై
యదెయదె. డాలు వాల్మెఱుఁగు లల్లవె యల్లదె యాతఁడంచనన్
గొదుకక యాజిచేసె రిపుకోటుల కందఱ కన్నిరూపులై."

ఇట్లే పూర్వము బ్రాహ్మణుఁ డగునందూరి కొమ్మనామాత్యుఁడు క్రొత్తచర్ల (కొచ్చెర్లకోట) పరిసరభూములందుఁ గటకరాజుతోఁ బోరాడి చూపినయుద్ధకౌశలమును మంచనకవి తన కేయూర బాహుచరిత్రమునందు,

సీ. నెలకట్టెవాటునఁ జెలఁగి రెంటిని మూఁటిఁ
గూడఁ గఱ్ఱంబులు గుదులుగ్రుచ్చి,
ప్రతిమొగం బగునరపతుల కత్తళమునఁ
గడిమ మైఁ వీపులవెడలఁ బొడుచుఁ,
బందంపుగొజెయలపగిది నేనుంగుల
ధారశుద్ధిగ నసిధార దునుముఁ,
జిదియించుఁ బగిలించుఁ జేతులతీటవో
వడిగాండ మేసి మావతులతలలు,

గీ. తలపుడికి వ్రేసి మానంతుతలలు శత్రు
రాజశిరములు ద్రొక్కించు రాఁగెఁ దిరుగ
వాగె నుబ్బెడు తనవారువంబుచేత
మహితశౌర్యుండు కొమ్మనామాత్యవరుఁడు."

అని మిక్కిలి మనోహరముగా వర్ణించి యున్నాఁడు. ఆకాలమునం దిట్లే బ్రాహ్మణమంత్రివర్యులు రాజ్యతంత్రమునందే గాక

యుద్ధతంత్రము నందును ప్రవీణులై యుండి రనుట కిట్టిదృష్టాంతముల నెన్నియైన యాంధ్రచరిత్రము నుండియు, సారస్వతము నుండియుఁ జూపఁ గలము.

ఇట్లు ప్రచండవిక్రమార్కుఁడై ఘోరసంగ్రామంబున శత్రుసేనను మార్కొని పీనుంగుపెంటలు గావించుచు రణకేళి సల్పుచుండ యాదవవీరులును వెనుదీయక మహోగ్రులై తిక్కనసైన్యము పైఁబడి కత్తులఁ గఠారుల నీటెలం బొడిచి చక్కాడుచుఁ బెద్దకాలంబు పోరాడ నుభయసైన్యంబులం బెక్కండ్రు వీరభటులు నేలం గూలిరి. అంతటఁ బిన్నమనాయఁడు ఖడ్గతిక్కనను సమీపించి "ఓవిప్రోత్తమా! యుద్ధము చేయుట బ్రాహ్మణునకుఁ బాడి గాదు. మిమ్ముం జంపిన మాకు బ్రహ్మహత్యాదోషంబు వాటిల్లు నని నామనంబు తల్లడిల్లుచున్నది. తొలంగుట మీకును మాకునుగూడ శ్రేయస్కరం బనియూహింతు" నని గొంతెత్తి గంభీరవాక్యములు వలుకఁ దిక్కనయుఁ "ఓ నాయఁడా! రణశూరుఁడవై బ్రాహ్మణక్షత్రి యుండ నగు నాతోడ యుద్ధముసేయఁ జాలక పందక్రియ ధర్మపన్నంబు లేల చదివెదవు? వానిం గొన్ని నేనెఱుంగుదుం గాని, వీరుండ వౌదువేని కదలక నిలుచుండి యుద్ధముచేసి చేతనయ్యోనేని నాప్రాణంబులు గొని విజయపతాక మెత్తుము. కాదేని శరణుచొచ్చి మాపుల్లరి మాకుం బెట్టుము." అని హెచ్చరింపఁ [illegible]మనాయఁడు బ్రహ్మహత్యాదోషమునకు వెఱచి

యేమిచేయుటకును జేతులును గాళ్ళు నాడక నిశ్చేష్టితుఁడై చూచుచుండ, వానిమంత్రి బ్రహ్మరుద్రయ్య యచటికేతెంచి "తిక్కన నేఁ దలంపడి పోకార్చెద నీవటుండు"మని తన ప్రతివీరునిపై హయమును బఱపి యుద్ధము చేయఁగా నిరుపుర గుఱ్ఱంబులు నీలుపోఁకల నేలం గూల నిరుపురును గత్తులు దూసి "హరహరా" యని యభిమన్యులక్ష్మణకుమారులవలె ద్వంద్వయుద్ధమునకుఁ గలియంబడి యుభయసైన్యంబులవారును నివ్వెఱపడి చూచుచుండఁ బెద్దయుం బ్రొద్దు పోరాడి తుదకు నేల కొఱఁగిరి. ఆపాటుంగని తిక్కనసైనికులు హతశేషులైన వారీక్రిందివిధముగాఁ జెప్పుకొని యేడ్వసాగిరఁట,

"సీ. ధైర్యంబు నీమేనఁ దగిలియుండుటఁ జేసి
చలియించి మందరాచలము తిరిగె,
గాంభీర్య మెల్ల నీకడనయుండుటఁ జేసి
కాకుత్థ్సుచే వార్ధి కట్టువడియె,
జయలక్ష్మి నీయురస్థ్సలిని యుండుటఁ జేసి
హరి పోయి బలిదాన మడుగుకొనియె,
నాకార మెల్లనీయందె యుండుటఁ జేసి
మరుఁడు చిచ్చునఁబడి మడిసి చనియెఁ,

గీ. దిక్కదండనాథ దేవేంద్రపురికి నీ
వరుగ టెఱిఁగి నగము తిరుగు టుడుగు
నబ్ధి కట్టువిడుచు నచ్యుతు కోదమాను
మరుఁడు మరలఁగలుగు మగలరాజ"

అని తనసైనికు లెల్ల హాహాకారములు సేయుచుండఁ, బ్రాణ

ములు దేహమును విడిచిపోయినవిధము నాకవికర్యుఁడే యిట్లు చెప్పి యున్నాఁడు.

"సీ. నందిని బుత్తెంచె నిందుశేఖరుఁడు నీ
వన్న యేతెమ్ము తారాద్రికడకు
గరుడుని బుత్తెంచె నగహారి రావయ్య
వడి సిద్ధతిక్క! కైవల్యమునకు
హంసను బుత్తెంచె నజుఁడు నీడకు ను
భయకులమిత్ర రా బ్రహ్మసభకు
నైరావతముఁ బంపె నసురేంద్రు డిప్పుడు
దివమున కేతెమ్ము తిక్కయోధ,
గీ. యనుచు వేఱువేఱ నర్థితోఁ బిలువఁగ
వారు వీరు గూడ వచ్చి వచ్చి
దివ్యయోగి యైనతిక్కనామాత్యుండు
సూర్యమండలంబుఁ జొచ్చి పోయె."

మఱియును విక్రమసింహపుర నివాసులైన పౌరులెల్లరును ఖడ్గతిక్కనమరణవార్తను విని తాము వానిని బరిహసించి యపచారము చేసినందులకుఁ బశ్చాత్తప్తు లగుచు నాతనిగుణగణంబులు దలపోసికొని దుఃఖాక్రాంతచిత్తులై,

"ఉ. వెన్నెలలేనిరాత్రియు రవిప్రభలేనిదినంబు నీరులే
కున్నసరోవరంబు కడు నొప్పగుదీపములేక యున్నయిల్లు నై
విన్నఁదనంబు నొందె మనవిక్రమసింహపురంబు చూడఁగాఁ
బున్నమచంద్రుఁబోలు మనపోలమతిక్కఁడు లేమినక్కటా!

అని పరిపరివిధముల విలపించిరఁట. ఆహా! వీరవర్యులయు కవివర్యులయు చావు లెవ్వరికి నేడ్పుఁ బుట్టింపవు?

తరువాత మనుమసిద్ధియు సైన్యసమేతముగాఁ గాటమ రాజుపై దండెత్తిపోయి యుద్ధముచేసి వీరస్వర్గమును జూఱఁ గొనియెను. అటుపిమ్మట దానుబొందినగాయములవలనఁ గాటమరాజుగూడ స్వర్గస్థుఁ డయ్యె నఁట. పుల్లరినిగూర్చినయుద్ధ మీవిధముగాఁ బర్యవసిత మయ్యెను. మనుమసిద్ధి స్వర్గస్థుఁ డైనపిమ్మట నీదేశమును గాకతీయాంధ్ర చక్రవర్తిసైన్యాధిపతి యగుదాదినాగన్న నాగదేవమహారా జనునామముతోఁ గొంతకాలము పరిపాలించెను.

# ఏడవ యధ్యాయము

## నిర్వచనోత్తర రామాయణము.

మేరులెత్తినను నగేశ్వరువర్తనము రత్నాకరవేష్టితావని వినంబడదని యెఱింగినవాఁడుగాన తిక్కనకవిచేఁ గృతి నొందవలయు ననుకోరికగలవాఁడై మనుమసిద్ధి యొకనాఁడు తిక్కనమనీషిం బిలువ నంపించి 'నిన్నుమామాయని నేను బిలుచుచున్నందుకు నీవు నాకు భారతీకన్య నొసంగ నర్హుఁడవైయున్నాఁడ' వనిపలికెను. ఆపలుకు తనమనస్సున కింపు పుట్టించె నని,

> "క. ఏ నిన్ను మామ యనియెడు
> దీనికిఁ దగ నిమ్ము భారతీకన్యక నా
> కీ నర్హుఁడ వగు దనినను
> భూనాయకుపలుకు చిత్తమున కింపగుడున్".

అను పద్యమువలనఁ దిక్కన తేటపఱచి యున్నాఁడు. దీనినిబట్టి తిక్కనకవికి మనుమసిద్ధిరాజునకుఁ గృతి నొసంగుకోరిక యదివఱకు లేదనియు నతఁడు పలికిన చమత్కారపుం పలుకు మనస్సున కానందము గలిగించుటచేతఁ గృతి నిచ్చినట్లును స్ఫురించుచున్నది. ఇట్లు మొదట సమ్మతి లేకయున్నను మనుమసిద్ధికులశీల స్వరూపాదులం దలంచుకొని

నప్పు డయ్యావి సయుక్తికముగా నాతం డర్హుం డనిబోధిం చిన మనస్సు సమాధానపఱచుకొని కృతియిచ్చి నట్లు నిర్వచనోత్తరరామాయణములోని,

"సీ. సకలలోకప్రదీపకుఁ డగుపద్మినీ
మిత్రవంశమున జన్మించె ననియుఁ
జూచిన మగలైనఁ జొక్కుడు నట్టి సౌం
దర్యసంపద సొంపు దాల్చె ననియు
జనహృదయానందజననమై నెగడిన
చతురతకల్మి నప్రతిముఁ డనియు
మెఱసి యొండొంటికి మిగుల శౌర్యత్యాగ
విఖ్యాతకీర్తిచే వెలసె ననియు
వివిధవిద్యాపరిశ్రమవేది యనియు
సరసబహుమానవిరచితశాలి యనియు
మత్కృతీశ్వరుఁ డగుచున్న మనుమనృపతి
సుభగుఁ గావించుటకు సముత్సుకుఁడ నైతి"

అనుపద్యమువలనఁ దెల్లమగుచున్నది. కావున ధనాపేక్షచేతఁ దిక్కన మనుమసిద్ధిరాజునకుఁ గృతి నొసంగి యుండ లేదనుట స్పష్టము. ఏసంవత్సరమునఁ దిక్కన నిర్వచనోత్తరరామాయణ మును రచించి మనుమసిద్ధిరాజున కంకితముచేసెనో నిశ్చయ ముగాఁ దెలుపుట కాధారము లేదుగాని భారతరచనకుఁ బూ ర్వము బహుసంవత్సరములకు, అనఁగా ముప్పదిసంవత్సరముల వయస్సులోపల నేరచించి యుండు నని స్పష్టముగాఁ జెప్పవచ్చు ను. అప్పటి కీకవిసత్తమునికీర్తి విద్వల్లోక మంతటను వ్యా

పించి యుండలేదని చెప్పవచ్చును. మఱియును నతఁడు శ్రౌత స్మార్త క్రియాతత్పరుఁడై యున్నను క్రతుదీక్షను బూనియాచరించు నంతటి కర్మఠుఁడుగా నున్నటులు గనుబట్టఁడు. భారత గద్యములోవలె 'బుధారాధనవిరాజి తిక్కన సోమయాజిప్రణీతం'బని వ్రాసికొన్నట్లుగా వ్రాసికొనక నిర్వచనోత్తరరామాయణము గద్యలో 'బుధారాధనవిధేయ తిక్కన నామధేయప్రణీతం' బనిమాత్రము వ్రాసికొని యుండుటచేత నప్పటికిఁ గ్రతువులాచరించి యుండలేదని యూహింప వలసివచ్చుచున్నది. ఇది ప్రథమకావ్య మగుటచేతనే కాఁబోలు 'నూత్నసత్కవీశ్వరులను భక్తిఁగొల్చి మఱివారికృపన్ గవితావిలాసవిస్తరమహాసియుఁడ నైతి' నని తన వినమ్రభావముఁ దేటపఱచి యున్నను,

"చ. పలుకులపొందు లేక రసభంగము సేయుచుఁ బ్రాతవడ్డమా
టల దమసేఁత చూపి యొకటన్ హృదయం బలరింపలేక, యే
పొలమును గాని యెట్టిక్రమమున్ దమ మెచ్చుగ లోక మెల్లన
వ్వులఁ బొరయన్ జరించుకుకవుల్ ధర దుర్విటు లట్లు చూడగన్."

అని కుకవినిరాసనమున కెడమిచ్చెను. అయిననిం దాతఁడు స్వాతిశయభావమును జూపక కుకవులమార్గమును మాత్రము నిరసించెను. ఇట్లు కుకవులమార్గమును నిరసించుటతో మాత్రము తృప్తి నొందియుండక తరువాతి తెలుఁగుకవులకు నుపయుక్తములై సూత్రప్రాయములుగా నుండునట్లు,

"కం. తెలుఁగుకవిత్వముఁ జెప్పన్
దలఁచినకవి యర్థమునకుఁ దగియుండెడు మా
టలు గొని వళులుం బ్రాసం
బులు నిలుపక యొగిని బలిమిఁ బొందుచుట చదురే."

* * * * *

"క.- అలవడ సంస్కృతశబ్దము
తెలుఁగుపడ్డి విశేషణంబు తేటపడం గాఁ
బలుకు నెడ లింగవచనం
బులు భేదింపమికి మెచ్చు బుధజనము కృతిన్"

* * * * *

"గీ ఎట్టికవి కైనఁ దనకృతి యింపుఁ బెంపఁ
జాలుఁ గావునఁ గావ్యంబు సరసులైన
కవులచెవులను నెక్కినఁ గాని నమ్మఁ
డెందు బరిణతిగలుగు కవీశ్వరుండు"

అనుపద్యములను జెప్పి సత్కవీంద్రమార్గమును గూడఁ దెలిపి యున్నాఁడు. మఱియు నుత్తరరామాయణము రచించుటకుం గలకారణ మీవిధముగాఁ జెప్పి యున్నాఁడు.

"క. ఎత్తెఱఁగైనను ధీరో
దాత్తగుణోత్తరుఁడు రామధరణీపతి స
ద్వృత్తము సంభావ్యం బగుట
నుత్తరరామాయణోక్తియుక్తుఁడ నైతిన్."

తిక్కన తననిర్వచనకావ్యములోని కవిత్వరీతి పండితుల కానందకరమై యుండు ననిసూచించుటకో యనఁ గవిత్వపద్ధతి యిట్లుండవలయు నని యీక్రింది పద్యములలోఁ దనప్రతిజ్ఞావాక్యములనుగూడ నుడివి యున్నాఁడు

"ఉ. జాత్యనుగామి నొప్పయినసంస్కృత మెయ్యెడఁ జొన్ప వాక్యసాం
గత్యము సేయుచో నయినగర్వముతోడుగఁ జెప్పి పెట్ట దౌ
ర్గత్యముఁ దోపఁ బ్రాసము ప్రకారము వేఱగునక్షరంబులన్
శ్రుత్యనురూప మంచు నిడ కూరుల కివ్విధ మింపుఁ బెంపదే."

"క. లలితపదహృద్యపద్యం
బు లనపదార్థంబు ఘటితపూర్వాపరమై
యలతియలంతి తునియలుగ
వాలసంధించిన విధంబు నమరగ వలయున్."

ఇట్లు తిక్కన కుకవినిందను జేసియు, సత్కవీంద్రమార్గమును దెలిపియు, కవిత్వపద్ధతినిగూర్చి ప్రతిజ్ఞావచనములను బలికియును సంతృప్తినిఁ బడయఁ జాలక తనకావ్యము స్వగుణము చేతఁ గాకపోయినను తనతాత యైనమంత్రిభాస్కరుని సారకవిత్వముచేతనైనను లోక మాదరించు నని యీక్రిందిపద్యములోఁ జెప్పి యున్నాఁడు.

"గీ. సారకవితాభిరాము గుంటూరివిభుని
మంత్రిభాస్కరు మత్పితామహునిఁ దలఁచి
యైన మన్నన మెయి లోక మాదరించు
వేఱ నాకృతిగుణములు వేయు నేల?"

మొదట మనుమసిద్ధి తన్ను మామా యని పిలుచుచున్నందులకుఁ గృతి నిమ్మని యడుగుటయు, అతనిపలుకుఁ దనకు నింపు పుట్టించుటయు, తరువాత మనుమసిద్ధి కులశీలరూపస్వభావాదులు దలపోసికొని కృతి నొందుట కర్హుండని మనస్సు సమాధానపఱచుకొనుటయు, కుకవినిందఁ జేసియు, కావ్యరచ

నావిధానమును దెలిపియు, సత్కవీంద్రమార్గమును సూచించియు, ఉత్తరరామాయణమును రచించుటకుఁ గల కారణమును వ్యక్తీకరించియు, కవిత్వపద్ధతిని గూర్చి ప్రతిజ్ఞావాక్యములను నుడివియుఁ దృప్తిం గనఁజాలక లోక మెట్లాదరించునో యన్న సంకోచము పీడింపఁ దనతాతయైన మంత్రి భాస్కరుని సారకవిత్వ మహిమము నైనఁ దలంచి మన్ననమొంది లోకమాదరించునని సమాధానము చెప్పుకొని తృప్తిగాంచుటయు మొదలగు వానిని బరిశీలించిన పక్షమునఁ దిక్కన రచించినకావ్యములలో నిది ప్రథమకావ్య మని తప్పక స్ఫురింపఁ గలదు.

తిక్కన తనతాతయైనమంత్రిభాస్కరుని గ్రంథములం బేర్కొన కుండుట మిక్కిలిశోచనీయమైన విషయముగా నున్నది. ఇట్లే మనుమసిద్ధిరాజు తండ్రియైన తిక్కరాజునకుఁ గవిసార్వభౌమ బిరుదాంకముగల దని చెప్పినాఁడుగాని యాతఁడు రచించినగ్రంథము లెవ్వియో దెలిపినవాఁడు గాఁడు. నిర్వచనోత్తరరామాయణమును గూర్చి యాంధ్రకవుల చరిత్రమునం దిట్లున్నది.

"తిక్కన తెనుఁగుపుస్తకములవలెఁ గాక రఘువంశాదికావ్యములవలె దీని నీకవి నడుమనడుమ వచనములుంచక సర్వమును పద్యములుగానే రచియించెను. ఈతఁడు రచించినభారతమువలె నీయుత్తరరామాయణ మంత రసవంతముగాను ప్రౌఢముగాను లేక పోయినను, పదవాక్యసౌష్ఠవము గలిగి మొత్తముమీఁద సరసముగానే యున్నది. ఇది బాల్యమునందు రచియింపఁబడినదగుటచే నిట్లుండి యుండును. ఈగ్రంథమునందు పదకాఠిన్యమంతిగా

లేకపోయినను బహుస్థలములయం దన్వయకాఠిన్యము గలదు. ఇందలికథ సంస్కృతములో నున్నంతలేక మిక్కిలి సంగ్రహపఱుపఁబడినది. శైలి పలుచోట్ల నారికేళపాక మనియే చెప్పవచ్చును. అందుచేతనే యీగ్రంథము భారతమువలె సర్వత్ర వ్యాపింప కున్నది. ఇతఁడు పదియాశ్వాసముల గ్రంథము వ్రాసినను పుస్తకమును మాత్రము ముగింప తేదు. రామనిర్యాణ కథను జెప్పుట కిష్టములేక గ్రంథపూర్తి చేయలేదని పెద్దలు చెప్పుదురు. తరువాతఁ గొంతకాలమునకు మిగిలిన భాగము నేకాశ్వాసముగా గచియించిన జయంతిరామభట్టు తిక్కనసోమయాజి మనుమరాజున కిచ్చినట్టుగా నరాంకితముచేయక తాను జేసిన కడపటియాశ్వాసమును భద్రాద్రిరాముని కంకితము చేసెను ”

నిర్వచనోత్తర రామాయణము పదవాక్యసౌష్టవము గలిగి మొత్తముమీఁద సరసముగానే యున్న దని యొప్పుకొనుచు నాంధ్రకవి చరిత్రకారుఁడు తిక్కనకృతభారత మంత రసవంతముగాను ప్రౌఢముగాను లేదనుటవింతగా నున్నది. దీనికిఁ గారణము బాల్యమునందు రచించుటయఁట. పదకాఠిన్యము లేదఁటగాని యన్వయకాఠిన్యము గలదఁట. ఇందలికథ సంస్కృతములో నున్నంతలేక మిక్కిలి సంగ్రహపఱుపఁబడుటయుఁ శైలి పలుచోట్ల నారికేళపాకముగా నుండుటయు నీగ్రంథము భారతమువలె సర్వత్ర వ్యాపింప కుండుటకుఁ గారణములఁట. ఇదియంతయు భ్రాంతిమూలము. ఈగ్రంథమును భారతముతోఁ బోల్ప సరికాదు. తిక్కన వ్రాసినయవతారిక పీఠిభ్రాంతికిఁ గారణ మైనట్లు గన్పట్టుచున్నది. ఇది ప్రథమ కావ్యమగుటచేత తిక్కన పీఠికలోఁ బలుపోకలఁ బోయెనుగాని

మఱియొండు గాదు. ఇది బాల్యము వీడి యౌవనము ప్రవేశించిన తరువాత వ్రాసిన ప్రౌఢకావ్యమెగాని యప్రౌఢకావ్యముగాదని పీఠికలోని విషయములే వేనోళ్ళఁ జాటుచున్నవి. వివిధవిద్యాపరిశ్రమవేదియైన ప్రభువు (కృతిపతి) అప్రౌఢుఁడైన యొకబాలకవిని 'మామా' యని పిలుచుటయుఁ బిలుచుచుండెఁ బో 'మామా' యనుచున్నందుకుఁ గృతి నిమ్మని యడుగుటయు సంభవము గాదు. వేయు నేల? నిర్వచనోత్తర రామాయణములోని యవతారికయే మిక్కిలి ప్రౌఢముగా నున్నది. అవతారికలోనే యింతప్రౌఢిమను జూపఁగలిగినవాఁడు బాలకవి యెట్లగును? ఇతఁడు,

"క. వచనము లేకయ వర్ణన
రచియింపఁగఁ గొంతవచ్చుఁ బ్రౌఢులకుఁ గథా
ప్రచయము పద్యములన పొం
దుచితముగఁ జెప్ప నార్యు లొప్పిద మనరే."

అనుపద్యమును వ్రాయుటయే వచనము లేకుండ వర్ణనసేయుట ప్రౌఢకవిలక్షణముగా భావించె ననుటకు నిదర్శనముగా నున్నది.

మఱియును 'అమలోదాత్తమనీష నేనుభయకావ్యప్రౌఢిశిల్పమునఁ బారగుఁడం గళావిదుఁడ' నన్న పలుకు ప్రౌఢకవి నోటనుండి వినంబడునుగాని యప్రౌఢుఁడగు బాలకవి నోటనుండి వినంబడునా? ఉత్తరరామాయణము రచించుటయందుఁ దిక్కనయుద్దేశము సరసమైనకావ్యమును వ్రాసి మనుమసిద్ధికిఁ

కృతినొసంగవలయు ననియెగాని మక్కికి మక్కిగా సంస్కృత మునకు సరియైన తెలుఁగు చేయవలయుననిగాదు. అందుకొఱకే తిక్కనకథను సంస్కృతములోనుండి కొన్ని మార్పులతోఁ దీసి కొని యనుచితములుగాఁ దోఁచినవానిని ద్రోసి పుచ్చియుచితము లనితోఁచినవానిలోఁ గొన్నిటిని పెంచి కూడ వ్రాసెను. నిర్వచ నోత్తరరామాయణములోని కొన్ని ప్రౌఢభాగము లన్వయ కాఠిన్యములుగఁ గన్పట్టవచ్చును. అక్కడక్కడ కొన్ని పద్య ములు చూచిన శైలి నారికేళపాకముగాఁ గన్పట్టవచ్చును. కాని గ్రంథమును సాంతముగాఁ జదివినవారికి శైలి ద్రాక్షాపాకమును గదళీపాకము నై ప్రౌఢముగానే కన్పట్టుచుండును. ఈకావ్యము నందు రామనిర్యాణకథను జెప్పుటకు భీతిల్లి తుదియాశ్వాస మును విడిచిపెట్టె ననికొందఱుపెద్దలు చెప్పుదు రని యట్లు భావించుట తగునా? అట్లయ్యెనేని తిక్కనసోమయాజి భారత ములో స్వర్గారోహణపర్వములోఁ గృష్ణనిర్యాణమును, అటు పిమ్మటఁ బాండవులలోకాంతర గమనమును జెప్పుటకు నేల భీతిల్లి విడిచి పెట్టలేదు? తుదియాశ్వాసము విడిచిపెట్టుటకు మఱియొక కారణ మేదియైన యుండవలెనుగాని యిది కారణము గాదు. ఆతుదియాశ్వాసమును దెనిగించిన జయంతిరామభట్టు యైనను తాను దానిని తెలిగించుటకుఁగారణమును జెప్పినవాఁడు గాఁడు. కొన్ని విషయములలోఁ బాపరాజకవికృత మైనయుత్తర రామాయణమున కన్న రసపుష్టి కలదిగా నున్నది. ఇదిభారతము

వలెఁ బ్రౌఢముగా లేకపోవుటచేతనే సర్వత్రవ్యాపింపకున్నదట. అట్లయినయెడల సత్యుత్తమకావ్యము లనియాంధ్రకవిచరిత్రకారునిచేఁ బొగడ్తలు గాంచినయుత్తరహరివంశాది కావ్యములు సర్వత్ర వ్యాపింప కుండుటకుఁ గారణమేమి? పంచమవేద మని పూజింపఁ బడెడుభారతమునకుఁ గలవ్యాప్తి యీనిర్వచనకావ్యమునకే గాదు మరి యేకావ్యమునకును రాదు. మనయాంధ్రదేశములో భారత భాగవతరామాయణములకుఁ గలవ్యాప్తి యేయుత్తమకావ్యములకుఁ గలదు? కవితారచనమునకు నేనియమములను విధించెనో యానియమములను బాటించియే తిక్కన తననిర్వచనోత్తరరామాయణమును బ్రౌఢముగా రచించి వాసికెక్కినాఁడు. అందువలననే దీని రచించినస్వల్పకాలములోపలనే యాంధ్రప్రపంచముఁ గవితాసామ్రాజ్య పీఠము నధిష్ఠించి జగత్పూజ్యుఁ డయ్యెను. ఈనిర్వచనోత్తరరామాయణము రచించునాటికిఁ దిక్కన శివభక్తిపరాయణుఁడై యుండెను గాని తరువాత యద్వైతవాది యై యభేద వాదమును బోధించెను.

# ఎనిమిదవ యధ్యాయము

## కవిపండితగోష్ఠి.

మనుమసిద్ధిభూపాలుని పరిపాలనకాలమున నప్పటప్పట పాండ్యులవలనను, దాయాదులవలనను, శత్రురాజులవలనను, తొందరలును, బాధలును గలుగుచున్నను, తిక్కన విద్యావిషయమునఁ జేసిన పరిశ్రమను జూచినప్పుడుమాత్ర మతని మహిమ యుట్టిదని గోచరము గాక మానదు. ఆంధ్రదేశమున నొకభాగ మగుపాకనాటివిషయమును మనుమసిద్ధిరాజు పరిపాలనము సేయుచుండ నాంధ్రప్రపంచమున జగత్పూజ్యం బగుపాండిత్యకవిత్వసామ్రాజ్యంబు ననుభవించుచున్నవాఁ డాతనిమంత్రి యగుతిక్కనామాత్యుఁడే. ఇట్టిసామ్రాజ్య మీతఁ డనుభవించుటయెట్లు సాధ్యపడియెనా యని కొంద ఱాశ్చర్య పడవచ్చును. ఆశ్చర్యమేల ?

“ అమలోదాత్తమనీష నేనుభయకావ్యప్రౌఢిఁ బాటించు శి
ల్పమునం బారగుఁడం గళావిదుఁడ నాపస్తంబసూత్రుండ గౌ
తమగోత్రుండ మహేశ్వరాంఘ్రికమలధ్యానైకశీలుండ న
న్నమకుం గొమ్మనమంత్రికిన్ సుతుఁడఁ దిక్కాంకుండ సన్మా
న్యుఁడన్. ”

అను పద్యములోఁ దిక్కన తానుభయభాషాకవిత్వకళాపా

రఁగుఁ డైనట్లు వ్రాసికొన్నది తానట్టివాఁడగుట యథార్థమై యుండుటచేతనేగాని తనడంబమును లోకమునకుఁ బ్రకటించుకొనుటకై కాదు. తిక్కన డంబము చూపువాఁడు గాఁడు. ఈ సత్యము నెఱింగినవాఁడు గనుకనే సమకాలికుఁ డైన కేతనకవి

"క. అభినుతుఁడు మనుమభూవిభు
సభఁ దెనుఁగున సంస్కృతమునఁ జతురుండై తా
నుభయకవి మిత్రనామము
త్రిభువనముల వెలుఁగ మంత్రితిక్కఁడు దాల్చెన్."

అని యాతని కుభయకవిమిత్రుఁ డనుబిరుదముగల దని తెలిపి యున్నాఁడు. ఇది యొకసామాన్యపుబిరుదము గాదు. ఇందొక మహిమ గలదు. 'కవిపంచాననుఁడు, కవిరాజు, కవిసార్వభౌముఁడు, కవిలోకచక్రవర్తి' మొదలుగాఁగల కొన్ని బిరుదములవలె గర్వమును, దుస్స్వభావమును, అసహిష్ణుత్వమును బ్రేరేపించి తగవులను బుట్టించి సౌజన్యమును రూపుమాపునట్టి మిథ్యాబిరుదములవంటిది గాదు. మిత్రశబ్దము స్నేహమును ప్రేమను దెలుపుచున్నది. ఉభయకవిమిత్రుఁ డనఁగా సంస్కృతాంధ్రకవులను బ్రేమతోఁ జూచినవాఁ డనియర్థము. ఇతనికవితాసామ్రాజ్యము ప్రేమాపూర్ణమగుటం జేసి కవిలోకమున కాశ్రయమై జగత్పూజ్యం బయ్యెను. ఇతఁ డాంధ్రకవితాసామ్రాజ్యపట్టాభిషిక్తుఁడై కవిప్రపంచమును ప్రసన్నదృష్టితో వీక్షించెను. అప్పుడు కవిప్రపంచ మానందాబ్ధి నోలలాడుచు నిట్లు వినుతించెను.

"సీ. సుకవీంద్రబృందరక్షకుఁ డెవ్వఁ డనిన వీఁ
డనునాలుకకుఁ దోడ వైనవాఁడు
చిత్తనిత్యస్థితశివుఁ డెవ్వఁ డనిన వీఁ
డనుశబ్దమున ర్థ మైనవాఁడు
దశదిశావిశ్రాంతయశుఁ డెవ్వఁ డనిన వీఁ
డనిచెప్పుటకుఁ బాత్ర మైనవాఁడు
సకలవిద్యాకళాచణుఁ డెవ్వఁ డనిన వీఁ
డనిచూపుటకు గుఱి యైనవాఁడు

మనుమసిద్ధిమహీశ సమస్తరాజ్య
భారధౌరేయుఁ డతిరూపభావభవుఁడు
కొట్టరువుకొమ్మనామాత్యకూర్మిసుతుఁడు
దీనజనతానిధానంబు తిక్కశౌరి."

ఈవినుతి కవిప్రపంచము కేతనరూపమున మూర్తీభవించి చేసినదిగాఁ దలంపవలయునుగాని కేవలము తనంతటఁ దానుగాఁ గేతన చేసినదని మనము గ్రహింపరాదు. ఇతరులు చేయుస్తోత్రపాఠముల కుబ్బిపోయి యహంకరించి తమ నిరంకుశాధికారమును జాటి తమ యాధిక్యమును గన్పఱచుకొనవలయు నని వ్యర్థాభిలాషతో దంభాచార్యవృత్తిని వహించి కవిప్రపంచముపై భుజాస్ఫాలనము సేయుచు దండయాత్రలు సలుప నుత్సహించెడు దుష్కవులమార్గమును గొనక యీతఁడు సత్కవులమార్గమును గొని 'బుధారాధనవిధేయుఁడ, బుధారాధనవిరాజి' నని నమ్రభావమును దేఁటపఱచుచుఁ దన కవితాసామ్రాజ్యాభిషిక్తపదవిని సంరక్షించుకొనియెను. వివిధ

విద్యాపరిశ్రమవేదియుఁ గవిసార్వభౌముని పుత్త్రుఁడును గావున మనుమసిద్ధి తిక్కన యధిష్ఠించిన విద్యాగురుపీఠముయొక్క మాహాత్మ్యము ననుభవపూర్వకముగా నెఱిఁగినవాఁడే గావున వినయవిధేయతలను జూపుచుఁ బూజింపుచుండెను. ఇట్లీ పాండిత్యకవిత్వ సామ్రాజ్యపట్టాభిషిక్తుఁడై వైదికమార్గనిష్ఠమగు వర్తనము గలవాఁడై క్రతుదీక్షఁ బూని భూసురబృందమున కానందము సంఘటించి వివిధాధ్వరములఁ గావించి త్యాగశీలుఁడై బహువిధదానములను జేసి ఋత్విక్కులను దృప్తులను గావింపుచుఁ దనయశము నాంధ్రప్రపంచమున దశదిశలకుఁ బఱపుచుండెను. వైదికమతోద్ధరణమునకై చతుర్ముఖుఁడు తిక్కనరూపమున నవతరించినవాఁడని యాంధ్రలోకము విశ్వసించి బ్రహ్మపీఠము నొసంగెను. నిర్వచనోత్తరరామాయణము రచించి మనుమసిద్ధి కంకితముచేసిన పదిసంవత్సరములలోఁ దిక్కనసోమయాజి యాంధ్రదేశమున నిట్టిమహోన్నతపదవిని బొందెను. ఏవేళను నీతని పవిత్రగృహమున వేదఘోషము వినంబడుచునే యుండును. ఆకాలమున నాంధ్రదేశములోని వేదవేత్తలు మంత్రవేత్తలు నీమహానుభావుని సందర్శింపకుండ నుండ లేదు. అట్లే కవిపండితకోటియు విక్రమసింహపురమునకు నేగుదెంచి యీకవిబ్రహ్మను సందర్శింపకుండ నుండ లేదు. ఈకాలముననే యీతఁడు విజయసేనము మొదలగు కావ్యములను రచించెనుగాని యవి యన్నియు భారతము

ప్రక్కను దివిటీముందరదీపములై ప్రకాశింపక కాలక్రమమున నశించిపోయి నామమాత్రావశిష్టములై యున్నవి. తిక్కన సోమయాజి యిట్టివాఁ డగుటచేతనే కేతనకవి దశకుమారచరిత్రమునం దిట్లభివర్ణించి యున్నాఁడు.

" సీ. సరసకవీంద్రుల సత్ప్రబంధములొప్పఁ
గొను ననుటధికకీర్తనకుఁ దెరువు
లలిత నానాకావ్యములు చెప్ప నుభయభా
షలయందు ననుట ప్రశంసత్రోవ
యర్థిమైఁ బెక్కాళ్ల నగ్రహారంబులఁ
గా నిచ్చు ననుట పొగడ్తపొలము
మహితదక్షిణలైనబహువిధయాగంబు
లొనరించు ననుట వర్ణనము దారి

పరుని కొక్కని కిన్నియుఁ బ్రకటవృత్తి
నిజములై పెంపు సొంపారి నెగడునట్టి
కొమ్మనామాత్యుతిక్కని కొలదిసచివు
లింక నొక్కరుఁ డెన్నంగ నెందుఁ గలఁడు."

తిక్కన సోమయాజి శ్రీమంతుఁడు; నిరర్గళధీమంతుఁడు, అధ్వరాబ్జదిననాథుఁడు; నీతిచాణక్యుఁడు; కృతిపతి; కృతికర్త; శౌర్యత్యాగ విఖ్యాతశాలి; మన్మభూపాల మంత్రిమాణిక్యుడు; దండాధీశుఁడు; బ్రహ్మవేత్త; ఇన్నిలక్షణము లొక్కని యందే పట్టియుండుటవలనఁ గేతనయొక్కఁడే గాఁడు. కేతనను బుట్టించినదైవము సయితము మెచ్చుకొనకమానఁడు. ఆకాలము నందుఁ గవిత చెప్పి తిక్కనసోమయాజిని మెప్పించుట కష్ట

సాధ్యమై యుండెను. అందులకై యనేకులు ప్రయత్నించిరి. భోజరాజీయమును విరచించిన యనంతామాత్యకవి ముత్తాత యగు బయ్యనమంత్రి కవిత్వము చెప్పి తిక్కనసోమయాజిని మెప్పించి 'భవ్యభారతి' యనుబిరుదమును బొందె నని భోజరాజీయమునందలి యీ క్రిందిపద్యమువలన విదితమగుచున్నది.

"చ. క్షితిఁ గ్రతుకర్త నా వినుతి చేకొని పంచమవేదమైన భా
రతముఁ దెనుంగుబాస నభిరామముగా రచియించి నట్టి యు
న్నతచరితుండు తిక్కకవినాయకుఁ డాదట మెచ్చి భవ్యభా
రతియనఁ బేరుగన్న కవిరత్నము బయ్యనమంత్రి యల్పుఁడే."

కేతనకవి కూడ,

"గీ. కవిత చెప్పి యుభయకవిమిత్రు మెప్పింప
నరిది బ్రహ్మకైన నతఁడు మెచ్చఁ
బరగుదశకుమార చరితంబుఁ జెప్పిన
ప్రౌఢ నన్ను వేఱ పొగడ నేల?"

అని యాంధ్రభాషాభూషణ మనుగ్రంథమునందుఁ జెప్పి యున్నాఁడు. ఆకాలమునందు కవులు తిక్కనసోమయాజివలన మెప్పు నొందినఁ దమజన్మసార్థకమైనట్లుగాఁ దలంచుచుండిరి. అట్టివారిలోఁ గేతనకవి యొక్కఁడు. ఇతఁడు కేవలము ధనాపేక్షచేఁ దిక్కనసోమయాజిని స్తోత్రపాఠములు చేసి కృతి నిచ్చినవాఁడు గాఁడు. వేగిదేశమున వెల్త్రిరాల యనునగ్రహారమునకు నగ్రణియును గౌండిన్యగోత్రుఁడును, మాఱయకును సంకమాంబకును దనూజుఁడును, బండారు కేత దండాధీశుని మఱదియు, నధ్యయనపరుఁడును, మూలఘటికాన్వయుఁడును, ప్రోలనార్యు

నియమనుఁగుఁ దమ్ముఁడును, సంస్కృతాదిభాషా కావ్యకర్తృత్వమున నుతిఁగన్నవాఁడును, అభినవదండినావినుతి గన్నవాఁడును, విఖ్యాతయశుఁడు నైన కేతనార్యుని రప్పించి యాసనార్ఘ్యపాద్యతాంబూలాంబరాభరణాదానాద్యుపచారంబులఁ బరితుష్టహృదయుం డై, 'ఆర్యా! నీవు సంస్కృతాద్యనేకభాషాకావ్యరచనావిశారదుండ వగుట జగత్ప్రసిద్ధంబు గావున నొక్క కావ్యంబు రచియించి నన్నుఁ గృతిపతిం జేయవలయు' నని సగౌరవంబుగాఁ బ్రార్థించినందునఁ గేతన తనకావ్యకన్యకుఁ దిక్కన తగినవరుం డనిభావించి సంస్కృతమున దండి రచియించిన దశకుమారచరిత్రము నంచితభావరసోదయాభిరామమ్ముగా రచియించి యంకితము చేసె నని దశకుమారచరిత్రపీఠికవలన వేద్యమగుచున్నది. ఈదశకుమారచరిత్రము నీతఁడు తిక్కన మెచ్చుకొను నంతరసవంతముగానే రచియించెను. ఇయ్యది తిక్కనభారతమునకుఁ బూర్వమునసే రచియింపఁ బడిన దనుటకు సందియము లేదు. మనుమసిద్ధి పదభ్రష్టుఁడై కాకతీయుని ప్రాపువలనఁ బునరభిషిక్తుం డగుటకుఁ బూర్వమే యీకావ్యము రచియింపఁ బడినదనుట కావిషయ మెద్దియునిందుఁ దెలుపఁబడకుండుటయె ముఖ్యకారణము. తిక్కననుగూర్చి సమకాలికుఁ డైన కేతనపలికిన పలుకులు విశ్వసనీయములని శ్రీయుతులు జె. కృష్ణరావు గారు వ్రాసిన వాక్యములనే నే నీదిగువ నుదాహరించుచున్నాను.

“బోద్ధారో మత్సరగ్రస్తాః” అనువచనంబురీతి సాధారణంబుగఁ బండితప్రకాండులు పరస్పరకావ్యరత్నంబుల నసూయాక్షిరోగ నిష్పీడిత

దృశ్యముల నరసి నెరసులఁ గొన్నిటి నారోపించుటచేఁ దృష్టి వహించి తద్రత్నంబుల నాత్మశేముషీశాణోపలంబుల నొరసిన నా నెరసులు మగుడ గుణంబులుగా నెక్కుడఁ బరిణమించునో యని యట్లు సేయ నొల్లకుందురు. ఈపరస్పర వైముఖ్యంబు కృతిరత్నంబుల యెడనగాక తఱచుగాఁ గృతిరత్న నిర్మాతలయెడం గూడ వ్యాప్తం బగు. "సుకాలమువారల మెచ్చరే కదా" యన్న ట్లీస్వభావము సమకాలికులయందును మఱికొంత హెచ్చు. ఇందునకుఁ బ్రమాణము లెన్నియేనిఁ జెప్పం దొప్పదు. తొల్లి భవభూతి గాని 'హా! గాఢాకృష్ణానాంకతిపయపరా నాంరచయితా జనః' అని యాక్షేపించినట్లును, 'నీయీకొఫు కవిత్వపుమాటలు బాపనకవివరుని చెవికిఁ బ్రమదం బిడునే' అని రామకృష్ణుఁడు గామరాజభూషణుఁ దిరస్కరించినట్లును ఆంగ్లేయకవీంద్రులలో నగ్రగణ్యం డైనషేక్స్పియరును బెంజాన్సను లోనగువారు వేదుర ని భావించినట్లును గ్రంథములవలనఁ దెలియవచ్చుచున్నది. కాఁబట్టి కవీంద్రు లొండొరుల దోషంబులఁ బ్రకాశింపఁ జేసి గుణంబుల నాచ్ఛాదింతు రనియు నొకవేళ గుణంబులఁ బ్రకాశింపఁ జేసియున్నఁ గాని సర్వసమ్మతమ్ము గనియు విచారమునకు ఫలము. ఏలయీవిషయ మింత పెంచి వ్రాసితి నన్నఁ దిక్కనచరిత్రమునకు ముఖ్యసాధనము లైనయితని సమకాలికుల యభిప్రాయంబులు విశ్వసనీయంబులే యని చూపుటకై వ్రాసితిని."

తిక్కనసోమయాజి సామర్థ్యము తత్కృతాంధ్ర భారతమువలననే మనకుఁ దేటపడుచున్నందునఁ గేతనవర్ణనలు నూటికిఁ దొంబదితొమ్మిదిపాళ్లు సత్యము లనిమనము విశ్వసింపవచ్చునని, తెలుపుచుఁ బైవారియభిప్రాయముతో నేకీభవించుచున్నాఁడను.

# తొమ్మిదవ యధ్యాయము

---

## ఆంధ్ర మహాభారత రచనము.

తిక్కనసోమయాజి దశకుమారచరిత్రము సంకితము నొందిన పిమ్మటఁ గొంతకాలమునకు మనుమసిద్ధిరాజునకు శత్రువులనుండి కష్టములు గలుగుచుండుటఁ గన్నులారఁ గాంచుట తటస్థ మగుచు వచ్చెను. రాజ్యసంరక్షణము దుర్భర మై గన్పట్టెను. మనుమసిద్ధిరాజు దాయాదివర్గమునుండి కలిగెడు బాధలను దప్పించుకొనుటకై కాకతీయ సైన్యాధిపతులకు వశ్యుఁడై మెలగవలసి వచ్చెను. తిక్కన సామాద్యుపాయ తంత్రముచే నెన్నితడవలు మనుమసిద్ధిరాజును గాపాడి రాజ్యము నిలువఁ బెట్టగలిగినను తుదకు దైవసంఘటనము వేఱుగ నుండెను. కడపట గొల్లరాజులతోఁ బసులమేపుబీళ్లకై తగవులు పడి యుద్ధములో మనుమసిద్ధియును, తన పెదతండ్రికుమారుఁడు ఖడ్గతిక్కనయు మరణము నొందుటను గాంచెను. వృద్ధుఁడైన పెదతండ్రి సిద్ధనామాత్యుఁడు గూడ స్వర్గస్థుఁ డయ్యెను. మనుమసిద్ధి రాజ్యమును గాకతీయసైన్యాధిపతు లాక్రమించుకొని పరిపాలింప సాగిరి. దేశస్థితి యంతయును మాఱిపోయెను. జనులలో శైవవైష్ణవమతభేదములు ముదిరి పక్షము లేర్పడి.

తగవులు ప్రారంభ మయ్యెను. ప్రజలు ధర్మస్వరూపమును గుర్తెఱుంగఁ జాలక యధర్మమార్గప్రవర్తకులై వ్యవహరించుటను జూచి చింతిల్లు చుండెను. తిక్కనసోమయాజికి వయస్సు ముదిరినకొలది వైరాగ్యబుద్ధియు నెచ్చుచుండెను. మనుమసిద్ధియు, గణపతిదేవచక్రవర్తియు నొసంగినయగ్రహారములు భుక్తికిఁ జాలియుండుటచేత తిక్కన సోమయాజి లౌకికాధికార పదవులమీఁది యాసక్తిని విడిచి ధర్మానురక్తి గలిగి తనజీవితమును లోకహితార్థము వినియోగింప బ్రతిజ్ఞ చేసి సంకల్పసిద్ధుఁడయ్యెను. ప్రజలకు సమస్తధర్మములను బోధించునది పంచమవేద మనంబరఁగు మహాభారతము సంస్కృతభాషయందుండుటచేత జనసామాన్యమునకు దుర్గ్రాహ్యమై యుండెను. ఆంధ్రులజ్ఞానాంధకారమునఁ మునిగియుండి భాసురభారతార్థముల భంగుల నిక్కము నెఱుంగనేరక గాసటబీసటలే చదివి గాథలు త్రవ్వుచుండెడివారని యెఱ్ఱాప్రెగ్గడ వక్కాణించెను. * ఆంధ్రులకు భారతధర్మముల నాంధ్రభాషమూలముగా బోధించుటయె పరమార్థముగా గ్రహించెను. ధర్మాద్వైతమతసాంప్రదాయము లాంధ్రులకు సులభసాధ్యము లగుటకు మార్గము

* "ఉ. భాసురభారతార్థముల భంగుల నిక్కము నెఱుంగ నేరమిన్
గాసటబీసటే చదివి గాథలఁ ద్రవ్వ నెఱుంగువారికిన్
వ్యాసమునిప్రణీతపరమార్థము తెల్లగఁ జేసి నట్టియ
శ్శాసనకల్పులం దలంతు నాద్యుల నన్నయతిక్కనార్యులన్."
(నృసింహపురాణము)

భారత మాంధ్రభాషలో రచింపఁబడుట కర్తవ్య మని దృఢముగా నాతనిమనస్సునకుఁ దట్టెను. దీనినే తిక్కన సోమయాజి విరాటపర్వములో మొదట కృతినిర్మాణప్రస్తావనలో వివరించినాఁడు. విద్వత్సంస్తవనీయ భవ్యకవితావేశుఁడును, విజ్ఞానసంపద్విఖ్యాతుఁడును, సంయమిప్రకరసంభావ్యానుభావుఁడును; నగుకృష్ణద్వైపాయనుఁడు (వ్యాసుఁడు) అభిలాషతో లోకహితనిష్ఠను బూని భారతమనువేదమును ధర్మార్థద్వైతస్థితి ననుసరించి రచించె నని చెప్పినాఁడు. * ఇదియె ధర్మార్థకామమోక్షస్థితికి మూఁదల (మూలతల) యని నుడివెను. ఇట్టి భారతము నాంధ్రకవిత్వవిశారదుఁ డైన నన్నయభట్టారకుఁడు ప్రారంభించి మూఁడుకృతులు (మూఁడు పర్వములు) దక్షతతో రచించె నని,

> "ఉ. ఆదరణీయసార నిరవద్యగతిస్ఫురణంబు గల్గినా
> ష్టాదశపర్వనిర్వహణసంభృత మై పెనుపొంది యుండ నం
> దాది దొడంగి మూఁడుకృతు లాంధ్రకవిత్వవిశారదుండు వి
> ద్యాదయితుం డొనర్చె మహితాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్"

అనుపద్యములోఁ జెప్పి జనసంప్రార్థ్యము గొటం జేసి నాలుగవపర్వ మగువిరాటపర్వము మొదలుకొని తక్కినపదునేను

---

* "శా. విద్వత్సంస్తవనీయ భవ్యకవితావేశుండు విజ్ఞానసం
పద్విఖ్యాతుఁడు సంయమిప్రకర సంభావ్యానుభావుండు కృ
ష్ణ ద్వైపాయనుఁ డర్థి లోకహితనిష్ఠం బూని కావించె ధ
ర్మార్థ ద్వైతస్థితి భారతాఖ్య మగు లేఖ్యం బైనయామ్నాయమున్."

పర్వములును దుదిముట్ట రచించుట యొప్పు నని యీదిగువ పద్యములోఁ జెప్పి యున్నాఁడు.

"మ. హృదయాహ్లాది చతుర్థ మూర్జితకథోపేతంబు నానారసా
భ్యుదయోల్లాసి విరాటపర్వ మట యుద్యోగాదులుం గూడఁగాఁ
బదియేనింటిఁ దెనుంగుబాస జననసంప్రార్థ్యంబు లై పెంపునం
దుది ముట్టన్ రచియించు టొప్పు బుధసంతోషంబు నిండారగన్"

ఈ పైరెండుపద్యములు జదివినవారికిఁ దిక్కన సుహృదయము బోధపడక మానదు. ఇదివఱకొకపండితునిచేఁ దెలిగింపఁబడినభాగమును మరల దాను దెలిగించుట ధర్మముగా దని విడిచి విరాటపర్వము మొదలుకొని రచించుట తగ వని చెప్పెను. కవిధర్మము నాలోచించి కొఱగానిపనులు గూడ వని తలంచి యామూఁడుపర్వములను దెలిగింపక విడిచిపెట్టి నాఁడు గాని తెలిగింపఁ జేతఁగాక కాదు. అట్లుగాక తిక్కన మొదలనుండియుఁ దెలిగించెనేని నన్నయభట్టు మూఁడుపర్వములు నధర్వణాచార్యుఁడు రచించినపర్వములవలెనే సర్వత్ర వ్యాపింపక నశించిపోయి యుండును. అట్లొనరించుటకుఁ దిక్కన సమ్మతింప లేదు. దీనిఁబట్టి తిక్కన యెట్టిసుహృదయము గలవాఁడో తేఁటపడ గలదు. తాను దెనిగింపకుండుటయే గాక నన్నయ దక్షతతో మూఁడుకృతులు రచించె నని యోగ్యతాపత్రముగూడ నొసంగి గౌరవించి నాఁడు.

"ఆరణ్యపర్వము నాంధ్రీకరించుటచేతనే నన్నయభట్టు మతిభ్రమణము గలిగి మృతినొందె నని తలఁచుకొని తాను

దానిని దెలిగించినచో తనగతియు నట్లే యగునన్న భీతిచేత నితఁడు దానిని తెనిఁగింపఁ డయ్యెను. అందుచేత తెనుఁగు భారతము కొంతకాలము పూర్ణముగా లేక కొఱతపడి యుండెను. ఆకాలమునందు వ్రాయఁబడిన తాళపత్ర గ్రంథములు కొన్ని యిప్పటికిని వనపర్వశేషము లేకయే కానఁబడుచున్నవి. కవిని బట్టినభీతియే తరువాత నారణ్యపర్వశేషమును జేసిన యెఱ్ఱాప్రెగ్గడకును పట్టి తనపేరిట గ్రంథరచన చేయక రాజనరేంద్రుని కంకితముగా నన్నయభట్టు పేరుపెట్టియే దానిని రచించెను. అంతేకాక భారతమును చదువువారు సయితము నేటివఱకును ఆరణ్యపర్వము లోని కొంతభాగము వదలియే మఱి గ్రంథపఠనము చేయుచున్నారు." ఈ యాంధ్రకవుల చరిత్రమునం దతిశయోక్తిగా వ్రాయఁబడిన వాక్యములు యథార్థములుగాఁ గన్పట్టవు. ఆరణ్యపర్వమును సంపూర్తిగానే నన్నయభట్టు రచించె నని తిక్కనపద్యమువలనఁ దెల్లమగుచున్నది. నన్నయభట్టు కృతారణ్యపర్వము తిక్కన కాలమునాటికి బాగుగానే యుండి యెఱ్ఱాప్రెగ్గడకాలము నాటికి నాపర్వములోని కడపటిభాగము నశించి యుండవచ్చును. దానిని శంభుదాసు తెనిఁగించి యుండును. అంతియ కాని యారణ్యపర్వము తెనిగించుటచేత నన్నయకుఁ బిచ్చి యెత్తిన దని భయపడి తిక్కన దానిని విడిచిపెట్టి విరాటపర్వము నుండియుఁ దెనిగించినాఁ డని చెప్పెడికథ లేవియును

విశ్వాసార్హములు గావు. నన్నయభట్టునకు రెండుశతాబ్దులకు పిమ్మటనున్న తిక్కనసోమయాజివఱకు భారత మాంధ్రీకరింపఁబడియుండుటకుఁ గారణము నడుమకాలమునఁ గవులు లేకయుండుట గాదు. కవుల నేకులు గలరు. కాని వారి కాత్మశక్తియందు విశ్వాసము లేదు. ఈమహోత్కృష్టగ్రంథము నాంధ్రీకరించుటకు గొప్ప ప్రతిభాశాలి పుట్టవలయు నని తలంచి యుందురు. వారు తలంచినవిధముగానే ప్రజ్ఞానిధి పుట్టెను. నిర్వచనోత్తరరామాయణము రచించునాఁటికిఁ దిక్కన తానెంత వైదికమార్గప్రవర్తకుఁడై యున్నను శివభక్తిపరాయణుఁడై యుండెను. తరువాత శ్రౌతస్మార్తక్రియాతత్పరుఁడై పూర్వమీమాంస మతావలంబకుఁడై కర్మాచరణము ప్రాధాన్యముగాఁ దలంచెను. భారతమును రచించునాఁటికి హరిహరులకభేదమును పాటించి యద్వైతమునందాసక్తిజనించియే యస్మత్సాంప్రదాయములను ధర్మములను లోకమున వ్యాపింపఁజేయ సంకల్పమును బూని యాందుకొఱకే తక్కినజీవితకాలము నంతయు వినియోగించి కృతకృత్యుఁడై ధన్యుఁడయ్యెను. కావున సోమయాజిమతము ప్రథమమునుండియు నొక్కతీరున నుండెనని చెప్ప వీలులేదు. అద్వైతమతధర్మములను సిద్ధాంతములను భారతము మూలముగా నాంధ్రభాషలో మొదట రచించినవాఁడు తిక్కన యనియే భావించెదను. తిక్కనసోమయాజి హరిహరనాథరూపుఁ డగు పరవస్తువును సగుణబ్రహ్మముగాఁ భావించి,

"ఉ. శ్రీ యన గౌరి నాఁబరఁగుచెల్వకుఁ జిత్తము పల్లవింప భ
ద్రాయతమూర్తియై హరిహరం బగురూపముఁ దాల్చి విష్ణురూ
పాయ నమశ్శివాయ యని పల్కెడు భక్తజనంబు వైదిక
ధ్యాయిత కిచ్చ మెచ్చు పరతత్త్వముఁ గొల్చెద నిష్టసిద్ధికిన్."

అని సకలబ్రహ్మప్రార్థనము చేసి తత్ప్రసాదలబ్ధకవిత్వతత్త్వ నిరతిశయానుభావానందభరితాంతఃకరణుం డగుచుఁ బైని నుడివినవిధముగాఁ బదేనుపర్వములు రచించుటకుఁ బూనుకొని యీప్రబంధమండలి కెవ్వని నధినాథునిగాఁ జేర్కొందునా యని యొకనాఁడు వితర్కింపుచు నిద్రించె నఁట. ఇక్కడ తిక్కన సోమయాజి తనకుఁ గలపితృభక్తిని దేఁటపఱచుటకై చమత్కారముగా స్వప్నవృత్తాంతమును గల్పించి చొప్పించినాఁడు. తనతండ్రియైన కొమ్మనామాత్యుఁడు స్వప్నమునఁ గన్పడఁ దిక్కన నమస్కారము చేసెనఁట. అందుల కాతఁడు వాత్సల్య మతిశయించు నట్లుగా వాని నాదరించి దీవించి కరుణార్ద్ర దృష్టితోఁ జూచి యిట్లు పలికె నఁట. కుమారా! "కిమస్థిమాలాం కిము కౌస్తుభం వా పరిష్క్రియాయాం బహుమన్యసే త్వమ్। కిం కాలకూటః కిము వా యశోదాస్తన్యం తవస్వాదు వద ప్రభో మే॥" అని నీవు తొల్లి రచించినపద్యమును గాఢాదరంబున నవధరించి భక్తవత్సలుఁ డైనహరిహరనాథుఁడు నీదెస దయాళుఁడై యునికిం జేసి నిన్నుఁ గృతార్థునిఁ జేయఁ గార్యార్థి యయినాకలోకనివాసి యయిననాకుఁ దనదివ్యచిత్తమునం

గలకారుణ్యము తెఱంగెఱుంగు నట్టిశక్తిం బ్రసాదించి నన్ను నాకర్షించి కొలిపించుకొని ఈఁడె విజయంచేయుచున్నవాఁ" డని చూపె నఁట. అంతఁ దిక్కన సవిశేషసంభ్రమసంభరితహృదయుండై యవ్వేలను గనుంగొను నప్పుడు సర్వేశ్వరుఁ డీక్రింది స్వరూపముతో సాక్షాత్కరించె నని యిట్లు వర్ణించి యున్నాఁడు.

"సీ. కరుణారసము పొంగి తొరగెడుచాడ్పున
శశిరేఖ నమృతంబు జాలువాఱ
హరినీలపాత్రికి సురభిచందనమున
గతినాభి ధవళపంకజము మెఱయ
గఁటిసైన చెలువున నెఱసిన లోకర
క్షణ మనంగ గళంబు చాయ దోఁపఁ
బ్రథమాద్రిఁ దోతెంచుభానుబింబము నా ను
గమ్మునఁ గౌస్తుభరత్న మొప్ప
తే. సురనదియును గాళిందియును బెరసి నట్టి
కాంతిపూరంబు శోభిల్లు శాంతమూర్తి
నామనంబు నానందమగ్నముగ జేయ
నెలమి సన్నిధి సేసె సర్వేశ్వరుండు."

అట్లు సర్వేశ్వరుఁడు ప్రత్యక్షము కాఁగా నతఁడు భక్తియుక్తముగా సాష్టాంగదండప్రణామం బాచరించి కొంచెము దొలఁగి వినయావనతుఁడై లలాటోపరిభాగమున నంజలిపుటంబు ఘటించి నయనంబులు ప్రమదబాష్పసలిలవిలులితంబులుగను నవయవంబులు పులకపటలపరికలితంబులుగను నుండ నిలు

చుండె నఁట. అంత నద్దేవుం డనుకంపాతిశయముచేతఁ జిఱు నగవు నగుచు నిట్లనియె నఁట.

"ఉ. వైదికమార్గనిష్ఠ మగువర్తనముం దగ నిర్వహించుచున్
భేదములేనిభక్తి నశనిర్మలవృత్తిగఁ జేయుచుండి మ
త్పాదనిరంతరస్మరణ తత్పరభావముకల్మి నాత్మ స [దున్."
మ్మోదముఁ బొంది కార్యరసముం గొనియాడుచు నుండు దెప్పు

అందును,

క. పారాశర్యునికృతి యయి
భారత మను పేరఁ బరఁగుపంచమవేదం
బారాధ్యము జనులకుఁ ద
ద్గౌరవ మూహించి నీ వఖండితభక్తిన్

తే. తెనుఁగుబాస వినిర్మింపఁ దివురు టరయ
భవ్యపురుషార్థతరుపక్వఫలము గాదె
దీని కడనియ్యకొని వేడ్క నూని కృతిప
తిత్వ మర్థించి వచ్చితి తిక్కశర్మ."

ఇట్టిదివ్యవచనామృతముచే నాతనియుల్లంబును వెల్లి గొలుపఁ బునఃపునఃప్రణామంబు లాచరించి యప్రమేయ ప్రభావభావ నాతీతుం డయ్యు నాపరమేశ్వరుఁ డాశ్రితులకు నత్యంతసులభుఁ డని యదివఱకు బుధులవలన వినియుండుటఁ జేసి తనుబోటి బాల స్వభావునకు నిట్టి మహనీయమహిమ దొరకొనుటయుఁ గలుగునుగాక యని తలంచుచు నాదేవునకు విన్నపము సేయఁ వాఁడై కొమ్మనామాత్యు నానన మాలోకించె నఁట. అంత నతం డనుమతి యొసఁగె నఁట. అందుపైఁ దిక్కన యాదేవున కిట్లు విన్నవించుకొనియె నఁట.

"క. భూరిభవతాప్ర్యగుణ్యా
క్షీరాంబుధి నాదుతుచ్ఛచిత్తంబున వి
స్తారమహితముగ ననిచితి
వారయ నచ్చెరువుగాదె యఖిలాండపతీ.

ఉ. ఇంతకు నేర్చునీకు నొకయింత తటిలోన మదీయవాణి న
త్యంతవిభూతిం బెంపెసఁగు నట్టినినుం గొనియాడఁజేసెఁగా
నెంతటిపెద్ద నీకరుణ నిట్లు పదస్థుఁడ నైతి నింక జ
న్మాంతరదుఃఖముల్ దొలఁగునట్లుగఁ జేసి సుఖాత్ముఁ జేయవే."

అని యుపలాలితుఁ డగుబిడ్డఁడు తనకొలఁది యెఱుంగక మహాపదార్థమును వేఁడువిధముగా బ్రహ్మానందస్థితిం గోరి యా జగన్నాథునకు మరల సాష్టాంగనమస్కారం బాచరించె నఁట. అప్పుడు భగవంతుఁడు ప్రసన్నముఖుఁ డై యిట్లు పలికె నఁట.

"తే. జననమరణాదు లైన సంసారదురిత
ములకు నగపడకుండంగఁ దొలఁగుతెరువు
గనువెలుంగు నీకిచ్చితి ననిన లేచి
నిలిచి సంతోషమెదనిండ సెలవుకొనఁగ."

అంతఁ దిక్కున మేలుకాంచె నఁట. అంత భక్తితాత్పర్యములు మానసంబున ముప్పిరిగొన నతం డిట్లు ప్రతిజ్ఞాదికమును జేసెను.

"ఉ. ఇట్టిపదంబుగాంచి పరమేశ్వరునిం గృతినాథుఁ జేసి యే
పట్టునఁ బూజ్యమూర్తి యగుభారతసంహితఁ జెప్పఁ గంటినా
పుట్టుఁ గృతార్థతం బొరసెఁ బుణ్యచరిత్రుఁడ నైతి నవ్విభుం
గట్టెదఁ బట్ట మప్రతిమకారుణికత్వమహావిభూతికిన్.

ఉ. కూర్చుట నూర్చి రత్నములకుం గనకంబునకుం దగుల్ జనా
భ్యర్చిత మైనభారత మహాకృపాపరతంత్రవృత్తి మైఁ
జేర్చినదేవదేవునకుఁ బ్రీతిగ నిచ్చుట సర్వసిద్ధి నా
నేర్చినభంగిఁ జెప్పి వరణీయుఁడ నయ్యెద భక్తకోటికిన్.

ఇది అనన్యసామాన్యం బగుపగమధర్మప్రకారంబు.

ఉ. కావున భారతామృతము కర్ణపుటంబుల నారఁ గ్రోలి యాం
ధ్రావలి మోదముం బొరయు నట్లుగ సాత్యవతేయసంస్కృతి
శ్రీవిభవాస్పదంబయిన చిత్తముతోడ మహాకవిత్వదీ
క్షావిధి నొంది పద్యముల గద్యములన్ రచియించెదం గృతుల్."

ఈ పైయవతారికలోని స్వప్నవృత్తాంతమును మనము చక్కఁగాఁ బరిశీలించువార మగుదుమేని తిక్కనసోమయాజి స్వాభిప్రాయ ప్రకటనము నెంత ప్రౌఢముగాఁ జేసి యున్నాఁడో స్పష్టముగాక మానదు. ఈస్వప్నవృత్తాంత మీతనికిఁ బితృభక్తి విశేషముగాఁ గలదని తేటపఱుచుచున్నది. తనపితృభక్తిని లోకమునకు వెల్లడించుకొఱకే స్వప్నవృత్తాంతమును జొప్పించినాఁడు. తిక్కనతండ్రి కొమ్మనామాత్యుఁడు తిక్కన బాల్యముననే మృతి నొందియుండును. తిక్కన యిట్టిపవిత్రమైనభక్తిని జూపుట కదియే కారణమై యుండు నని నాయభిప్రాయము. ఇందు హరిహరనాథుని స్వరూపము నెంతో చక్కఁగా వర్ణించి యున్నాఁడు. దేవునకును దనకును నడుమను దనతండ్రిని బ్రవేశపెట్టి వానిమూలమున దేవునిఁ బ్రత్యక్షము గావించుకొని "కృతిపతిత్వ మర్థించి వచ్చితిఁ దిక్కశర్మ" అని యతఁడే కావ్య

మంకితము చేయు మని యడిగి నట్లుగాఁ జెప్పినది ప్రౌఢముగా నున్నదనుటకు సంశయము లేదు. తిక్కనసోమయాజి తనకుఁ గల వైదికమార్గనిష్ఠ మగువర్తనమును, హరిహరులయెడ భేదము లేక సమభక్తి గలిగి యుండుటయును, స్మరియించి తనుభయ సగుణమూర్త్యైకదేవతయగు హరిహరనాథునియెడఁ దనకుం గల నిరంతరభక్తితోఁ గూడుకొన్న యాత్మానందానుభవమును లోకమునకుఁ దెలిపిన విధము మిక్కిలి ప్రౌఢముగా నున్నది. భారతము పంచమవేద మని ప్రసిద్ధిఁ జెందినగ్రంథ మగుటచేతఁ దానిం దెనిగించునపుడు దనకును దనవంశమునకును గల శ్రేష్ఠత్వమును, దేవతాభక్తి మొదలగు వానిని బ్రకటింపక యున్నచోఁ దనగ్రంథము సర్వజనాదరణ పాత్రముగా దనుతలంపుతో సోమయాజి స్వకీయశిష్టత్వమును బ్రకటించుకొనెనని కవిజీవిత గ్రంథకారుఁడు సూచించెను. ఇదిగాక నిజస్వప్నముయెడల తిక్కన వైదికమార్గనిష్ఠమగు ప్రవర్తనము కల్ల యని తేటపడఁ గలదు. అభినవదండి దశకుమారచరిత్రమునఁ దిక్కననుగూర్చి చేసిన వర్ణనము తిక్కనసోమయాజి చెప్పుకొన్న వైదికమార్గనిష్ఠమగు వర్తనము కల్లగాక సత్యమైనదే యని వేనోళ్ళ రుజువు చేయుచున్నది. కాని యాకవిజీవితగ్రంథకారుఁడే మఱియొకచోట

> "కాని స్వప్నములను నమ్మి వానిని గ్రంథస్థముఁ జేసినయాంధ్రకవులలో నీతఁడే మొదటివాఁడు. భగవదుపాసనాపరులకుఁ దన్మూలముగ నంతఃకరణపరిపాకము గలిగి యిట్టిభగవదనుగ్రహసూచకస్వప్నంబు లగుటయు విశేషమహత్తులు లభ్యమగుటయు నైసర్గికములే యని యాస్తికుల

కు విశేషించి చెప్పవలసినది లేదు. సోమయాజియు నట్టియుపాసనాబలంబున విజ్ఞానసంపన్నుఁడై భారతరహస్యార్థములఁ దెలిసికొని వేదముం బ్రకటించిన చతుర్గానప్రతిష్ఠ నంది యుండెనని చెప్పుటకు సందియము లేదు. ** * * * సోమయాజికి వేదాంతాది శాస్త్రములందును, సాంఖ్యయోగాది శాస్త్రములలోపలను గలవిశేషపాండిత్యము శాంత్యానుశాసనిక పర్వములను తిక్కనపర్వములలోఁ దత్త్వముం జెప్పెడు నితిహాసాదులవలనం గోచరంబులు గాఁ గలవు. పూర్వోత్తరమీమాంసాశాస్త్రము లాతఁడు నేర్చినవాఁడని సోమయాజి జైనపండితులతోఁ జేసిన సంవాదాదికము వలనం గోచరంబగును. అట్టివాని వివరములు గ్రంథస్థములు గాకున్నను, అట్టిసంవాదములు విషయముమాత్రము సోమదేవరాజీయము మొదలగు గ్రంథములలో కొంత వివరింపఁ బడియున్న దానినే నీవఱకుఁ బ్రకటించితిని"

అని వ్రాసియుండెను. ఇన్ని శాస్త్రములు చదువుకొని యున్నినాం ప్రదాయములు దెలిసియుండి యింతవిజ్ఞానసంపన్నుఁడైన వేదవేత్త యాకాలమున వైదికమార్గనిష్ఠమగు వర్తనము గలిగి యుండెననుట యవిశ్వాసపాత్రము గాదు. వేదాంతతత్త్వరహస్యంబులు, చిదచిద్వివేకంబుల ధర్మాధర్మంబులు, రాజనీతిప్రకారంబులు, భారతవీరుల ప్రభావంబులు మొదలుగాఁగల భారతార్థముల నాంధ్రభాషానలి నెఱాదముగా గూరయు నట్లుగాఁ దెలిపి యాంధ్రప్రపంచము నుద్ధరించుటయె తిక్కనసోమయాజి మనోసంకల్పమై యుండెను. అందుకొఱకే యామహానుభావుఁడు మహాకవిత్వ దీక్షావిధిని బూని సాత్యవతేయుని సంస్మరించి 'యీాదృశంబు లగు పుణ్యప్రబంధములు దేవసన్నిధిం బ్రశంసించుటయు నొక్కయారాధనవిశేషంబుగాఁ దలంచి'

"క. హరిహరనాథునకు మరు
త్సరిదాకల్పితమనోజ్ఞ చరణ శిరస్కుం
దరమూర్తికి భావనత
త్పరచేతోయుక్త భక్తపరతంత్రునకున్."

తాను 'విన్నపంబు సేయు నెఱుంగుగా నంతస్సన్నిధిం గలిగించుకొని యమ్మహాకావ్యంబు నర్థంబు సంగతంబు సేయు' వాఁడై

"క. జలనిధిహిమవద్భూధర
కలితజననకేళి కౌతుకవ్యక్తావ్య
క్తలలితసౌందర్యస్ఫుర
దలఘుతను శ్రీసనాథ హరిహరనాథా!"

"దేవా దివ్యచిత్తంబున నవధరింపు" మని హరిహరనాథునిఁ బ్రసాదాభిముఖుని గావించుకొని, విరాటపర్వము మొదలుగా స్వర్గారోహణపర్యంతముఁ బదునేనుపర్వముల నాంధ్రీకరించి యాంధ్రదేశీయుల నుద్ధరించి,

"చ. పరమపదాప్తిహేతు వగుభారతసంహిత శౌనకాదిభూ
సురవరు లింపునం గరఁగుచొప్పునఁ జెప్పిన వారు మోదసం
భరితతఁ బొంది యక్కథకుఁ బ్రాంతిగ నర్పితుఁ జేసి గర్మిలిన్
హరిహరనాథ సర్వభువనార్చిత నన్ దయఁ జూడు మెప్పుడున్."

అనుపద్యమున హరిహరనాథుని సదయావలోకనముఁ బ్రార్థించి స్వర్గారోహణపర్వాంతమున నున్న మాలినీవృత్తములో "సంభృతానందభావా" యనుసంబోధనమునఁ దాను మొదటఁ గోరిన 'బ్రహ్మానందసంభృతిని' వచించెను.

తిక్కనసోమయాజి కాలమున నెల్లూరున హరిహరాలయము గల దనియు నాతని పేరిటనే తిక్కనసోమయాజి తన భారతము నంకితము గావించె నని చెప్పెదరుగాని యది యథార్థము గాదు. తిక్కనసోమయాజికాలమున హరిహరనాథుని యాలయము నెల్లూరున లేదని చెప్ప వచ్చును. తిక్కనసోమయాజిచే భారతమున స్మరింపఁ బడిన హరిహరనాథుఁడు హరిహరులకు భేదము పాటింపని యద్వైతుల కుపాస్యుఁడును హరిహరుల కధినాథుఁడు నగుసర్వేశ్వరుఁడని విరాటపర్వము లోనియవతారికనుగాని యాశ్వాసాద్యంత పద్యములను గాని విమర్శించి చూచినపక్షమున బోధపడఁగలదు. నన్నయభట్టారకుఁడును తిక్కనసోమయాజియును నేకకాలమునం దున్నవారని కథలు కొన్ని కవిజీవితములందును, కవులచరిత్రమునందును నుదాహరింపఁబడుటయెగాక కవిజీవితములం దావాదమె సిద్ధాంతముచేయఁ బడియున్నది. కాని నూతనపరిశోధనములవలన నాయిరువురును సమకాలికులుగా రనియు నిరువురకిన్నూరుసంవత్సరములు కాలభేదము గలదనియు స్పష్టపడినది. కావున నాకథ లన్నియు నవిశ్వాసపాత్రములై వ్యర్థములై పోయినవి. నన్నయ పదునొకండవశతాబ్దిమధ్యముననను, తిక్కన పదుమూఁడవ శతాబ్దిమధ్యమున నుండిరి.

ఈ మహాభారతమును రచించునపుడు తిక్కనసోమయాజి చేసిననియమము మఱియొక్కటి గానవచ్చుచున్నది. ఏదియన,

"గీ. కథ జగత్ప్రసిద్ధిగావునఁ బూర్వప
ర్వార్థయుక్తిఁ జేయు నట్టియెడల
యత్న మించు కంతయైనను వలవదు
వలసినట్లు చెప్ప వచ్చి యుండు."

అని చెప్పి సోమయాజి గ్రంథము ప్రారంభము చేసెను.

అనఁగా భారతకథ జగత్ప్రసిద్ధమైనది; కావునఁ బూర్వాపరార్థములను సందర్భింపఁ జేయునప్పుడు యత్న మేమాత్ర మక్కరయుండ దనియును, ఇష్టానుసారముగ సందర్భము పొసగింపవచ్చు నని చెప్పినపద్యమేగాని మఱియొండు గాదు. ఈ పద్యమును బురస్కరించుకొనియె కాఁబోలు సోమయాజి భారతముఁ దెనిఁగించుచో మాతృకమైన మూలగ్రంథమును ముట్టకయె యాశుధారగ నిరంకుశప్రజ్ఞఁ జేసి యున్నాఁ డనుప్రవాద మొకటి లోకములో వ్యాపించి యున్నది. ఈ తెలుఁగుభారతము కష్టపడి సావకాశముగా నాలోచించి చక్కఁగాఁ జేయఁబడినగ్రంథముగాని జనులనుకొనునట్లు మూలగ్రంథమును ముట్టక తెఱలోఁ గూరుచుండ నోటికివచ్చిన ట్లల్లను చేయఁబడినది కా దని కవులచరిత్రమునం దీయఁబడిన సమాధానము సమంజసమైనదిగా నున్నది. తిక్కనసోమయాజి యీ భారతమును జెప్పునప్పుడు దీనిని వ్రాయుటకై నిర్ణయింబడిన వాఁడు కుమ్మరిగురునాథుఁ డనిచెప్పుదురు. ఈగురునాథునకు చెప్పిన దానిని మరల నడుగక వ్రాయఁ గలశక్తియున్న దట.

ఈభారతమును రచించునపుడు తిక్కనసోమయాజి తడవుకొన కుండ గవిత్వముఁ జెప్పెద ననియు, తానొక్కసారి చెప్పినదానిని మరలఁ జెప్ప ననియు, చెప్పినదానిని మరల మార్చుకొన ననియు, ప్రతిజ్ఞ చేసె నట్లును, చెప్పినమాటను మరల నడుగక గురునాథుఁడు వ్రాయుచుండఁగా శల్యపర్వములో ప్రథమాశ్వాసము కడపట సహదేవుఁడు శకునిని చంపినతరువాత సుయోధనుఁడు తొలఁగిపోయె నని ధృతరాష్ట్రునితో సంజయుఁడు చెప్పుభాగమున,

"క. పలపలనిమూఁకలోఁ గా
ల్నిలువక గుఱ్ఱంబు డిగ్గి నీకొడుకు గదా
కలితభుజుఁడగుచు నొక్కఁడుఁ
దొలఁగి చనియె—

అన్నంతవఱకుఁ బద్యమును జెప్పి తరువాత నేమియుఁ దోఁచక తిక్కన "యేమిచెప్పుదున్గురునాథా" యని కుమ్మరగురునాథు నడిగి నట్లును, అతఁ డదితన్నడిగినప్రశ్నగా భావింపక పద్యముతోఁ జేర్చి "తొలఁగి చనియె నేమిచెప్పుదున్గురునాథా" యని వ్రాసినట్లును, అప్పుడు తిక్కనసోమయాజి తనప్రతిజ్ఞకు భంగమువచ్చె నని చింతించుచుండఁగా "నేమిచెప్పుదున్గురునాథా" కవిలేఖకునిగూర్చి యుద్దేశించినది 'కురునాథా' యని ధృతరాష్ట్రున కన్వయించి యాప్రశ్నయే పద్యపూరణమున కనుకూలించె నని గురునాథుఁ డాతని నూరార్చె నట్లును ఒక పిచ్చుకథ కలదని యాంధ్రకవులచరిత్రమునందు గ్రంథస్థముగా

వింపఁబడి 'శ్రీమహాభారతము నాంధ్రీకరించిన యీమహాకవికీ
చిఱుపద్యములోని యల్పభాగము తోఁచకపోయె ననిసాధిం
చుట కీకథపనికిరాదు గాని తిక్కన యాశుధారగా కవిత్వము
చెప్పఁగలవాఁ డనిస్థాపించుటకై యీకథ కల్పింపఁ బడె నని
మాత్ర మూహింపఁ దగి యున్న దని యాంధ్రకవులచరిత్ర
మున నీసమాధానము చెప్పఁబడి యున్నది. ఈపద్యము
మూలముననే గురునాథుఁ డొకఁడు జన్మ మెత్తినాఁడు. ఈ
పద్యము మహాభారతమునఁ దిక్కనసోమయాజి వ్రాయ కుండె
నేని కుమ్మరగురునాథుఁడు జన్మమెత్తక యే యుండును.

తిక్కనసోమయాజికిఁ గుమ్మరగురునాథుఁడు లేఖకుఁ
డుగా నుండె ననుట సత్యము గాదు. తిక్కన చేసినప్రతిజ్ఞ
మాటయు సత్యము కాదు. తిక్కన పూర్వాపరసందర్భము
లను జక్కగా నాలోచించి కవిత్వము చెప్పినవాఁడుగాని పై
ప్రతిజ్ఞతోఁ జెప్పినవాఁడు కాఁడని యీక్రిందివిషయమునుబట్టి
స్పష్టపడఁగలదు.

ఒకసారి చెప్పినవిషయమును మరలఁ జెప్పవలసివచ్చి
నప్పుడును, పూర్వోక్తార్థమున కనువాదముఁ జేయవలసినప్పు
డును తిక్కనసోమయాజి తొలుతఁ జెప్పినగద్యపద్యములనే
మరలఁ జెప్పుచు వచ్చెను. మఱియు నొకప్రకరణమునఁ జేసిన
వర్ణనము మఱియొకప్రకరణమునఁ జేయవలసివచ్చినప్పుడు
ప్రకరణానురూపముగఁ గొంచెము మార్పుచేసి మున్నటిగద్య

పద్యములనే వాడియున్నవాఁడు. ఇట్టిపద్ధతి భారతములో నుంచుటయెగాక తానురచియించిన నిర్వచనోత్తరరామాయణలోని పద్యములను సైతము నించుక మార్చియు మార్పకయు సందర్భముగలిగినపుడు భారతములోఁ జొప్పించి యున్నాఁడు. ఇందులకుఁ గొన్ని దృష్టాంతములను జూపుచున్నాఁడను.

ద్రోణపర్వమునం దభిమన్యుఁడు చంపఁబడినతరువాత ధర్మరాజునకు దుఃఖోపశమనముగా కృష్ణద్వైపాయనుఁడు బోధించిన షోడశరాజచరిత్రమును దెలుపు నట్టిపద్యములనే శాంతిపర్వమున బంధుమరణార్తిచేఁ దపింపుచున్న ధర్మరాజునకు గదాగ్రజుఁ డాకథను జెప్పవలసినసందర్భమునఁ గొందుపఱచి యున్నాఁడు.

విరాటపర్వము ద్వితీయాశ్వాసములో కీచకుఁడు తన యెడ మోహావేశపరవశుఁడైనపు డాతని నదల్చుటకై ద్రౌపదిచేఁ జెప్పించిన,

"శా. దుర్వారోద్యమ బాహువిక్రమరసాస్తోక ప్రతాప స్ఫుర
ద్గర్వాంధ ప్రతివీర నిర్మథనవిద్యాపారగుల్ మత్పతుల్
గీర్వాణాకృతు లేవు రిప్డు నినుదోర్లీలన్ విజృంభించి గం
ధర్వుల్ ప్రాణము మానముం గొనుట తథ్యం బెమ్మెయిం గీచకా!"

అనుపద్యమునే ద్రౌపదితనభంగపాటును భీమునితో విన్నవించు నపుడును తాను గీచకుని ట్లదల్చితి నని చెప్పుసందర్భమున నీపద్యమునే మరల చెప్పి యున్నాఁడు.

ఉద్యోగపర్వములో కౌరవులకడకు శ్రీకృష్ణునిరాయబారిగాఁ బంపినపుడు పాండవు లేప్పురును తమతమయభిప్రాయములను వేఱు వేఱ కృష్ణునితోఁ జెప్పునప్పుడు భీముఁడు దన మాటగాఁ జెప్పినట్లుండు,

“తే. అన్నదమ్ములమై యుండి యకట మనకు
నొరులు దలయెత్తి చూడ నొండొరులతోడఁ
బెనఁగ నేటికి నీ నేల పెద్దవారి
బుద్ధి విని పంచి కుడుచుట పోల దొక్కొ?”

అనుపద్యమునే స్త్రీపర్వములో గాంధారికిఁ గోపశాంతి కలిగించుటకై వినయముతో భీముఁడు ప్రయత్నించి నపుడును జెప్పియున్నాఁడు.

విరాటపర్వములో ప్రథమాశ్వాసమున విరాటరాజు తనకూఁతు రగునుత్తరను నాట్యశిక్షకై బృహన్నల కప్పగించుటకై రప్పించునప్పు డామెను వర్ణించిన,

“సీ. అల్లదనంబున ననువు మైకొనఁ జూచు
నడపుకాంతికి వింతతోడవు గాఁగ
వెడనెడ నూఁగారి వింతదైయు యేర్పడ
దారనివళులలో నారు నిగుడి
నిట్టలు ద్రోఁచుచు నెలవుల కలమేర
లెల్లను జిగియెక్క యేర్పడంగఁ
దెలుపును గప్పను వెలయంగ మెఱుఁగెక్క
తారకంబులఁ గల్కితనము దోడరఁ

ఆ. జరణములును నడుముఁ జన్నులుఁ గన్నులు
జవ్వనంబు చెన్ను నివ్వటిల్లు
చునికిఁ దెలుపుచుండ నుత్తర సనుదెంచె
నలరుమరునిపువ్వుటమ్మువోలె.''

అనుపద్యమునే శాంతిపర్వ ప్రథమాశ్వాసములో సృంజయ రాజు కూఁతును నారదుఁడు మోహించినకథను జెప్పుచు దాని వర్ణనసేయుచు నాఁటవెలదిగీతి ౩, ౪ పాదములనుఁ ''ఉనికి దెల్ప సృంజయునిపుత్త్రి మెలఁగు విధంబు నారదునకుఁ దగు లొనర్చె'' అని మార్చి ప్రయోగించి యున్నాఁడు.

భీష్మపర్వము మొదట సంజయుఁడు ధృతరాష్ట్రునకు భీష్ముశరతల్పగమనమును జెప్పినప్పుడు వ్రాసిన

''సీ. ఆత్మయోధుల కెల్ల నాధార మగునట్టి
తనకు నస్త్రంబు లాధార మయ్యెఁ
బరశురామునకు మేల్సరియైన తనయంతుఁ
గలిగె భంగంబు శిఖండిచేత
జనపతి దనునచ్చి మనుజూద మొనరించెఁ
దాను గయ్యంపుజూదమునఁ నోడెఁ
దనయార్పు బెలుగునఁ దలకు వైరులు
వొంగ నొఱలుచు నేలకు నొఱఁగె నేఁడు

ఆ. తీవ్రబాణజాలదీప్తులు పరగించి
పాండు తనయసైన్యబహుళతమము
లీలఁ బదిదినంబు లోలిమై విరియించి
యధిప భీష్మభానుఁ డస్తమించె.''

అనుపద్యములోఁ గడపటియాటవెలదిగీతినే స్త్రీపర్వద్వితీయాశ్వాసమున గాంధారి భీష్ముం గూర్చి శోకించుచుఁ గృష్ణునితోఁ జెప్పినప్పుడు మూఁడునాలుగు పాదములలోనుండు 'పదిదినం లోలిమై విరియించి యధిప' యనుపదములను 'పదిదినములు దోలి వినోదించి యనఘ' యనుపదములతో మార్చి వ్రాసెను. ద్రోణపర్వము తృతీయాశ్వాసములో సైంధవవధార్థ మర్జునుఁ డరుగుచు ధర్మరాజును బట్టి దుర్యోధనున కిచ్చునటులు ద్రోణుఁడు జేసినప్రతిజ్ఞ మనస్సునకుఁ దట్టఁగా సాత్యకిం బిలిచి యాతనిరక్షణార్థము నియోగించు నప్పుడు చెప్పిన

"క. మనకునిమిత్తము లెంతయు
ననుకూలము లయ్యె గెలుతు మాహవమున నేఁ
జనియెదఁ బ్రతిజ్ఞ దీర్పఁగ
ననఘా ధర్మసుతురక్ష కరుగుము నీవున్."

"క. వినుసింధురాజవధయును
మనుజాధిపరక్షణంబు మనకు సరియ కా
వున నేనొకపని నీవొక
పనిగొని చేయు టరయఁ బాడియ కాదే.

ఆ. ఏనునిలిచినట్ల కా నూఱడిల్లు నీ
వున్న నన్నరేశ్వరోత్తముండు
నిర్భరుండ వగుము నీవు నాదెస నాకు
హారి గలండు గలఁడె యచట నితఁడు.

వ. ఎల్లభంగుల రాజరక్షణార్థంబుగా నీకుంబోవలయును. బరాక్రమ ధుర్యుం డగు నాచార్యునిప్రతిన యెఱుంగవే యనుటయు."

అనుపద్యగద్యములనే ధర్మరాజు సాత్యకి నర్జునకుఁ దోడ్పడఁ బొమ్మనినప్పు డతఁ డతనితో నీసమాచారము జెప్పుసందర్భ మునఁ బ్రయోగించి యున్నాఁడు. అప్పటిమాటలే యనువా దమునఁ జెప్పుట యెంతయుఁ జతురమై యుండెను.

కర్ణ పర్వము ప్రథమాశ్వాసమునఁ గర్ణుని దినయుద్ధ మున శల్యునిపోరు వర్ణించుసందర్భమునఁ బ్రయోగించిన

"సీ. కమలాకరములీలఁ గలఁచియాడెడు గంధ
దంతావళము సముద్దండతయును
దరమిడి మృగసముత్కరము ఘోరంబుగా
వధియించు కంఠీరవంబు నేపు
నీరసారణ్యంబు నిర్భరాటోపతఁ
గాల్చుదావాగ్ని యుగ్రక్రమంబుఁ
బ్రకటవిక్రాంతిఁ బురత్రయంబును సమ
యించుఫాలాక్షునియేపుఁ దాల్చి

"ఆ. పోల్పఁ బడియెనపుడు భుజగర్వశౌర్యప్ర
తాపదుర్దమప్రకోపములకు
మద్రవిభుఁడు గోలుమసఁగి శాత్రవసైన్య
హననకేళి సల్పునవసరమున."

అనుపద్యమునే యాఁటవెలదిగీతి మొదటి పాదమున "పోల్పఁబడియెనపుడు" అనుపదములను "పోల్పబట్టఁగాఁగ" అనుపదములతో మార్చి శల్యపర్వప్రథమాశ్వాసమున శల్యుని యుద్ధమును వర్ణించుచోఁ జెప్పియున్నాఁడు.

ఇఁక నిర్వచనోత్తరరామాయణములోని పద్యములను గొన్నిటిని మార్చియు, మార్పకయు భారతమునఁ బ్రయోగించినవానిలో నొకటిరెండు దృష్టాంతములను జూపి విరమించుచున్నాను.

"చ. గుణమున లస్తకంబునను గోటియుగంబునఁ గేలఁ దారఁ భీ
షణముగ నుప్పతిల్లి రభసంబున రేఁగినమాడ్కిఁ దీవ్రమా
ర్గణనికరంబు లొక్కటఁ నరాతిబలంబులఁ గప్ప శార్ఙ్గని
క్వణనము రోదసీకుహరకర్పరముం బగిలింప నుగ్రతన్."

ఈపద్యమును నిర్వచనోత్తరరామాయణములో మూఁడవయాశ్వాసమున మొదట వ్రాసియున్నాఁడు. దీనినే విరాటపర్వములో నైదవయాశ్వాసమునఁ గొంచెము మార్పుచేసి యీక్రిందిరీతిగాఁ బ్రయోగించి యున్నాఁడు.

"చ. గుణమున లస్తకంబునను గోటియుగంబునఁ గేలఁ జాల భీ
షణముగ నుప్పతిల్లి రభసంబున రేఁగినమాడ్కిఁ దీవ్రమా
ర్గణనికరంబు లొక్కట నరాతిబలంబులఁ గప్ప గాండివ
క్వణనము రోదసీకుహరకర్పరముం బగిలింప నుగ్రతన్."

ఇందు 'తార' యనునది 'చాల' గను 'శార్ఙ్గనిక్వణన' మనునది 'గాండివక్వణనము' గను మార్పఁ బడినవి.

మఱియు తిక్కనసోమయాజి,

"మ. కలఁగెం దోయధిసప్తకంబు గిరివర్గం బెల్ల నూటాడె సం
చలతం బొందె వసుంధరావలయ మాశాచక్ర మల్లాడెఁ గొం
దలమందెం ద్రిదశేంద్రుపట్టణము పాతాళంబు ఘూర్ణిల్లె నా
కుల మయ్యెం గ్రహతారకాకులము సంక్షోభించె నావేధయున్."

అనునిర్వచనోత్తర రామాయణములో నైదవయాశ్వాసము

లోని పద్యమును మార్పు చేయకయె విరాటపర్వములో నాలవయాశ్వాసములోఁ బ్రయోగించి యున్నాఁడు.

నిర్వచనోత్తర రామాయణములో నాఱవయాశ్వాసమున దేవదానవ యుద్ధసందర్భమున రచియింపఁబడిన

"మ. పటువేగంబున శాతభల్లచయసంపాతంబునన్ మింట వి
క్కటమై పర్వ ధగద్ధగీయ మగుచుం గోపంబు రూపంబులై
చటులక్రీడఁ జరించు నట్లిరువురున్ శౌర్యోన్నతిం బోరి ర
క్కటఁ దర్పోద్ధతులై పరస్పరజయాకాంక్షఁ బ్రచండంబుగన్."

అనుపద్యమునే రెండవపాదమున "పర్వధగద్ధగీయమగుచున్" అనుపదములు. "మంటధగద్ధగయనన్" అను పదములతో మార్చియు నాలవపాదమునందలి 'పరస్పరజయాకాంక్షఁ బ్రచండంబుగన్' అనుసమాసమును 'బరస్పరజయాకాంక్షం బ్రచండంబుగన్' అనివ్యస్తపదములగఁ జేసియు విరాటపర్వము మూఁడవ యాశ్వాసమున దక్షిణగోగ్రహణ యుద్ధమునం బ్రయోగించి యున్నాఁడు.

"శా. శ్రావ్యంబై చెలఁగన్ గభీరమధురజ్యానాద ముద్దారువీ
రవ్యాపార నిరూఢతం బ్రతిశరారంభంబు మర్దించుచున్
సవ్యప్రౌఢి దృఢాపసవ్యగతి నాశ్చర్యంబుగా నేయుచున్
దివ్యాస్త్రంబులఁ బోరి రిద్దఱును సాదృశ్యం బదృశ్యంబుగన్."

అను నిర్వచనోత్తరరామాయణములోఁ జతుర్థాశ్వాసమున రావణకు బేరులకు జరిగినయుద్ధసందర్భమునఁ బ్రయోగింపఁబడిన దానిని మార్పేమియుఁ జేయకయే విరాటపర్వపంచమాశ్వాసమున నుత్తరగోగ్రహణమున ద్రోణార్జునసమర వర్ణనమునం జొప్పించి యున్నాఁడు. ఇట్టివానిని పెక్కులు చూపవచ్చును. గ్రంథవిస్తరభీతిచే వానిని విరమించుచున్నాను.

నన్నయతిక్కనాదులు సంస్కృత మహాభారతమును యథాక్రమముగా నాంధ్రీకరింపలేదనియును, మాతృకకు సరిగా నుండక పోవుటయేగాక మూలములోని పెక్కుభాగములను దెనిగింపకయు, సంగ్రహపఱచియు నిచ్ఛానుసారము రచించినారని యిప్పటిపండితులు కొందఱు దోషారోపణము చేయుచున్నారు. వారిపద్ధతియే వీరికి బోధపడినట్లు గన్పట్టదు. ఆంధ్రభారతము సంస్కృతభారతములోనికథను మాత్రము గైకొని స్వతంత్రకావ్యముగా వ్రాయఁబడినగ్రంథము గాని కేవలము సంస్కృతభారతమునకు భాషాంతరీకరణ మనుకొనుట పొరబాటు. ఇప్పటి సంస్కృత భారతము నన్నయతిక్కనాదులకాలములో నిట్లే యున్నదనుకొనుట మఱియొక పొరబాటు. తిక్కనకృతభారతమును సంస్కృతమహాభారతమునకు భాషాంతరీకరణ మనితలంచుట తిక్కనయెడ మనము చేయు నపరాధముగాఁ బరిగణింపవలయును. సంస్కృతమహాభారతము నుండి కథనుమాత్రము గైకొని మూలములో లేని యర్థాలంకారములును, రసభావములును, మానవస్వభావవర్ణనలును విచ్చలవిడిగాఁ బెంచియు, మూలములో విసుగుపుట్టించెడు ననేకదీర్ఘకథానకములను వర్ణనలను, వేదాంతఘట్టములను సంగ్రహపఱచియు, నిరంకుశవృత్తి గైకొని మూలముకంటెను వేయిరెట్లధికమనోహరముగా నుండునటుల రచించిన స్వతంత్రమహాకావ్యమనియే చెప్పఁదగియున్నదిగాని మఱియన్యము గాదు. తిక్కనసోమయాజి సంస్కృతభారతములో నున్న దానిని ముక్కకు ముక్కగాఁ దెనిగించి పెట్టియుండిన

మొదల నీయాంధ్రభారత మింతయుత్తమోత్తమకావ్యముగా నుండకయె పోవును. సంస్కృతకావ్యములను భాషాంతరీకరింప వలసినరీతి నిప్పటిపండితులకంటె నెక్కువబాగుగా నెఱింగిన వాఁడె గాని యల్పుఁడు గాఁడు. ఈసందర్భముననే వ్రాయుచు విజ్ఞానసర్వస్వసంపాదకు లగు శ్రీయుతకొమఱ్ఱాజు లక్ష్మణరావు పంతులుగారు ''సంస్కృతభారతము బంగారపుముద్ద వంటిది. ఆంధ్రభారత మాముద్దలోనుండి కావలయునంత బంగారమును దీసికొని స్వర్ణకారుఁ బుద్ధివైభవముతోఁ జేయఁబడిన చక్కని సువర్ణకమలము వంటిది. ఉభయభారతములలోని యీభేదముఁ జూపి స్వర్ణకారుని బుద్ధివైభవము వెల్లడిచేయుటయే మాయుద్దేశము.'' అని యొకచోట వ్రాసి యున్నారు. ఇదియెంతయు సయుక్తికమును సమంజసము నైనవాదము. ఆంధ్రకవుల చరిత్రములో భగవద్గీతలను తెనిగింపనేలేదని వ్రాయఁబడియెను. తిక్కనసోమయాజి దానిని ముట్టకపోలేదు. దానిని గూడ సంగ్రహముగాఁ దెనిగించియే యున్నాఁడని కీర్తిశేషులైన శతఘంటము వేంకటరంగశాస్త్రిగారు తాము వ్రాసినవిమర్శన పీఠికలోని దాని నిదిగువ నుదాహరించుచున్నాఁడను.

''భగవద్గీత లీతండు తెనుఁగుసేయక యుపేక్షించె నని జనప్రతీతి కలదు గాని యది యట్లు గాదు దానింగూడ సంగ్రహముగఁ దెనుఁగుఁ జేసి యున్నాఁడు.

''శ్లో. ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః
మామకాః పాండవా శ్చైవ కి మకుర్వతసంజయ.

అను భగవద్గీతా ప్రథమశ్లోకమును.

''క. మానుగ ధర్మక్షేత్రం
బైనకురుక్షేత్రమున మహాహవమునకుం

బూని మనబలముఁ బాండవ
సేనయు నిటువన్ని యేమిసేసెం జెపుమా.”

అను కందపద్యమునఁ దెనిఁగించి

“తే. ఇంతపాపంబు సేయంగ నెత్తికొందు
రయ్య రాజ్యలోభంబున నఖిలబంధు
జనుల వధియింపఁ దొడఁగితి నని రథంబు
మీఁదఁ గూర్చుండఁ బడియెఁ జే యూఁదికొనుచు.”

అనుపద్యముపర్యంతము ప్రథమాధ్యాయ మంతయుఁ దెనిఁగించెను.

“వ. ఇవ్విధంబున శోకసంవిగ్న మానసుండును విషాదవిహ్వలుం డును, బరమకరుణాభరితుండు నై శరశరాసనంబులు విడిచి కన్నీరు దొరంగ నూరకున్న సవ్యసాచిం జూచి మధుసూదనుం డిట్లనియె.”

అనువచనము మొదలుగా ద్వితీయాధ్యాయముఁ దెనిగింపఁ బూని సంగ్రహముగా విభూతి యోగాంతము లైనతొమ్మిది యధ్యాయముల సారాభిప్రాయము సంక్షేపముగాఁ దెలిపి విశ్వరూపసందర్శన యోగాధ్యాయ మందలికథను,

“మ. అతిగుహ్యం బిది నీవు భూరికృప నీయధ్యాత్మముం గానఁ
సితి నాకిమ్మెయి విన్కిఁ గొంతభ్రమవాసెన్ యోగిహృద్ధ్యేయమై
యతు లైశ్వర్యవిభూతి నొప్పు భవదీయంబైనరూపంబు నూ
చు తలం పెత్తెడుఁబోలు నేని దయఁ జక్షుఃప్రీతిఁ గావింప వే.”

అనుపద్యము మున్నుఁగాఁ గొన్నింటఁ దేటపఱిచి పిమ్మటి యధ్యాయముల యభిప్రాయమును సంగ్రహించుచు మోక్షసన్న్యాస యోగప్రతిపాదక మగుకడపటి యధ్యాయమందుఁ బ్రధానమయిన

“శ్లో. సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః.”

అనుశ్లోకమును,

“తే. క్రందుకొను సర్వధర్మవికల్పములను
నెడల విడిచి దృఢంబుగ నే నొకండ

శరణముగ నాశ్రయింపుము సకలదురిత
ములకుఁ దొలగింతు నిన్నుఁ బ్రమోదమంద."

అనుపద్యమున దెనిఁగించి

"శ్లో. యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః
తత్ర శ్రీర్విజయో భూతిర్ధ్రువా నీతిర్మతిర్మమ॥

అనుభగవద్గీతాంత్యశ్లోకము

"తే. అధిపయోగీశ్వరేశ్వరు డైనకృష్ణుఁ
డును ధనుర్ధరవర్యుఁ డర్జునుఁడు నెచట
నిలిచి రచ్చట విజయంబు నీతి సిరియు
భూతి నిత్యంబు లగు నిది నాతలంపు."

అనుపద్యమున నాంధ్రీకరించెను.

తిక్కనకృతమైన మహాభారతకావ్యభాగ మాంధ్రభాషలో నద్వితీయమైనదిగా నున్నది. ఇది ప్రపంచములోని యుత్తమోత్తమకావ్యములలో నొక్కటియనుటకు సంశయము లేదు. ఇతని కవిత్వమహిమాదులను గూర్చి పూర్వకవుల యొక్కయు పండితులయొక్కయు నభిప్రాయములను దెలుపుటకంటె నేను జెప్పఁదగిన దింతకంటె నేమియును లేదు. ఆంధ్రకవులచరిత్రమునందు రావుబహదరు వీరేశలింగముపంతులుగారిటులు వ్రాసి యున్నారు.

'కాని తిక్కనసోమయాజిశైలితో సమానముగా వ్రాయుటమాత్ర మెవ్వరికిని సాధ్యముగాదు. తెలుఁగుభాషయందెన్నోగ్రంథములున్నను తిక్కనసోమయాజికవిత్వముతో సమానముగాఁ గాని దానిని మించునట్లుగాఁ గాని కవిత్వము చెప్పఁగలిగినవారు నేటివఱకొక్కరును గనఁబడలేదు. తిక్కనకవిత్వము ద్రాక్షాపాకమై మిక్కిలి రసవంతముగా నుండును. ఈతని కవిత్వమునఁ బాదపూరణమునకై తెచ్చిపెట్టుకొనెడు

వ్యర్థపదము లంతగా నుండవు. పదములకూర్పు మాత్రమె గాక యర్థసందర్భమును మిక్కిలి పొందికగా నుండును. ఏవిషయము చెప్పినను యుక్తియుక్తముగాను ప్రౌఢము గాను నుండును. ఎక్కడ నేవిశేషణము లుంచి యేరీతి నేపదములు ప్రయోగించి రసము పుట్టింపవలయునో యీకవికిఁ దెలిసి నట్లు మఱియొకరికిఁ దెలియదు. ఈతనికవిత్వము లోకోక్తులతోఁ గూడి జాతీయముగా నుండును. ఈయన పదలాలిత్యమును, యుక్తిబాహుళ్యమును, అర్థగౌరవమును, రచనాచమత్కృతియు, శయ్యావిశేషమును, సందర్భశుద్ధియు, కల్పనాకౌశలమును, అన్యులకు రావు."

శ్రీమదాంధ్రమహాభారతమునకుఁ బీఠిక వ్రాసిన కీర్తిశేషులైన శతఘంటము వేంకటరంగశాస్త్రిగారు కవికవిత్వమహిమను గూర్చి యిట్లు వ్రాసి యున్నారు.

"ఏవిషయమునం జూచినను నిమ్మహాకవికి సమానుఁడని చెప్పఁదగినకవియొక్కఁడు నిప్పటికి వినంబడఁడు. ఇఁక నధికుఁడు లేఁడని చెప్ప నేల? ఈమహాకవికవనముంగూర్చి యెంత సెప్పినం జెప్పవలసియే యుండును గాని యొకప్పటికైనం దనివి దీఱఁ జెప్పి నట్లుండదు......ఈమహాకవి గ్రంథముం జూచి నేర్చుకొనవలసిన విషయములు నెన్నియేనిఁ గలవు. ఆంధ్రభాషాకవిత్వ మర్మ మీతనికిఁ దెలిసినట్టులు మఱియే యాంధ్రకవికి నిప్పటికిని దెలియదనియు, నిరాక్షేపముగాఁ జెప్పవచ్చును."

ఇట్టిమహాత్మ్యాకర్యమును నెఱవేర్చుటచే నాధునికవిద్వాంసులే గాదు గొనియాడినది. తిక్కనసోమయాజి యనంతరకాల

ములోని పురాణకవులలో విశేషజ్ఞులు సోమయాజిని బ్రహ్మయనియే పొగడియున్నారు.

హరివంశములో నెఱ్ఱాప్రెగ్గడ:—

"మ. తనకావించినసృష్టి తక్కొరులచేతం గాదు నా నేముఖం
బునఁ దాఁ బల్కినఁ బల్కు లాగమములై పొల్పొందు నా వాణిశ
త్తనునీతం డొకరుండ నాఁ జనుమహత్త్వాప్తిం గవిబ్రహ్మ నా
వినుతింతుం గవితిక్కయజ్వనిఖి లోర్వీదేవతాభ్యర్చితున్."

భీమేశ్వరపురాణములో శ్రీనాథకవి.

"ఉ. పంచమవేదమైపరఁగు భారతసంహిత నాంధ్రభాషఁ గా
వించెఁ బదేనుపర్వములు విశ్వజగద్ధితబుద్ధి నెవ్వఁ డ
క్కాంచనగర్భతుల్యున కఖండితభక్తి నమస్కరింతు ని
ర్వంచితకీర్తివైభవవిరాజికిఁ దిక్కనసోమయాజికిన్."

తిక్కనసోమయాజి కవివాగ్బంధన మనులక్షణగ్రంథము నొకదాని రచియించి నట్లు క్రిందిపద్యమువలనఁ దెలియుచున్నది.

"క. తెనుఁగున కవివాగ్బంధన
మనుఛందం బవని వెలయ మార్గములో
దిక్కనసోమయాజి చెప్పెను
జను లెల్ల నుతింప బుధులసమ్మతిగాఁగన్."

తిక్కనసోమయాజి కవిత్వములోనుండు మహావిషయముల నన్నిటి నెత్తి చూపి యొకకావ్య విమర్శగ్రంథముగా వ్రాయుట నాయుద్దేశముగాదు గావున నాప్రయత్న మిందే మియుఁజూపక విడిచి పెట్టినాఁడను.

సమాప్తము.

# ఆంధ్ర భాషాభివర్ధనీ సంఘము, లిమిటెడ్.,

## (ప్రారంభము 1907).

---

ఈ సంఘమువారు ఆంధ్రభాషాభివృద్ధికిని తన్మూలమున దేశాభివృద్ధికిని ఆంధ్రుల అభివృద్ధికిని అవశ్యమైన గ్రంథములను అనగా దేశదేశముల చరిత్రములు, శాస్త్రగ్రంథములు, మహనీయుల జీవితచరిత్రములు ఇతరభాషలలోని గొప్ప గ్రంథముల భాషాంతరీకరణములు, మొదలగు గ్రంథములను తెలుగు భాషలో ప్రకటింప నిశ్చయించుకొని, ఇప్పటివరకు ఈదిగువ గ్రంథములను ప్రకటించిరి. సంఘమువారివలన ప్రకటింపబడు గ్రంథముల నీక్రింది నియమములకులోబడి కొనవచ్చును.

### చందాదారులగుటకు నియమములు.

(1) చందాదార్లు ప్రవేశరుసుము నాల్గణాల నీయవలెను.

(2) చందాదార్లకు సంఘప్రకటనలనన్నిటిని పోస్టేజిగాక నూరు పేజీలకు నాల్గణాలచొప్పున నీయబడును. ఒక్కొక పుస్తకము తయారు కాగానే వి. పి. గా పంపబడును.

(3) చందాదార్లగువారు సంఘమువారివలనఇక మీదట ప్రకటింపబడబోవు గ్రంథములనన్నిటిని కొనవలెను ఇదివరకు ప్రకటింపబడిన గ్రంథములలో వారిష్టమువచ్చిన వానిని కొనవచ్చును.

(4) ఒక్కొక చందాదారు చందాదార్ల వెలలకు ఒక్కొక గ్రంథమునకు పైనపొందజాలరు.

(5) ఆయాగ్రంథమునకు తగినట్లుగను, అవసరమైనట్లుగను చిత్రపటములు చేర్చబడును. పుస్తకముల నందముగ నుండునటుల జేయవలసిన ప్రయత్నములు చేయబడును.

వల్లూరి - సూర్యనారాయణరావు, బి.ఎ., బి ఎల్., ఎల్.టి.,

సెక్రటరి.

ఉత్తరములు వ్రాయవలసిన విలాసము:—

శారదా పబ్లిషింగు కంపెని,

165, మౌంటురోడ్డు, మద్రాసు.

## 1. భారతధర్మ దర్శనము.

గ్రంథకర్త: గవర్నమెంటు తెలుగు ట్రాన్సులేటరగు
చన్నాప్రగడ భానుమూర్తిపంతులుగారు, బి.ఏ., ఎల్. టి.
తృతీయముద్రణము.

నిర్మలదేశానురాగమునుబోధించు 109 పద్యములు. ప్రతిఆంధ్రుడును చదివి తీరవలసినదే చందాదారులకు రు. 0-1-6 లకు ఇతరులకు రు. 0-2-0 లు.

## 3. పీష్వానారాయణరావు వధ.

గ్రంథకర్త:—వేమవరపు రామదాసుపంతులుగారు, బి.ఏ., బి.ఎల్.,

ఈ కథ ఇదివరకే యాంధ్రదేశమున నాటకరూపమున ప్రదర్శింపబడు చుండుటచేత ఆంధ్రులందరికిని తెలిసియేయున్నది. ఈగ్రంథమునందు పీష్వానారాయణరావు, పీష్వామాధవరావు, రఘోబాయి బొమ్మలును, పీష్వా నారాయణరావు వధయొక్క బొమ్మయును ప్రకటింపబడినవి. మృదు మధురశైలి. వెల చందాదారులకు 0-1-6 ఇతరులకు 0-2-0.

## 8. స్వాతంత్ర్యదర్శనము.

గ్రంథకర్త:—దుగ్గిరాల-రామమూర్తి పంతులుగారు, బి.ఏ., ఎల్. టి.,

జాన్ స్టూవర్టు మిల్లు అను ఆంగ్లేయ పండితోత్తముని లిబర్టీ అను ప్రసిద్ధ గ్రంథముయొక్క భాషాంతరీకరణము. వెల చందాదారులకు రు. 0-7-0 లు. ఇతరులకు రు. 0-12-0 లు.

## 9. మహారాష్ట్ర చరిత్ర.

గ్రంథకర్త:-చిల్లరిగె శ్రీనివాసరావు పంతులుగారు, బి. ఏ.

ఏ హైందవుడైనను నిన్న గాక మొన్నటివరకు స్వరాజ్య సుఖమను భవించిన మహారాష్ట్ర సోదరుల పవిత్రచరిత్రమును చదువకుండుట హాస్యాస్పదము గదా. మహాదేవ గోవిందరానడే మొదలగు మహనీయులచేవ్రాయ బడిన గ్రంథ సహాయముచే మృదుమధురశైలిని వ్రాయబడిన ఉద్గ్రంథము.

హిందూదేశ పటమును శివాజీ, రామదాసస్వామి, రాజా వెంకాజీ, తారాబాయి, సాహుమహారాజు, పీష్వాబాజీరావు, అహల్యాబాయి మొదలగు 22 చిత్రపట శోభితమయి యున్నది.

ఇదివరకలో ఆంధ్రులు హిందూదేశ చరిత్రములో హిందూ మహారాష్ట్రీయ మహాయుగములను మాత్రము చదివియుండిరి. ఇప్పుడు మహారాష్ట్ర మహాయుగము చదివితీరవలసినదే. వెల చందాదారులకు రు. 1-4-0. ఇతరులకు రు. 1-14-0.

## 10. ఆంగ్లేయ రాజ్యాంగ నిర్మాణచరిత్ర.

గ్రంథకర్త: గోటేటి - కనకరాజు పంతులుగారు, బి.ఏ, బి.ఎల్.,

మన హిందూదేశమున ప్రస్తుతము మనము అనుభవించు శాంతము, సుఖములకు నాధారభూతమైన మనపరిపాలకుల నివాసస్థలమగు ఇంగ్లాండు దేశముయొక్కయు, పరిపాలకులగు ఇంగ్లీషువారి పార్లమెంటుయొక్కయు చరిత్రము. వెల చందాదారులకు రు. 0-12-0. ఇతరులకు రు. 1-4-0.

## 11. ఆరోగ్య శాస్త్రము.

గ్రంథకర్త:

భోగరాజు - పట్టభి శీతారామయ్యగారు, బి. ఏ, ఎం. బి., సి. ఎం.,

తెలుగు భాషలో ప్రకటింపబడిన ఈశాస్త్ర గ్రంథమునకుసాటి వేరొకటిలేదు.

ఇందలి యంశములు మనము ఉదయమున లేచినది మొదలు సాయంకాలమువరకు మననిత్యకృత్యములకు సంబంధించినవి. ఆరోగ్యమును కోరని మానవుడుండడుగదా. మనము పీల్చుగాలి, మనము త్రాగునీళ్ళు, మనముతిను ఆహారము, మనకు అక్కరలేని పదార్థములను పారవేయుట, మన ఇండ్లు మనదేహారోగ్యము, వ్యాధినివారణము మొదలగు సంగతులను గురించిన గ్రంథము. ఎల్లరకు బోధపడునట్లు వట్టివాదులుగాక ప్రయోజనకరమైన విషయములను ఇందు చక్కగవ్రాయబడినవి.

వెల చందాదారులకు రు. 1-0-0 లు. ఇతరులకు రు. 1-4-0.

## 12. అశోకుని చరిత్రము.

గ్రంథకర్త:—చేతఘాడి లక్ష్మీకాంతరావుగారు. రెండువేల సంవత్సరములకు పూర్వము భరతఖండమనుభవించుచుండిన ఐశ్వర్యము నాగరికతలును, పరిపాలనా నిపుణతయును తెలిసికొనగలుగు గ్రంథము. ఒక

సారిచదివి పారవేయక ప్రతిదినము పఠింపవలసిన గ్రంథరాజము. వెల చందాదారులకు 0-13-0. ఇతరులకు రు. 1-4-0.

## 13. ప్రభావతి (నవల.)

గ్రంథకర్త:— గాదె- శ్రీజగన్నాథస్వామిగారు.

ఈకథ శ్రీశివాజీ చరిత్రకాలమునాఁటిది. దీనియందు శ్రీశివాజీకిని విజాపురపు సుల్తానునకు నున్నపరస్పరభేదములు తరువాతసవరణ, చక్కగ తెలుపబడినవి. శ్రీ శివాజీ మహారాజుయొక్క అద్వితీయ దేశాభిమానము చక్కగ వర్ణింపఁబడినది. రామదాససస్వామియొక్క నీతిబోధలను చదువ తగియున్నవి. ఆయా సందర్భములకు తగిన వర్ణనలనుకలిగియున్నది. శైలి సులభము వెల. చందాదార్లకు రు 0-12-0. ఇతరులకు 1-4-0.

## 14. పశుశాస్త్రము.

గ్రంథకర్త:- టేకుమళ్ల- రాజగోపాలరావుగారు, బి. ఏ.,.

కృష్ణాజిల్లా వ్యవసాయసంఘ గౌరవ కార్యదర్శిగారగు

గోపిశెట్టి-నారాయణస్వామి, బి. ఏ., గారి యుపోద్ఘాతముతో

ఈగ్రంథమునందు మనదేశమందలి పశువులు, ఇతర దేశమునందలి పశువులు, పశువుల యాహారములు, ఏయే పదార్థములు పాడిపశువులకు పెట్టిన పాలుబాగుగా నిచ్చునో వాని వివరములు, పశురోగములకు తగు వైద్యములు ఈ మొదలుగాఁగలయంశముల నన్నిఁటినిబహుసులభ శైలిని వ్రాసియున్నారు. పశువులుగల ప్రతివారును చదివితీరవలసిన గ్రంథము. చందాదారులకు రు 0-5-0. ఇతరులకు రు. 0-10-0.

## 15. చీనాదేశ చరిత్రము.

గ్రంథకర్త.—బేతపూడి లక్ష్మీకాంతరావుగారు.

ప్రపంచమునందలి అన్ని దేశముల చరిత్రములును చదవవలసిన యావశ్యకతయట్లుండగా ఎన్నో విధముల మనదేశముయొక్క పోలికగల చరిత్రమును చదివితీర వలసినదే. వెల చందాదారులకు రు. 0-13-0. లు. ఇతరులకు 1-4-0.

## 16. రాజ్యాంగ తంత్రము.

### మొదటి భాగము.

గ్రంథకర్త. వల్లూరి- సూర్యనారాయణరావుపంతులుగారు, బి.ఎ., బి.ఎల్.,

రాజకీయ స్వాతంత్ర్యములను నిబంధనానుకూల రాజకీయాందోళనములవలన సంపాదించుకొనఁగలుగుట ప్రపంచధర్మము. అట్టివాక్కులు మనహిందూదేశమునకును రావలసియున్నవి. ప్రజలందఱునట్టి యాందోళనము చేయుటకుముందు ప్రపంచమునందలి యన్నిదేశముల రాజ్యాంగ తంత్రములను గ్రహింపవలసియున్నది. ఇట్టి లోపమును ఆంధ్రలోకమునకు తీర్చుకొఱకీ గ్రంథమును గ్రంథకర్త రచియించెను. శైలిబహుసులభము. వెల చందాదారులకు రు. 1-0-0. ఇతరులకు రు. 1-8-0.

## 17. కమలకుమారి.

గ్రంథకర్త:— బాలకవి పారనంది వెంకటరమణమూర్తి.

శ్రీ శివాజీచక్రవర్తి శివ్యాగడమనుకోట పట్టుకొనిన కథ నవలగా వ్రాయబడినది. చందాదారులకు రూ. 0-10-0. ఇతరులకు వెల రూ. 1-0-0

## 18. రాజ్యాంగ తంత్రము.

### రెండవ భాగము.

గ్రంథకర్త:— మ-రా-రా. వల్లూరి సూర్యనారాయణరావు పంతులుగారు, బి. ఏ. బి. ఎల్. ఎల్. టి.

గ్రంథకర్తగారు దీని మొదటి భాగమునందు ఆంగ్లేయ రాజ్యాంగ తంత్రములును అమెరికాసంయుక్త రాష్ట్రీయము నతివిపులముగ వివరించి ఈభాగమునందు తక్కిన అన్నిదేశముల రాజ్యతంత్రములను అతి సులభశైలిని వివరించియున్నారు. శైలిబహుసులభము. వెల చందాదారులకు 0-8-0 ఇతరులకు 0-12-0.

## 19. ప్లేటోగారి రాజనీతి శాస్త్రము.

గ్రంథకర్త:— మల్లాది వెంకటరత్నంగారు. బి.ఎ., ఎల్. టి.

ఏయేపద్ధతులమీద స్వరాజ్యమును ఏర్పరచవలెనో తెలుపు గ్రంథము. కాలమునకు తగినగ్రంథము.

వెల చందాదారులకు రు 0-10-0 ఇతరులకు 0-14-0

## 20. తిమ్మరుసుమంత్రి.

గ్రంథకర్త:— చిలుకూరివీరభద్రరావు పంతులుగారు.

ఆంధ్రదేశమున తిమ్మరుసు పేరు తెలియనివారు లేరు. అట్టిమహానీయుని చరిత్రము చరిత్రాత్మకముగ వ్రాయబడినది. అవశ్యపఠనీయము.

వెల చందాదారులకు రు 0-5-0 ఇతరులకు 0-8-0లు.

---

## పునర్ముద్రణము కావలసిన గ్రంథములు.

3 అక్బరుచరిత్ర. 4 వివేకానందస్వామి జీవితము. 5 సిక్కులచరిత్ర. 6 విద్యాసాగరుని చరిత్ర. 7 రామమోహన రాయలచరిత్రము.

---

# శ్రీశివాజిచరిత్రము.

మహారాష్ట్ర దేశోద్ధారకుడును హైందవ జాతీయనాయకుడును అగు ఈ మహనీయుని చరిత్రము మ-రా-రా. కే. వి. లక్ష్మణరావుపంతులు ఎం. ఏ. గారిచే వ్రాయబడినది.

పెదదవైటు పేపరు. క్యాలికో బైండు. రంగులపటములు.

వెల రు 1—0—0 మాత్రము.

ప్రతి హైందవుడును చదివి తీరవలసిన పవిత్రగ్రంథము.

మావద్ద సరస్వతీ పత్రికాప్రకటన గ్రంథములు విడివిడిగాను వాల్యుములుగా బైండు చేయబడియునుఉన్నవి. ధరలు చాలాతగ్గించబడియున్నవి. కేటలాగు కావలసినవారు పయివిలాసమునకు వ్రాయవలెను. స్వల్పప్రతులు మాత్రముకలవు.

## ముందు రాఁబోవు గ్రంథములు.

# హిందూ దేశ ఐశ్వర్యము

---

గ్రంథకర్త:—వేమాసత్యనారాయణమూర్తిగారు బి.ఏ.,

అపూర్వగ్రంథము. తెలుగుభాషలోనిట్టి గ్రంథము ఇదివరకు ప్రక
బడలేదు. దేశములోని ద్రవ్యముతో సంబంధించిన అన్నిహాంశములను
ముగఁ చర్చింపబడును.

భూముల పైసలాపద్ధతి, కూలి, నద్దీలు, లాభములు, ఇండియాయందలి
స్సిద్ధముగానున్న ద్రవ్యసంపత్తి, శ్రమావిభాగము, మూలధనము, వర్తక
హారములయందు సపక్షభాగసమస్య, హిందూదేశమున నాణెముల
ము, బాంకినోట్లపద్ధతి, సర్కారుబ్యాంకులు, ప్రయివేటుబాంకులు,
తపు హెచ్చుధరలకు కారణములు. దేశీయబ్యాంకులు, ఇండియా
ఋణము, ఆదాయము, ఖర్చు, భూమిపన్ను విధానము. రైల్వేలపద్ధతులు,
యవ్యయములు, సేనాపద్ధతి, ఖర్చులు మొదలుగాగల అనేకవిషయ
, అన్యభాషలలోని గొప్పగ్రంథముల సహాయములవలనను, గవర్న
ు రిపోర్టులు, ఆదాయవ్యయపట్టికలు మొదలైనవాటి సహాయముచేతను
హా గ్రంథము ఆంధ్రులఅభివృద్ధికి తోడ్పడుటకుగాను బహువ్యయప్ర
లకోర్చి ముద్రించబడుచున్నది. కొలదికాలములో తయారగును.
సే ఆర్డరుచేయవలెను.

---

ప్రొఫెసరు రాధాకుముద ముకర్జీగారివలన రచియింపఁబడిన రెండు
సంవత్సరములయొక్క హిందూదేశ సముద్ర వ్యాపారప్రాముఖ్యము
ందులో ఆనాఁటి ఆంధ్రదేశముయొక్క ఔన్నత్యమును తెలియ
చరిత్రము,

థకర్త:—మ-రా-రా-శ్రీ చిలుకూరి వీరభద్రరావు పంతులుగారు.

శారదా పబ్లిషింగు కంపెనీ,

185 మవుంటురోడ్డు,

మద్రాసు.

# అమూల్యమైన గ్రంథములు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| గ్రామవ్యవహారబోధిని | ... | ... | 4 | 0 | 0 |
| క్రిమినలుప్రొసీజరుకోడ్డు | ... | ... | 5 | 0 | 0 |
| సివిలుప్రొసీజరు కోడ్డు | | .. | 5 | 8 | 0 |
| సాక్ష్యశాస్త్రము | . | | 2 | 8 | 0 |
| జమీందారీ గ్రామోద్యోగశాసనము | | . | 1 | 14 | 0 |
| వంశపారంపర్య గ్రామోద్యోగశాసనము | | | 0 | 12 | 0 |
| అభాగ్యజమీందారీల శాసనము | | .. | 0 | 8 | 0 |
| స్పెసి కొగ ఫ్రుఆక్టు | | | 0 | 12 | 0 |
| ఆయుధశాసనము | . | | 0 | 12 | 0 |
| అబ్కారీ ఆక్టు | ... | | 0 | 10 | 0 |
| కాలదోషముల ఆక్టు | ... | | 1 | 0 | 0 |
| మైనరుల గార్డియనుల ఆక్టు | | | 1 | 0 | 0 |
| దివాలా ఆక్టు | . | | 0 | 8 | 0 |
| పంచాయితీ ఆక్టు | | ... | 0 | 6 | 0 |
| దేవస్థానముల ఆక్టు | . . | ... | 1 | 4 | 0 |

ఈ గ్రంథములను వేనిని కోరినను పోస్టేజి మేమే భరించి

పం[redacted]

177

వలాసము

శారదా పబ్లిషింగు కంపెనీ,

185, మౌంటురోడ్డు, మద్రాసు.

PRINTED AT THE INDIA PRINTING WORKS MADRAS.

UNIVERSITY OF HYDERABAD
LIBRARY
T HYDERABAD ( A. P. )

Cl. No. 92 Acc. No. 29416
V51T

DATE DUE

DURATION OF LOAN — Not later than the last date stamped below, failing which fine as per Library Rules will be charged.

UNIVERSITY OF HYDERABAD, LIBRARY

T

Acc. No. 29416

Call No. 92 VSIT

Author వీరభద్రరావు, చిలుకూరి

Title [illegible]

**UNIVERSITY OF HYDERABAD**

**LIBRARY**

**HYDERABAD (A. P.)**

1. Books / Journals should be returned on the due date.

2. Borrowers are responsible for every book / journal taken by them and will be expected to pay for any book / journal *damaged, defaced or lost.*

**Help to keep the book fresh and clean**